www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రైతులకు వినేశ్ మద్దతు

శంభూ సరిహద్దు వద్ద సంఘీభావం
200వ రోజుకు చేరిన ఆందోళన
డిమాండ్లపై ప్రార్థిస్తున్నట్లుగా వెల్లడి
మీ వెంటే ఉంటానంటూ భరోసా
రాజకీయాలపై సమాధానం దాటవేత
ఆమెను కాంగ్రెస్‌లోకి తెచ్చే యత్నం!

9

హరియాణా ఎన్నికల
షెడ్యూల్లో మార్పులు
పోలింగ్ అక్టోబరు 1 బదులు 5న..
లెక్కింపు 8న

30 ఏళ్ల ముందే గుండెజబ్బుల గుర్తింపు!
రక్త పరీక్ష ద్వారా సాధ్యం

ఎల్‌డీఎల్‌తో పాటు సీ రియాక్టివ్ ప్రొటీన్, లిపో ప్రొటీన్ల ద్వారా వెల్లడి
30 వేల మంది మహిళలపై 1992-95లో జరిగిన అధ్యయనంపై సరికొత్త విశ్లేషణ
'యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్'లో పరిశోధన పత్రం

9

ఆదివారం | 1-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 138

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి తె. 5.22 తదుపరి అమావాస్య నక్షత్రం: ఆశ్లేష రా. 9.49 తదుపరి మఖ; వర్జ్యం: ఉ. 9.36-11.21; దుర్ముహూర్తం: సా. 4.46-5.35; అమృతఘడియలు: రా. 8.04-9.49; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.24

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వేల మైళ్ళ ప్రయాణం
మొదలవుతుంది
దృఢమైన పునాదితో

—— సగర్వంగా ఉల్లాసంగా జరుపుకుంటున్నాము ——



మా 68వ వార్షికోత్సవం సందర్భంగా,
విశ్వసనీయ బంధాలతో మీతో కలిసికట్టుగా
సంబరాలను జరుపుకుంటూ,
మీ జీవితకాల ప్రయాణాన్నీ ఆనందమయం చేస్తాము.

LIC
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా

LIC/P1/2024-25/04/Tel

ఎండోమెంట్, టర్మ్, యులిప్, యాన్యూటి, ఆరోగ్య మరియు గ్రూప్ ప్లాన్స్‌తో బీమా రక్షణ పొందండి.

మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి | డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital | సందర్శించండి: licindia.in | కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827 | మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512



సిక్సర్ల పిడుగులు

- ప్రియాన్ష్ ఆరు బంతుల్లో ఆరు
- బదోని 19 సిక్స్‌లతో విజృంభణ
- ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రికార్డుల మోత

న్యూఢిల్లీ: ప్రియాన్ష్ ఆర్య (50 బంతుల్లో 120) ఆరు బంతుల్లో ఆరు సిక్సర్ల అరుదైన ఫీట్‌తోపాటు ఆయుష్ బదోని (55 బంతుల్లో 165) 19 సిక్స్‌లతో ఊచకోత కోయడంతో.. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రికార్డుల మీద రికార్డులు బద్దలయ్యాయి. శనివారం నార్త్ ఢిల్లీ స్ట్రయికర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్య, బదోని రెండో వికెట్‌కు 103 బంతుల్లో 286 పరుగుల అత్యధిక భాగస్వామ్యం నమోదు చేయడంతో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 308 పరుగుల భారీ స్కోరు చేసింది. టీ20ల్లో ఇది రెండో అత్యధిక స్కోరు. ఆర్య 12వ ఓవర్‌లో స్పిన్నర్ భరద్వాజ్ బౌలింగ్‌లో వరుస ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లు బాదాడు. ఈ క్రమంలో దేశవాళీ క్రికెట్‌లో ఈ ఫీట్ సాధించిన నాలుగో ఆటగాడిగా 23 ఏళ్ల ఆర్య నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో యువరాజ్, పొలార్డ్, దీపేంద్ర సింగ్ (రెండుసార్లు) ఈ ఘనత సాధించారు. కాగా, ఐపీఎల్ ఆటగాడు బదోని ఏకంగా 19 సిక్స్‌లతో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్ గ్రేట్ క్రిస్ గేల్, ఎస్తోనియా ఆటగాడు సాహిల్ చౌహాన్ ఓ టీ20 మ్యాచ్‌లో అత్యధికంగా 18 సిక్స్‌లు కొట్టారు. వీరిని 24 ఏళ్ల బదోని అధిగమించాడు. అయితే, 309 పరుగుల లక్ష్య ఛేదనలో నార్త్ ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి 196/8 స్కోరు మాత్రమే చేసి ఓటమిపాలైంది.



మహిళల కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో రన్నరప్‌గా నిలిచిన ట్రినిబాగో నైట్‌రైడర్స్ జట్టు ప్లేయర్లు శిఖా పాండే, జెమీమా రోడ్రిగ్స్, తెలుగమ్మాయి ప్రణవి చంద్ర (మధ్య). ఈ లీగ్‌లో బార్బడోస్ రాయల్స్ టీమ్ విజేతగా నిలిచింది.

పారిస్ పారాలింపిక్స్‌లో వరుసగా రెండోరోజూ భారత్ పతకంతో మురిసింది. షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం అందుకుంది. దీంతో భారత్ ఖాతాలో ఐదో పతకం చేరింది. ఇక ఆర్చరీలో ఆశలు రేపిన 17 ఏళ్ల సంచలనం శీతల్ దేవి, సరితా దేవిల పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో కేవలం పాయింట్ తేడాతో శీతల్ వెనుదిరగగా.. సరిత క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. తెలుగు క్రీడాకారులైన రోయర్ నారాయణ, సైక్లిస్ట్ షేక్ అర్షద్ పేలవ ప్రదర్శనతో నిరాశపరిచారు.


భళా.. రుబీనా

కాంస్యం గెలిచిన షూటర్

భారత్ ఖాతాలో ఐదో పతకం

శీతల్‌కు నిరాశ

పారాలింపిక్స్



పారిస్: పారాలింపిక్స్‌లో భారత షూటర్లు హవా సాగిస్తున్నారు. వీరి గురి తప్పని తూటా కారణంగా మూడో రోజు కూడా పతక భాగ్యం కలిగింది. మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1లో షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ కాంస్యం అందుకుంది. ఇప్పటికే షూటింగ్‌లో అవనికి స్వర్ణం, మనీశ్‌కు రజతం, మోనాకు కాంస్యం దక్కిన విషయం తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో 25 ఏళ్ల రుబీనా కూడా చేరింది. ఓవరాల్‌గా భారత్ ఖాతాలో ఐదు పతకాలు చేరగా ఇందులో నాలుగు షూటర్ల ద్వారానే రావడం విశేషం. డిఫెండింగ్ చాంపియన్‌తో పాటు వరల్డ్ రికార్డు షూటర్ పాల్గొన్న శనివారం జరిగిన ఫైనల్లో రుబీనా కఠిన పోటీని తట్టుకుంటూ 211.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. స్టేజి 1లో 10 షాట్లు ముగిసేసరికి మూడో స్థానంలో నిలిచింది. అయితే 14వ షాట్ తర్వాత నాలుగో స్థానానికి పడిపోయింది. ఈ దశలో ఒత్తిడికి లోనుకాకుండా చివరి సిరీస్‌లో 9.2, 8.9 స్కోరుతో కంచు మోత మోగించింది. అంతకుముందు క్వాలిఫై రౌండ్‌లో తను 556 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి తుది పోరుకు అర్హత సాధించింది. టోక్యో పారాగేమ్స్ లోనూ రుబీనా ఫైనల్‌కు వెళ్లినప్పటికీ ఏడో స్థానంలో నిలిచి వెనుదిరిగింది. మరోవైపు పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1లో స్వరూప్ ఉన్హాల్కర్ క్వాలిఫై ఈవెంట్‌లో 14వ స్థానంలో నిలిచి నిరాశపర్చాడు.

స్థిరంగా నిల్చోలేని స్థితి నుంచి..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన రుబీనా ఫ్రాన్సిస్‌కు జన్మతహా పాదాలు వంకరగా ఉండేవి. దాంతో సరిగ్గా నిలుచోలేకపోయేది. రుబీనా బాల్యం నుంచే షూటింగ్ పట్ల ఆసక్తి పెంచుకుంది. అయితే, షూటర్ గురి కుదరాలంటే స్థిరంగా నిలుచోవడం ఎంతో ముఖ్యం. కానీ సరిగ్గా నిలుచోలేని రుబీనా షూటింగ్‌లో రాణిస్తుందా అన్న అనుమానాలు ఉండేవి. ఇక, మెకానిక్ అయిన తండ్రి సిమోన్ ఫ్రాన్సిస్ ఆదాయం అంతంతమాత్రంగా ఉండేది. దాంతో కూతురుని షూటింగ్‌లో ప్రోత్సహించడానికి తొలుత వెనుకాడినా, రుబీనా పట్టుదల చూసి ఆమెను షూటర్‌గా తీర్చిదిద్దాలని సిమోన్ నిర్ణయించుకున్నాడు. 2015లో జాతీయ పారా షూటింగ్ చీఫ్ కోచ్ జై ప్రకాష్ నౌతియాల్ ఆమెకు మార్గదర్శనం చేశాడు. రుబీనా సరిగ్గా నిలుచునేందుకు అతడు ప్రత్యేకంగా బూట్లు తయారు చేయించాడు. ఆపై నిటారుగా నిలుచొని షూట్ చేయడం మరో సవాలుగా నిలిచింది. అందుకోసం రుబీనాతోపాట నౌతియాల్ ఎంతో శ్రమించాడు. నౌతియాల్ పర్యవేక్షణలో భోపాల్‌లోని షూటింగ్ అకాడమీలో ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా తమ్ముడు సుభాష్ ఆధ్వర్యంలో రుబీనా శిక్షణ పొందింది. 2017లో పుణెలోని గగన్ నారంగ్ అకాడమీ 'గన్ ఫర్ గ్లోరీ'లో ఆమె తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. 2021 వరల్డ్ కప్ ద్వారా పారిస్‌బెర్త్ దక్కించుకున్న 25 ఏళ్ల రుబీనా.. ఇప్పుడు పారాలింపిక్ పతకంతో తన ఖ్యాతిని పెంచుకుంది.

విఫలమైన తెలుగు అథ్లెట్లు

పారాగేమ్స్‌లో తెలుగు అథ్లెట్లు నారాయణ, అర్షద్ ఆకట్టుకోలేకపోయారు. ఏపీకి చెందిన సైక్లిస్ట్ షేక్ అర్షద్ పురుషుల 1000 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1-3 క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఆఖరి, 17వ స్థానంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన 3000 మీటర్ల సీ2 ఈవెంట్‌లోనూ అర్షద్ ఆఖరి స్థానం (9)లో నిలిచిన విషయం తెలిసిందే. ఇక మహిళల 500 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1-3లో జ్యోతి గడెరియా కూడా 11వ స్థానంలో ఆఖరున నిలిచింది. కాగా.. అర్షద్, జ్యోతి రోడ్ సైక్లింగ్ ఈవెంట్‌లోనూ పోటీపడనున్నారు. ఇక రోయింగ్‌లో మిక్స్‌డ్ పీఆర్3 డబుల్స్ స్కల్స్ ఈవెంట్‌లో అనిత-నారాయణ జోడీ మెడల్ రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. రెపిచేజ్2లో ఈ జంట 7 నిమిషాల 54.33 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి ఫైనల్ బికి చేరింది. దీంట్లో ఈ ద్వయం 7 నుంచి 12వ స్థానం కోసం పోటీపడనుంది.

పాయింట్ తేడాతో..



అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శనతో పారాగేమ్స్‌లోనూ పతక ఆశలు రేపిన 17 ఏళ్ల టీనేజ్ ఆర్చర్ శీతల్ దేవికి నిరాశే ఎదురైంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ప్రీక్వార్టర్స్‌లో ఆమె కేవలం పాయింట్ తేడాతో ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది. చిలీకి చెందిన మరియాన జునిగ చేతిలో శీతల్ 137-138 తేడాతో ఓడింది. తొలి సెట్‌ను 10,10 పాయింట్లతో దీటుగా ఆరంభించిన శీతల్ గెలుపు దిశగానే సాగింది. అటు ప్రత్యర్థి కూడా గట్టిపోటీ ఇవ్వడంతో నాలుగు సెట్లు ముగిసేసరికి 111 స్కోరుతో ఇరువురూ సమంగా నిలిచారు. ఇక చివరిదైన ఐదో సెట్‌లో శీతల్ 8,10,8తో 26 పాయింట్లు సాధించగా, జునిగ 27 పాయింట్లతో విజేతగా నిలిచింది. మరోవైపు ఇదే విభాగంలో క్వార్టర్స్ చేరిన భారత ఆర్చర్ సరితా దేవి 140-145తో వరల్డ్ చాంపియన్ ఒజ్నర్ (తుర్కియే) చేతిలో ఓటమిపాలైంది.



భారత్ అండర్-19 జట్టులో జూనియర్ ద్రవిడ్

న్యూఢిల్లీ: భారత మాజీ చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్‌కు జాతీయ అండర్-19 జట్టులో చోటు లభించింది. స్వదేశంలో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగే మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం టీమిండియాను బీసీసీఐ శనివారం ప్రకటించింది. పుదుచ్చేరిలో సెప్టెంబరు 21, 22, 26వ తేదీల్లో మూడు వన్డేల సిరీస్ జరగనుండగా.. చెన్నై వేదికగా రెండు నాలుగో రోజుల మ్యాచ్‌లు సెప్టెంబరు 30, అక్టోబరు 7న మొదలవుతాయి. వన్డే సిరీస్‌కు అమ్మాన్, నాలుగు రోజుల సిరీస్‌కు సోహమ్ సారథులుగా వ్యవహరిస్తారు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండరైన 18ఏళ్ల సమిత్‌కు రెండు ఫార్మాట్ల జట్లలోనూ చోటు లభించింది. కూచ్ బెహార్ ట్రోఫీని కర్ణాటక తొలిసారి నెగ్గడంలో సమిత్ కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 8 మ్యాచ్‌ల్లో 362 రన్స్ చేసిన అతడు, 16 వికెట్లు తీశాడు.

పాక్ 274 ఆలౌట్

రావల్పిండి: ఆఫ్ స్పిన్నర్ మెహ్దీ హసన్ (5/61) తిప్పేయడంతో.. పాకిస్థాన్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ కొంత పైచేయి కనబర్చింది. మ్యాచ్‌కు రెండోరోజైన శనివారం పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274 రన్స్‌కు ఆలౌటైంది. ఓపెనర్ సాయిమ్ అయూబ్ (58), కెప్టెన్ షాన్ మసూద్ (57), సల్మాన్ ఆఘా (54) రాణించారు. టస్కిన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా.. శనివారం ఆట ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 10 రన్స్ చేసింది. వర్షంతో తొలిరోజు ఆట పూర్తిగా రద్దయింది.

రూట్ సూపర్ సెంచరీ

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 251
లంక లక్ష్యం 483

లండన్: శ్రీలంకతో రెండో టెస్టులో జో రూట్(103) రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించడంతో ఇంగ్లండ్ 251 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో ఇంగ్లండ్ తరఫున ఎక్కువ టెస్టు శతకాలు (34) సాధించిన బ్యాటర్‌గా రూట్ నిలిచాడు. ఆ తర్వాత 483 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంక మూడోరోజు శనివారం ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 53 రన్స్ చేసింది. విజయానికి లంక ఇంకా 430 పరుగుల దూరంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 427, లంక 196 రన్స్ చేశాయి.

యూఎస్ ఓపెన్

జొకోకు ఝలక్



మూడో రౌండ్‌లో ఆసీస్ ఆటగాడి చేతిలో ఓటమి



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో సంచలనాలపై సంచలనాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్న టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కారజ్‌కు చుక్కెదురైతే..తాజాగా డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు షాక్ తగిలింది. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన 37 ఏళ్ల సెర్బియా దిగ్గజ ఆటగాడిని ఆస్ట్రేలియాకు చెందిన అలెక్సీ పాపిరిన్ కంగుతినిపించాడు. శనివారం తెల్లవారుజామున జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో 28వ సీడ్ పాపిరిన్ 6-4, 6-4, 2-6, 6-4తో జొకోవిచ్‌పై విజయం సాధించాడు. మ్యాచ్‌లో నొవాక్ ఏకంగా 14 డబుల్‌ఫాల్ట్‌లు చేయడం గమనార్హం. తొలి రెండు సెట్లు కోల్పోయిన జొకో..మూడో సెట్లో గెలుపొందడంతో అతడిలో పోరాట యోధుడు విజృంభించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంటాడేమో అనిపించింది. కానీ తన ఆట మరీ దిగజారడంతో నొవాక్‌కు ఓటమి తప్పలేదు. ఇక..మూడోసీడ్ అల్కారజ్ రెండో రౌండ్‌లోనే ఓడిన సంగతి తెలిసిందే. మిగతా స్టార్లలో 4వ సీడ్ జ్వెరెవ్ 5-7, 7-5, 6-1, 6-3తో ఎచెవెరీని, 8వ సీడ్ కాస్పెర్ రూడ్ 6-7 (7), 3-6, 6-0, 6-3, 6-1తో షాంగ్‌ని, 9వ సీడ్ డిమిత్రోవ్ 6-3, 6-3, 6-1తో గ్రీక్‌స్పూర్‌ని, 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6-3, 6-4, 6-2తో కొమెసనాని, 20వ సీడ్ టియఫో 4-6, 7-5, 6-7 (5), 6-4, 6-3తో 13వ సీడ్ బెన్ షెల్టన్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్ సబలెంకా 2-6, 6-1, 6-2తో అలెగ్జాండ్రోవాపై, 5వ సీడ్ పౌలిని 6-3, 6-4తో పుతిన్‌త్సెవాపై, 6వ సీడ్ పెగులా 6-3, 6-3తో బౌజాస్‌పై, 33వ సీడ్ మెర్టెన్స్ 6-7 (7), 7-5, 6-4తో 14వ సీడ్ మాడిసన్ కీస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

2017 తర్వాత తొలిసారి..

ఒక ఏడాది కనీసం ఒక్క గ్రాండ్‌స్లామ్ లేకుండా ముగించడం 2017 తర్వాత జొకోకు ఇదే తొలిసారి. అంతకుముందు 2010 సీజన్‌నూ నొవాక్ ఇలాగే ముగించాడు. ఇక..ప్రపంచ టెన్నిస్ 'బిగ్ త్రీ' జొకోవిచ్, నడాల్, ఫెడరర్‌లో ఏ ఒక్కరూ గ్రాండ్‌స్లామ్ గెలవకుండా ఉండడం 2002 తర్వాత ఇదే మొదటిసారి.

ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరు

ఎన్‌బీసీసీ ఇండియా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్‌బీసీసీ (ఇండియా) లిమిటెడ్... వాటాదారులకు బంపర్ బొనాంజా ప్రకటించింది. అర్హులైన వాటాదారులకు ప్రతి రెండు షేర్లకు రూపాయి ముఖ విలువతో కూడిన ఒక బోనస్ షేరు (1:2 నిష్పత్తి)ను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బోర్డు ఆమోదం లభించిందని పేర్కొంది. ఇందుకోసం తన దగ్గర ఉన్న రూ.90 కోట్ల ఫ్రీ రిజర్వ్ మొత్తాలను వినియోగించనున్నట్లు ఎన్‌బీసీసీ తెలిపింది. వచ్చే కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారుల అనుమతికి లోబడి ఈ షేర్ల జారీ ఉంటుందని పేర్కొంది. కాగా అర్హులైన వాటాదారులకు బోనస్ షేర్ల జారీకి అక్టోబరు 7వ తేదీని రికార్డు తేదీగా ఖరారు చేసినట్లు తెలిపింది. బోనస్ షేర్ల జారీ ద్వారా వాటాదారుల విలువ పెరగటమే కాకుండా కంపెనీ పట్ల వారికి మరింత విశ్వాసం పెరుగుతుందని ఎన్‌బీసీసీ సీఎండీ కేపీ మహదేవ స్వామి తెలిపారు. 2017లో కూడా కంపెనీ 1:2 నిష్పత్తిలోనే బోనస్ షేర్లను జారీ చేసింది. ప్రస్తుతం కంపెనీ ఆర్డర్ బుక్ రూ.81,300 కోట్లుగా ఉంది.

ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు చిప్‌సెట్ల కొరత

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా పెరిగిన సరఫరా అవాంతరాలు
- ఈసారి పండగ విక్రయాలపై ప్రభావం!!



న్యూఢిల్లీ: టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల (కన్స్యూమర్ డ్యూరబుల్స్)ను తయారీ చేసే కంపెనీలకు చిప్ సెట్ల కొరత మొదలైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో తలెత్తిన సరఫరా అవాంతరాల కారణంగా అంతర్జాతీయంగా చిప్‌సెట్లకు ఆకస్మిక కొరత ఏర్పడిందని, దాంతో ఉత్పత్తుల తయారీ జాప్యమవుతోందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ పరిణామం పండగ సీజన్‌లో తమ ఉత్పత్తుల లభ్యత, విక్రయాలపై ప్రభావం చూపవచ్చని వారు అభిప్రాయపడ్డారు. చిప్ సెట్ల సరఫరా మళ్లీ సాధారణ స్థితికి ఎప్పుడు చేరుకుంటుందని అంచనాకు రాలేకపోతున్నట్లు ఎస్‌పీపీఎల్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా అన్నారు. అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థాంప్సన్ ఉత్పత్తులను భారత్‌లో విక్రయించేందుకు ఎస్ఎస్‌పీఎల్ ఎక్స్‌క్లూజివ్ లైసెన్స్ కలిగి ఉంది.

ద్వితీయార్ధంపైనే ఆశలు: లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ ఏడాది ప్రథమార్ధంలో కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే నమోదైంది. ద్వితీయార్ధంలో, ముఖ్యంగా పండగ సీజన్‌లో డిమాండ్ 40 శాతం వరకు పెరగవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కానీ, చిప్ సెట్ల కొరత కారణంగా డిమాండ్‌కు తగ్గ స్థాయిలో మార్కెట్లోకి ఉత్పత్తులను సరఫరా చేయలేకపోవచ్చన్నారు. దాంతో గిరాకీని సొమ్ము చేసుకునే అవకాశం కోల్పోవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అయితే, పండగ సీజన్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తుల నిల్వలను ఇప్పటికే పెంచుకున్న కంపెనీల పైన మాత్రం చిప్‌సెట్ల కొరత ప్రభావం ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నాయి.

హెచ్ఏఎల్ సీఎండీగా డీకే సునీల్



బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (అదనపు బాధ్యతలు)గా డీకే సునీల్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన హెచ్ఏఎల్ డైరెక్టర్ (ఇంజనీరింగ్, ఆర్ అండ్ డీ)గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు సీఎండీగా విధులు నిర్వరించిన సీబీ అనంతకృష్ణన్ పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో సునీల్ శనివారం నాడు అదనపు బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందిన సునీల్ 1987లో హెచ్ఏఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరారు. అలాగే ఐఐటీ మద్రాస్ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ పట్టాను అందుకున్నారు. గడిచిన 37 ఏళ్లలో కంపెనీలోని వివిధ విభాగాల్లో ఈయన కీలక బాధ్యతలను నిర్వర్తించారు.

ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా వినియోగదారులకు వాహన ఫైనాన్సింగ్ సేవలను యూబీఐ అందించనుంది. ప్రైవేట్ వినియోగం కోసం టయోటా వాహనాలు కొనుగోలు చేసే వారికి ఆన్‌రోడ్ ధరపై 90 శాతం వరకు రుణాన్ని బ్యాంక్ అందించనుందని టీకేఎం తెలిపింది.

ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లి పెట్టుబడులు కలిగిన రేజ్ కాఫీ బ్రాండ్ మాతృసంస్థ సంభావన్ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎఫ్ఎంసీజీ సంస్థ జీఆర్ఎం ఓవర్సీస్ లిమిటెడ్ 44 శాతం వాటాలను చేజిక్కించుకుంది. అయితే ఎంత మొత్తానికి ఈ వాటాను కొనుగోలు చేసిందనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. దేశవ్యాప్తంగా ఐదు వేలకు పైగా మోడర్న్ రిటైల్ ఔట్‌లెట్స్‌ను రేజ్ కాఫీ నిర్వహిస్తోంది.

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 7.20 లక్షల వాహనాల రీకాల్



ముంబై: ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆటోమొబైల్ కంపెనీలు దాదాపు 7.20 లక్షల వాహనాలను రీకాల్ చేశాయి. అందులో 96 శాతం ద్విచక్ర వాహనాలేనని భారత వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) తాజా డేటా ద్వారా వెల్లడైంది. అంతేకాదు, ఈ ఏడాది మొదటి 8 నెలల్లోనే కంపెనీలు వెనక్కి రప్పించిన వాహనాల సంఖ్య.. గత రెండు సంవత్సరాల్లో రీకాల్ చేసిన వెహికిల్స్ కంటే అధికం. 2023లో 2.85 లక్షలు, 2022లో 2.89 లక్షల వాహనాలను కంపెనీలు వెనక్కి రప్పించాయి. గడిచిన కొన్నేళ్లలో వెహికిల్ రీకాల్స్ అనూహ్యంగా పెరగడానికి 2021లో కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి కఠిన విధానాన్ని అమలులోకి తేవడమే ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. గడిచిన కొన్నేళ్లలో కార్ల విక్రయాలు భారీగా వృద్ధి చెందినప్పటికీ, దేశీయ వాహన మార్కెట్లో టూవీలర్ విభాగానిదే 81 శాతం వాటా. అందుకే వాహన రీకాల్స్‌లోనూ ద్విచక్ర వాహనాల సంఖ్యే అధికంగా ఉంటోంది. కాగా, కార్ల విభాగంలో 55 శాతం మార్కెట్ వాటా కలిగిన మారుతి సుజుకీ, హ్యూండయ్ మోటార్ ఈ ఏడాది దాదాపు 12,000 వాహనాలను వెనక్కి పిలిపించాయి. సాంకేతిక లేదా ఇతర లోపాలను సరిదిద్దేందుకు ఆటోమొబైల్ కంపెనీలు కస్టమర్ల వద్దనున్న వాహనాలను వెనక్కి రప్పించడం (రీకాల్) పరిపాటే. బ్రాండ్ పరపతిని, కస్టమర్లలో తమ పట్ల ఉన్న నమ్మకాన్ని కాపాడుకునేందుకు ఆటోమొబైల్ కంపెనీలు రీకాల్ చేసిన వాహనాల్లోని లోపాలను ఉచితంగా సరిదిద్ది, తిరిగి కస్టమర్లకు అందజేస్తుంటాయి.

2024లో టాప్ రీకాల్స్

కంపెనీ	ఏయే మోడళ్లు	ఎన్ని యూనిట్లు
సుజుకీ మోటార్‌సైకిల్	యాక్సెస్ 125, అవెనిస్ 125, బర్గ్‌మన్ 125	3,88,500
యమహా మోటార్స్	రే జెడ్ఆర్ ఎఫ్ఐ 125, ఫాసినో సీఐ 125	3,00,725
మెర్సిడెస్ బెంజ్	జీఎల్ఈ 450, ఈక్యూఎస్ జీఎల్‌సీ, ఏఎంజీ ఎస్ఎల్, ఏఎంజీ జీఎల్ఏ, ఎస్, ఈ	15,167
హ్యుండయ్	ఐయానిక్ 5, క్రెటా, వెర్నా	9,442
టయోటా కిర్లోస్కర్	ల్యాండ్ క్రూయిజర్, గ్లాంజా లెక్సస్ ఆర్ఎక్స్, లెక్సస్ ఎన్ఎక్స్	2,735
మారుతి సుజుకీ	ఆల్టో కే 10	2,555

ఇదీ GST: లైన్ సేల్స్ చేస్తున్నారా?



రాంబాబు గొండాల

వ్యాపారస్తులు తమ అమ్మకాలను పెంచుకోవటానికి రకరకాల వ్యూహాలను అమలు చేస్తుంటారు. లైన్ సేల్స్ కూడా అటువంటిదే. దీనినే డైరెక్ట్ సేల్ అని కూడా వ్యవహరిస్తారు. అంటే షాపుల ద్వారా కాకుండా కొనుగోలు దారుల ఇళ్ల వద్దకు వచ్చి అమ్మకాలు జరపటం. నిజానికి లైన్ సేల్ అనేది కొత్త విషయమేమీ కాదు. సైకిళ్ల మీద బట్టల మూట పెట్టుకుని ఊరూరు తిరుగుతూ అమ్మకాలు చేయటం, ఇళ్ల ముందుకు ఆటోలో వచ్చి స్టీల్, ప్లాస్టిక్ సామాన్లు అమ్మటం ఇదే కోవలోకి వస్తుంది. అయితే ఇలా చిరు వ్యాపారస్తులే కాకుండా పెద్ద వ్యాపారస్తులు కూడా ఈ విధమైన లైన్ సేల్స్ చేస్తుంటారు. ఇలా లైన్ సేల్ చేసే వారికి కొనుగోలు దారుని చిరునామా, అమ్ముడుపోయే సరుకు విలువ ముందుగా తెలియదు. అందుకే జీఎస్‌టీలో లైన్ సేల్ చేసే వారికి ఒక సమస్య ఉంది. అదే ఈ-వే బిల్ ఎలా తయారు చేయాలనేది. ఏదేనీ మోటార్ వాహనంలో రూ.50,000 మించి సరుకు రవాణా చేస్తుంటే ఈ-వే బిల్ తప్పనిసరి. అలాగే ఈ-వే బిల్ కావాలంటే కొనుగోలుదారుని చిరునామా, అమ్మకపు విలువ తెలియాలి. మరి ఇలాంటి సందర్భంలో ఈ- వే బిల్ ఎలా జారీ చేయాలో తెలుసుకుందాం.

వాస్తవానికి ఈ లైన్ సేల్ అనేది కేవలం ఇళ్ల వద్దకు వచ్చి వ్యాపారం చేసే వారికే పరిమితం కాదు. బట్టలు, ఫ్యాన్సీ, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను నేరుగా షాపుల వద్దకు తీసుకుని వెళ్లి విక్రయిస్తుంటారు. ఈ లైన్ సేల్ చేసే వారి సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈ-వే బిల్ పోర్టల్‌లో దీనికి సంబంధించి ఒక సదుపాయం కల్పించారు. ఈ లైన్ సేల్ చేసే వారు.. ఇన్వాయిస్ బదులుగా డెలివరీ చలాన్ జారీ చేయాల్సి ఉంటుంది. సరుకు అమ్ముడు పోయినప్పుడు కొనుగోలుదారుని పేరిట ఇన్వాయిస్ ఇవ్వాలి. ఇది వీలుని బట్టి మాన్యువల్‌గా గానీ, హ్యాండ్‌హెల్డ్ మెషిన్ ద్వారా గానీ ఇవ్వవచ్చు. ఇక ఈ-వే బిల్ జారీ చేయటానికి, ఈ-వే బిల్ పోర్టల్‌లో 'లైన్ సేల్స్' అనే ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఇది సప్లయ్ టైప్: అవుట్‌వార్డ్ అని ఇచ్చిన తర్వాత సబ్-టైప్ దగ్గర ఈ లైన్ సేల్స్ అనే ఆప్షన్ కనబడుతుంది. అలాగే సరఫరాదారుని, కొనుగోలుదారుని రెండు జీఎస్‌టీ వివరాలకు స్వంత జీఎస్‌టీ వివరాలు ఇవ్వాలి. ఇక సరఫరా జరిగే ప్రదేశం వివరాలు ముందుగా తెలియవు కాబట్టి, తను వెళ్లే మార్గంలో చివరి ఊరు పేరు నమోదు చేయాలి. అలాగే వస్తువుల విలువ దగ్గర రవాణా అయ్యే సరుకు మొత్తం విలువ నమోదు చేయాలి. సరైన ఈ-వే బిల్ లేకుండా రవాణా చేస్తుంటే అట్టి సరుకును సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంటుంది. అలాగే దీనికి సంబంధించిన పెనాల్టీ కూడా భారీ మొత్తంలో ఉంటుంది. కాబట్టి లైన్ సేల్స్ చేసే వ్యాపారస్తులు తాము బయలుదేరటానికి ముందే ఇలా అన్ని వివరాలతో కూడిన ఈ-వే బిల్, డెలివరీ చలాన్స్‌ను సిద్ధం చేసుకోవాలి. అలాగే అమ్ముడుపోయిన సరుకుకు ఇన్వాయిస్ జారీ చేయటం, దానికి సంబంధించిన ట్యాక్స్‌ను నిర్ణీత గడువు లోపు కట్టడం మరిచిపోకూడదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,040 ▼	66,950 ▼	92,000 ▼
ముంబై	72,000 ▲	65,950 ▲	85,070 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



సెప్టెంబరు 1వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	505
వరంగల్	497	గోదావరి	505
చిత్తూరు	508	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	103
వరంగల్	99	గుంటూరు	103
కరీంనగర్	99	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	92
విశాఖపట్నం	99	అనంతపురం	98
గోదావరి	103		



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పెన్షన్లు పంపిణీ
నేడు సెలవు కావడంతో ఓ రోజు ముందే
60 లక్షల పింఛన్ల అందజేత
పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
9
భారీ వర్షాల కారణంగా
కర్నూలు జిల్లాలో బాబు పర్యటన రద్దు

ఆదివారం | 1-9-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ప్రాణం కోసం పోరాటం



ఏలూరు జిల్లా నూజివీడులోని పెద్దచెరువుకు గండి పడడంతో ఇళ్లల్లో చిక్కుకున్న వారిని తాళ్లసాయంతో బయటకు తీసుకొస్తున్న దృశ్యం

ప్రాణం తీసిన కొండ



విజయవాడ సున్నపుబట్టీల సెంటర్‌లో కొండచరియలు విరిగిపడి ఐదుగురు సజీవ సమాధి అయిన ప్రాంతంలో సహాయక చర్యలు

కుండపోత!


రోజంతా ముంచెత్తిన వాన.. బెజవాడ అతలాకుతలం

పలు జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తం

బెజవాడ, గుంటూరుల్లో 9 మంది బలి
ముంపులో 62,550 హెక్టార్ల పంటలు

- కొండరాళ్లు ఇళ్లపై పడి ఆరుగురు దుర్మరణం
- వాగులో కారు కొట్టుకుపోయి ముగ్గురు మృతి
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- నూజివీడులో పెద్ద చెరువుకు గండి 11
- తాళ్ల సాయంతో బయటపడిన స్థానికులు
- కాజ టోల్‌ప్లాజా వద్ద హైవే పైకి భారీగా వరద

బెజవాడలో 50 ఏళ్ల రికార్డు వాన
ఒక్క 'తూర్పు'లోనే 174.2 మి.మీ. నమోదు



బెజవాడ వన్‌టౌన్ ప్రాంతంలో నీట మునిగిన కార్లు, బైకులు

రెండు ప్రధాన హైవేలపైకీ నీరు

వాయుగుండం ప్రభావంతో శనివారం పలు జిల్లాల్లో కుండపోతగా వర్షం పడింది. ఉదయం నుంచి కురిసిన జడివాన జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఆకాశానికి చిల్లు పడినట్లుగా ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షం పడుతూనే ఉండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీటితో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. . రాష్ట్రవ్యాప్తంగా 9 మంది చనిపోగా, 62,550 హెక్టార్లలో పంటలు ముంపుబారిన పడ్డాయి. గుంటూరు జిల్లా కాజా టోల్‌ప్లాజా వద్ద నడుం లోతున వరదనీరు ప్రవహించి, కోల్‌కతా-చెన్నై హైవే బ్లాక్ అవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. మరోవైపు ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో వాగు పొంగి హైదరాబాద్-విజయవాడ హైవేపైకి నీరు చేరడంతో కొంతసేపు ట్రాఫిక్ మళ్లించాల్సి వచ్చింది.

నేడూ అతి భారీ వర్షాలు

రాత్రి పొద్దుపోయాకా సీఎం సమీక్ష
సహాయక చర్యలపై అధికారులకు ఆదేశాలు



నేతలూ.. తస్మాత్ జాగ్రత్త!


ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు కావాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా స్థానిక ఎమ్మెల్యే అనుమతి తీసుకోవాలా? ఏ చట్టంలో, ఏ రాజ్యాంగంలో ఇలా రాశారు? అధికారుల విధుల్లో జోక్యం చేసుకొనే అధికారం ఎమ్మెల్యేలకు ఎవరిచ్చారు?

గత ప్రభుత్వంపై ఏవగింపుతో ప్రజలు తమకు అఖండ విజయాన్ని అందించారన్న వాస్తవాన్ని మరచి కొంతమంది శాసనసభ్యులు గతంలో మాదిరి సామంత రాజులుగా వ్యవహరించాలని అనుకుంటున్నారు. ఇటువంటి వారు రాష్ట్రానికి కూడా తీరని ద్రోహం చేయబోతున్నారని గుర్తెరగాలి.

గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిపోయిన పాలనా వ్యవస్థను గాడిలో పెట్టడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. మారిన పరిస్థితులలో కేంద్రంలో పెరిగిన తన పరపతిని ఉపయోగించి రాష్ట్రానికి మేలు చేకూర్చడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలించడమూ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయి నుంచి అందుతున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది.

ముంబైకి చెందిన నటి కాదంబరీ జెత్వానీ విషయంలో గత ప్రభుత్వంలో ఏం జరిగిందో ఇప్పుడు చూస్తున్నాం. ఐపీఎస్ అధికారులు సైతం తమ బాధ్యతను విస్మరించి ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గి చట్టవిరుద్ధంగా వ్యవహరించి ఇప్పుడు చిక్కుల్లో ఇరుక్కున్నారు. కాదంబరి బ్లాక్ మెయిల్ చేశారని రోత మీడియా ఆవేశపడుతోంది. అది నిజమే అనుకుందాం. బ్లాక్ మెయిల్ ఘటన జరిగి వుంటే, అది ముంబైలో కదా జరిగింది? ఏపీ పోలీసులకు ఏం పని?


కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 2లో..



నవ శకానికి నాడు నాంది!

చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయి 30 ఏళ్లు

- సంక్షోభ సమయంలో పాలన, పార్టీ పగ్గాలు
- పనితీరు, ప్రతిభతో పాలనలో కొత్త పుంతలు
- సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలతో పరుగులు
- 'విజన్' పాలిటిక్స్‌కు తొలిసారిగా శ్రీకారం
- 'సీఈవో – సీఎం'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు
- నాలుగుసార్లు సీఎంగా బాబు ఘనత



నేటికీ అదే ఉత్సాహం..
కొత్తదనం

'నారా చంద్రబాబు నాయుడు అను నేను'... అంటూ తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటికి మూడు దశాబ్దాలు! రెండు సార్లు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా... ఇప్పుడు రెండోసారి నవ్యాంధ్ర సీఎంగా చంద్రబాబు సృష్టించిన రికార్డు నభూతో! సంక్షేమంతోపాటు అభివృద్ధి రాజకీయాలకు, 'విజన్' విధానాలకు శ్రీకారం చుట్టిన నాయకుడు! కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన... జాతీయ స్థాయిలో రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి మూడు దశాబ్దాలైన సందర్భంగా... పాలనలో ఆయన ముద్రపై

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.. 12లో



దువ్వాడ డ్రామా

- మాధురి ఆత్మహత్యాయత్నం ఉత్తిదే 10
- ఆ రోజు జరిగింది కారు ప్రమాదమే
- ఎమ్మెల్సీ డైరెక్షన్‌లో ఆమె నాటకం
- ప్రమాదం జరిగాక శ్రీనుకు మాధురి ఫోన్
- వాణి అరాచకం వల్ల ఆత్మహత్యాయత్నం చేశానని మీడియాకు చెప్పాలని శ్రీను సూచన
- ఆయన చెప్పినట్టు రక్తికట్టించిన మాధురి
- తాజాగా ఇద్దరి ఫోన్ కాల్ ఆడియో లీక్

తెరపైకి మాజీ డీజీపీ పేరు!

- శనివారం 10 గంటల పాటు జెత్వానీ వాంగ్మూలం.. అంతా వీడియో రికార్డింగ్
- పోలీసులు ఫిర్యాదుగా స్వీకరించే చాన్స్
- సుమారు 200 డాక్యుమెంట్లను చూపించిన విచారణాధికారి
- వివరాలు సేకరించిన ఏసీపీ స్రవంతి
- తల్లిదండ్రుల నుంచీ వాంగ్మూలం
- మరోసారి మీడియా ముందుకు జెత్వానీ
- పీఎస్ఆర్, కాంతిరాణా కనుసన్నల్లో కేసు
- ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై కఠిన చర్యలకు డిమాండ్



కాదంబరి కేసులో మరో ట్విస్టు

రెండోరోజూ ముంబై నటి వాంగ్మూలం

విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో రోజుకో ట్విస్టు వెలుగు చూస్తోంది. తాజాగా ఈ వ్యవహారంలో ఓ మాజీ డీజీపీ పేరు తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. విజయవాడలో కాదంబరి జెత్వానీతో పాటు ఆమె తల్లిదండ్రుల వాంగ్మూలాన్ని విచారణాధికారి స్రవంతిరాయ్ నమోదు చేశారు. శనివారం సుదీర్ఘంగా పది గంటల పాటు కాదంబరి వాంగ్మూలం తీసుకున్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్ నుంచి కాదంబరి కుటుంబ సభ్యులు పోలీసు కమిషనరేట్‌కు ఉదయం 11.30 గంటలకు చేరుకున్నారు. రాత్రి 9.30 గంటలకు వారు బయటకు వచ్చారు. వారి వెంట న్యాయవాదులు ఉమేష్ చంద్ర, పాల్ ఉన్నారు. కాదంబరితో పాటు

మిగతా 10వ పేజీలో...



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK




కొత్తపలుకు

నేతలూ.. తస్మాత్ జాగ్రత్త!

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమికి చెందిన మంత్రులు, శాసనసభ్యులు, నాయకులకు ఒక సూచన.. కాదు ఒక హెచ్చరిక కూడా! నిన్నటి జగన్ అండ్ కో అరాచక పాలనను ప్రజలు మరువకముందే అదే బాటలో పయనించే ప్రయత్నం చేస్తున్న వారికి మాత్రమే ఈ హెచ్చరిక. రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా సాగిన జగన్మోహన్‌రెడ్డి పాలనను ఆదర్శంగా తీసుకొని అదే బాటలో పయనించాలనుకొనేవారు తస్మాత్ జాగ్రత్త! గత ప్రభుత్వంపై ఏవగింపుతో ప్రజలు తమకు అఖండ విజయాన్ని అందించారన్న వాస్తవాన్ని మరచి కొంతమంది శాసనసభ్యులు గతంలో మాదిరి సామంత రాజులుగా వ్యవహరించాలని అనుకుంటున్నారు. ఇటువంటి వారు తమ పోకడల ద్వారా ప్రభుత్వానికి అప్రతిష్ఠ తీసుకురావడమే కాకుండా రాష్ట్రానికి కూడా తీరని ద్రోహం చేయబోతున్నారని గుర్తెరగాలి. ఏ రాయి అయితేనేం పళ్లు రాలగొట్టుకోవడానికి అన్న భావన ప్రజల్లో ఏర్పడితే అది రాష్ట్ర ప్రయోజనాలకు తీరని నష్టం కలిగిస్తుంది. ఏ కారణాల వల్ల ప్రజలు జగన్‌రెడ్డి పాలనను తిరస్కరించారో మరచిపోయి తాము కూడా అదే పెడదారిలో పయనించాలనుకుంటే ప్రజలు సహించబోరని తెలుసుకోవాలి. అధికార కూటమి నేతల చర్యల వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిష్ఠ మాత్రమే దెబ్బతింటుందని అనుకోవడం పొరపాటు. చంద్రబాబు నాల్గవ పర్యాయం ముఖ్యమంత్రి అయ్యారు. 2029 ఎన్నికల నాటికి ఆయన వయసు 78 ఏళ్లు దాటుతుంది. ఈ ఐదేళ్లలో ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారి 2029లో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే తమ పరిస్థితి, రాష్ట్రం పరిస్థితి ఏమిటో కూటమి ఎమ్మెల్యేలు అనుక్షణం గుర్తించుకోవాలి. లేని పక్షంలో రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోతుంది. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిపోయిన పాలనా వ్యవస్థను గాడిలో పెట్టడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. మారిన పరిస్థితులలో కేంద్రంలో పెరిగిన తన పరపతిని ఉపయోగించి రాష్ట్రానికి మేలు చేకూర్చడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలించడమూ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయి నుంచి అందుతున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. గత పాలనలోని అవలక్షణాలను కొంత మంది ఎమ్మెల్యేలు, నాయకులు పుణికిపుచ్చుకొని అధికార దర్పం వెలగబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రాంతం నాది, ఇక్కడ నా మాటే చెల్లుబాటు అవుతుంది అన్నట్టుగా కొందరు విర్రవీగుతున్నారు. గుంటూరు జిల్లాలో తాజాగా జరిగిన రెండు సంఘటనలను తీసుకుందాం. ఒక ఎమ్మెల్యే భర్త తాను గతంలో అంగీకరించిన ధర కంటే తక్కువ ధరకే భూమిని తనకు అమ్మాలని సదరు భూ యజమానిపై దౌర్జన్యం చేశారు. తన మాట వినని ఆ భూ యజమానిపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టించారు. గత ప్రభుత్వంలో ఇలాంటి దురాగతాలు జరగడం వల్లనే కదా ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించారు! అదే గుంటూరు జిల్లాలో అదే రోజు మరో ఎమ్మెల్యే సతీమణి పుట్టినరోజు వేడుకలకు పోలీసు అధికారులు హాజరై సభ్య సమాజం ఆశ్చర్యపోయేలా చేశారు. జగన్ పాలనలో ఇలాంటివే జరిగాయి. పాత అలవాట్ల ప్రకారం పుట్టినరోజు వేడుకలకు పోలీసు అధికారులను అనుమతించిన సదరు ఎమ్మెల్యే తాను ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నానన్న విషయం మరచిపోయారు. అయితే ఈ రెండు సందర్భాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరించిన తీరు ముదావహం. ఎమ్మెల్యే భర్త ఆదేశాల ప్రకారం తక్కువ ధరకు భూమి విక్రయించడానికి నిరాకరించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన ఇన్‌స్పెక్టర్‌ను ప్రభుత్వం వెంటనే బదిలీ చేసింది. ఆ అధికారిని వేకెన్సీ రిజర్వుకు బదిలీ చేశారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటించడమే తమ విధి అన్నట్టుగా వ్యవహరించే అధికారులకు ఇదొక హెచ్చరిక! గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోగా ప్రోత్సహించేవారు. ఎమ్మెల్యే భార్య పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు అందరికీ మెమోలు జారీ చేయాలని కూడా చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రూల్ ఆఫ్ లా పాటించడం అంటే ఇదీ. ప్రజాస్వామ్యంలో పాలకులైనా, అధికారులైనా ప్రజలకే జవాబుదారీగా ఉండాలి. తప్పు జరిగినప్పుడు తర తమ భేదం చూపకుండా చర్యలు తీసుకుంటే రూల్ ఆఫ్ లా పాటించినట్టు అవుతుంది. అది నాగరిక పాలన అవుతుంది. గత ఐదేళ్లలో ఆటవికంగా సాగిన పాలనను చూశాం. ఇప్పుడు కూడా అవే పరిస్థితులు పునరావృతం అయితే ప్రజలు ఎంత మాత్రం సహించరు. ప్రభుత్వంలో తప్పులు జరిగినప్పుడు చంద్రబాబు వెంటనే స్పందించడాన్ని అభినందించాల్సిందే. సున్నిత మనస్కులు మాత్రమే ఇలా స్పందిస్తారు. పాలెగాళ్ల పోకడలను జీర్ణించుకున్నవారు మాత్రం అరాచకాలు జరిగినప్పుడు ఆనందిస్తారు. జగన్‌రెడ్డి పాలనలో జరిగిన దౌర్జన్యాలు, దురాగతాలకు ప్రతీకారం ఇంకెప్పుడు తీర్చుకుంటారు? అంటూ తెలుగు తమ్ముళ్ల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుపై విపరీతమైన ఒత్తిడి వస్తోంది. అయినా ఆయన సంయమనం పాటిస్తున్నారు. పాలెగాళ్ల రాజ్యాన్నే కొనసాగిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ మంటగలసిపోతుందని ఆయనకు తెలుసు. అందుకే గత ఘోరాలు, నేరాలపై ఆధారాలు లభించినప్పుడు చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లు ఆవేశపడుతున్నారని ఆయన కూడా ఆవేశపడటం లేదు. అదే సమయంలో హద్దు మీరుతున్న పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులకు వాతలు పెడుతున్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన సంఘటనలను మంత్రివర్గ సమావేశంలో పరోక్షంగా ప్రస్తావిస్తూ 'నేను మా వాళ్లను హెచ్చరిస్తాను. మీరు మీ వాళ్లకు క్లాస్ తీసుకోండి' అని జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు సూచించారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ, కూటమి ఎమ్మెల్యేలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరిద్దామని అభిప్రాయపడ్డారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది నాయకులు ఫలానా ప్రాంతాన్ని తమకు రాసిచ్చారు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్కడ ఏది కావాలన్నా, ఏది జరగాలన్నా తన అనుమతి తప్పనిసరి అని హుకుం జారీ చేస్తున్నారు. రాయించుకోవడానికి మీరెవ్వరు? రాసివ్వడానికి వారెవ్వరు? ప్రజలు మీకు ఐదేళ్లపాటు అధికారంలో ఉండి తమకు సేవ చేయమని మాత్రమే రాసిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు కావాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా స్థానిక ఎమ్మెల్యే అనుమతి తీసుకోవాలా? ఏ చట్టంలో, ఏ రాజ్యాంగంలో ఇలా రాశారు? అధికారుల విధుల్లో జోక్యం చేసుకొనే అధికారం ఎమ్మెల్యేలకు ఎవరిచ్చారు? అధికారులకు జీతాలు ఇస్తున్నది ఎమ్మెల్యేలకు ఊడిగం చేయడానికి కాదు! అధికారులు, ఉద్యోగులు తాము ప్రజా సేవకులం, పబ్లిక్ సర్వెంట్స్ అని మరచిపోతే ఎలా? జగన్‌రెడ్డి పాలనలో ఈ దరిద్రపు సంస్కృతి జడలు విప్పుకొని కరాళ నృత్యం చేసింది. ప్రజలు ఛీత్కరించుకున్న అదే సంస్కృతిని కూటమి పాలనలో కూడా కొనసాగించాలనుకుంటే కుదరదు. బాధ్యత గల మీడియాగా మేం అలాంటి వారిపై కొరడా ఝుళిపిస్తాం.

> అధికారులకు జీతాలు ఇస్తున్నది ఎమ్మెల్యేలకు ఊడిగం చేయడానికి కాదు! జగన్‌రెడ్డి పాలనలో ఈ దరిద్రపు సంస్కృతి జడలు విప్పుకొని కరాళ నృత్యం చేసింది. ప్రజలు ఛీత్కరించుకున్న అదే సంస్కృతిని కూటమి పాలనలో కూడా కొనసాగించాలనుకుంటే కుదరదు. బాధ్యత గల మీడియాగా మేం అలాంటి వారిపై కొరడా ఝుళిపిస్తాం.



ఇదో గుణపాఠం!

ముంబైకి చెందిన నటి కాదంబరీ జెత్వానీ విషయంలో గత ప్రభుత్వంలో ఏం జరిగిందో ఇప్పుడు చూస్తున్నాం. ఐపీఎస్ అధికారులు సైతం తమ బాధ్యతను విస్మరించి ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గి చట్టవిరుద్ధంగా వ్యవహరించి ఇప్పుడు చిక్కుల్లో ఇరుక్కున్నారు. ఈ వ్యవహారంలో ఆడపిల్ల అయిన కాదంబరికి వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులకు వత్తాసు పలుకుతూ జగన్‌రెడ్డి మీడియాలో వార్తలు వండి వారుస్తున్నారు. ఇంతకంటే నీతిమాలిన చర్య ఉంటుందా? జర్నలిజంలోని కనీస ప్రమాణాలు కూడా పాటించకుండా బాధితురాలినే విలన్‌గా చిత్రించడమా? అంతకంటే అపచారం ఉంటుందా? అందుకే జగన్‌రెడ్డి సొంత మీడియాను రోత మీడియా అని పిలవాల్సి వస్తోంది. సదరు రోత మీడియాకు వంత పాడుతున్న వారిని కూలి మీడియా అనడంలో తప్పేముంది? ప్రముఖ వ్యాపారి సజ్జన్ జిందాల్‌తో పాటు ఏషియన్ పెయింట్స్ అధినేతను కాదంబరి బ్లాక్ మెయిల్ చేశారని రోత మీడియా ఆవేశపడుతోంది. అది కూడా నిజమే అనుకుందాం. బ్లాక్ మెయిల్ సంఘటన జరిగివుంటే, అది ముంబైలో కదా జరిగింది? ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఏం పని? అయినా, ఆమె బ్లాక్ మెయిల్ చేసే అవకాశం సదరు వ్యాపార దిగ్గజాలు ఎందుకు కల్పించారు? అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, సజ్జన్ జిందాల్‌ను కలుసుకున్న తర్వాతే కాదంబరికి కష్టాలు మొదలయ్యాయని ప్రస్తుతం పోలీసు విచారణలో స్పష్టమవుతోంది. సజ్జన్ జిందాల్ తరఫున అనైతికంగా, చట్టవిరుద్ధంగా వ్యవహరించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి ఉండకపోవచ్చు. దాంతో జిందాల్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఆశ్రయించి ఉంటారు. అప్పటికే ఆటవిక పాలనకు అలవాటు పడిన జగన్‌రెడ్డి సదరు సజ్జన్ జిందాల్‌కు అభయం ఇవ్వడం, తాము చట్టానికి బాధ్యులం అన్న విషయం మరచిన కాంతి రాణా, పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గున్ని వంటి అధికారులు పాలకుడి ఆదేశాలను ఔదలదాల్చడంతో ఇదంతా జరిగింది. కాదంబరి అనే మోడల్ తమను బ్లాక్‌మెయిల్ చేస్తోందని సజ్జన్ జిందాల్ అండ్ కో మహారాష్ట్రలో అధికారికంగా ఎందుకు ఫిర్యాదు చేయలేదు? కాదంబరితో తమకున్న సంబంధం ఏమిటి? ఆమె తమను ఎలా బ్లాక్‌మెయిల్ చేశారో, ఎందుకు చేశారో సదరు పారిశ్రామికవేత్తలు చెప్పాలి కదా? తమను బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం కల్పించిన పారిశ్రామికవేత్తలు నోరు విప్పాలి కదా? జిందాల్ అండ్ కోకు మేలు చేయడం కోసం నాటి ప్రభుత్వం కుక్కల విద్యాసాగర్ అనే వ్యక్తిని రంగప్రవేశం చేయించింది. రోత మీడియా కథనాల ప్రకారం కుక్కల విద్యాసాగర్‌ను కూడా కాదంబరి బ్లాక్‌మెయిల్ చేసి భూమి రాయించుకున్నారు. దానిపై కుక్కల ఫిర్యాదు చేసినందునే పోలీసులు కాదంబరిని ముంబై నుంచి తీసుకు వచ్చారట. ఫిబ్రవరి 2వ తేదీన కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు చేసినట్టు రికార్డులలో ఉంది. అలాంటప్పుడు ఫిబ్రవరి ఒకటవ తేదీనే విశాల్ గున్ని, రమణమూర్తి, ముత్యాల సత్యనారాయణ తదితర అధికారులు మహిళా పోలీసులు లేకుండా గన్నవరం నుంచి ముంబై ఎందుకు వెళ్లారు? కాదంబరి కొనకపోయినా, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను డాక్యుమెంట్ రైటర్‌ను బెదిరించి తమకు కావాల్సింది రాయించారు. అయినా జగన్ రోత మీడియా తప్పు చేసిన అధికారులను రక్షించే ప్రయత్నాన్ని నిస్సిగ్గుగా చేస్తోంది. హనీ ట్రాప్ చేయడం కాదంబరికి అలవాటేనని కుక్కల విద్యాసాగర్ వాపోతున్నట్టుగా కూడా మరో రోత కథనం ప్రచురించారు. నిజమే అనుకుందాం. రాష్ట్రంలో అయిదు కోట్ల మంది జనాభా ఉన్నారు. విద్యాసాగర్ కంటే ధనవంతులు ఉన్నారు. అయినా కుక్కలను మాత్రమే ఆమె ఎందుకు ఎంచుకున్నారు? అంటే అతడు ఆమెతో వ్యవహారానికి ప్రయత్నించినట్టే కదా? సజ్జన్ జిందాల్ అయినా, మరొకరు అయినా ఆమె జోలికి వెళ్లి ఉండకపోతే బ్లాక్ మెయిల్ చేసే అవకాశం వచ్చేది కాదు కదా? వ్యక్తిగత బలహీనతల వల్ల ఇబ్బందుల్లో పడ్డవారు సానుభూతికి అనర్హులు. అలాంటి వారికి వత్తాసు పలుకుతున్న జగన్ మీడియా రోత మీడియానే అవుతుంది. గత ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థను ఏ స్థాయిలో భ్రష్టుపట్టించారో ఈ సంఘటనను బట్టి తెలుస్తోంది. పోలీసులపై అతిగా ఆధారపడి పాలించిన ఏ రాజకీయ పార్టీ కూడా బాగుపడిన దాఖలాలు లేవు. అయినా బ్లాక్‌మెయిల్ చేశారని చట్టవిరుద్ధంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టవచ్చా? అలా అయితే వివేకానందరెడ్డి హత్య కేసుతో పాటు అవినీతి కేసులలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డిని కూడా ఇలాగే చిత్రహింసలు పెట్టవచ్చా? అలా చేస్తే ఇదే రోత మీడియా గగ్గోలు పెట్టదా? ఇప్పుడు కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు ఈ వాస్తవాన్ని మరచిపోకూడదు. పోలీసు అధికారులకు కూడా కాదంబరి వ్యవహారం ఒక గుణపాఠం అవుతుంది. ఇవాళ కాకపోతే రేపైనా పాపం పండుతుంది అంటారు. అందుకే గత పాలనలోని చేదు జ్ఞాపకాలను మరిపించే విధంగా కూటమి నేతలు వ్యవహరించకూడదు. తస్మాత్ జాగ్రత్త!

> సజ్జన్ జిందాల్ అయినా, మరొకరు అయినా కాదంబరి జోలికి వెళ్లి ఉండకపోతే బ్లాక్ మెయిల్ చేసే అవకాశం వచ్చేది కాదు కదా? వ్యక్తిగత బలహీనతల వల్ల ఇబ్బందుల్లో పడ్డవారు సానుభూతికి అనర్హులు. అలాంటి వారికి వత్తాసు పలుకుతున్న జగన్ మీడియా రోత మీడియానే అవుతుంది. అయినా బ్లాక్‌మెయిల్ చేశారని చట్టవిరుద్ధంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టవచ్చా? అలా అయితే వివేకానందరెడ్డి హత్య కేసుతో పాటు అవినీతి కేసులలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డిని కూడా ఇలాగే చిత్రహింసలు పెట్టవచ్చా? అలా చేస్తే ఇదే రోత మీడియా గగ్గోలు పెట్టదా? ఇప్పుడు కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు ఈ వాస్తవాన్ని మరచిపోకూడదు. పోలీసు అధికారులకు కూడా కాదంబరి వ్యవహారం ఒక గుణపాఠం అవుతుంది. గత పాలనలోని చేదు జ్ఞాపకాలను మరిపించే విధంగా కూటమి నేతలు వ్యవహరించకూడదు.

> జగన్‌రెడ్డి పాలనలో జరిగిన దౌర్జన్యాలు, దురాగతాలకు ప్రతీకారం ఇంకెప్పుడు తీర్చుకుంటారు? అంటూ తెలుగు తమ్ముళ్ల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుపై విపరీతమైన ఒత్తిడి వస్తోంది. అయినా ఆయన సంయమనం పాటిస్తున్నారు. పాలెగాళ్ల రాజ్యాన్నే కొనసాగిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ మంటగలసిపోతుందని ఆయనకు తెలుసు. అందుకే గత ఘోరాలు, నేరాలపై ఆధారాలు లభించినప్పుడు చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లు ఆవేశపడుతున్నారని ఆయన కూడా ఆవేశపడటం లేదు. అదే సమయంలో హద్దు మీరుతున్న పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులకు వాతలు పెడుతున్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన సంఘటనలను మంత్రివర్గ సమావేశంలో పరోక్షంగా ప్రస్తావిస్తూ 'నేను మా వాళ్లను హెచ్చరిస్తాను. మీరు మీ వాళ్లకు క్లాస్ తీసుకోండి' అని జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు సూచించారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ, కూటమి ఎమ్మెల్యేలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరిద్దామని అభిప్రాయపడ్డారు.

రేవంత్ సాహసం!

తెలంగాణలో ఇప్పుడు ఎవరి నోట విన్నా హైడ్రా అన్న మాటే వినిపిస్తోంది. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలే మీడియాలో కూడా అధిక ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. హైడ్రాకు పురుడు పోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డి తేనెతుట్టెను కదిలించారని, పులి మీద స్వారీ చేస్తున్నారని కొంతమంది అభిప్రాయపడుతుండగా, హైడ్రా ద్వారా అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువులను పరిరక్షిస్తున్నారని సామాన్య ప్రజానీకం ఆయనకు జేజేలు పలుకుతోంది. ఆరంభం అదుర్స్. ముగింపు ఎలా? ఎప్పుడు? అనేవే ప్రస్తుతం కీలక ప్రశ్నలు. ప్రాంతీయ పార్టీల అధినేతలు మాత్రమే ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోగలరు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ఇటువంటి సాహసం చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు సంబంధించి ఎన్ని ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి తట్టుకొని నిలబడగలుగుతుండటం సామాన్య విషయం కాదు. కూల్చివేతలు ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి పుంఖాను పుంఖాలుగా ఫిర్యాదులు వెళ్లాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కుటుంబానికి చెందిన భవనాన్ని కూడా మొదటి రోజే కూల్చివేశారు. ఆ రోజు పళ్లంరాజు ఎన్ని ప్రయత్నాలు చేసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు చేసిన వారి జాబితాలో కేవీపీ రామచంద్రరావు పేరు కూడా ఉన్నట్టు వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం మిగతా విషయాలతో పాటు కూల్చివేతలపై చర్చించడానికి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుంది. ఈ సందర్భంగా పళ్లంరాజు ఫిర్యాదుపై ఖర్గే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారని తెలిసింది. దీంతో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పళ్లంరాజు ఎలా ప్రయోజనాలు పొందారో వివరించి, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోదని పళ్లంరాజు ఎవరెవరి వద్ద వ్యాఖ్యానించారో కూడా రేవంత్‌రెడ్డి సాక్ష్యాధారాలతో అధిష్ఠానానికి వివరించారు. అంతేకాకుండా కూలగొట్టిన భవనం అక్రమంగా నిర్మించినదని నిరూపించారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కల్పించుకొని, ముఖ్యమంత్రి రేవంత్ చర్యలను తాను సమర్థిస్తున్నానని, ఆయనను అడ్డుకోవద్దని కాంగ్రెస్ ముఖ్యులకు స్పష్టం చేశారు. అంతే, రేవంత్‌రెడ్డికి కొండంత అండ లభించింది. ఈ సంఘటన పర్యవసానంగా కూల్చివేతలపై రాష్ట్ర కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వినిపించకుండా పోయాయి. ఏ లక్ష్యంతో కూల్చివేతలు ప్రారంభించారో కానీ, రేవంత్‌రెడ్డి ప్రస్తుతం అటు పార్టీ అధిష్ఠానం నుంచి, ఇటు ప్రజల నుంచి మంచి మార్కులు కొట్టేస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో చెరువులు దురాక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఈ కారణంగానే ఒక మోస్తరు వర్షానికి కూడా హైదరాబాద్ జలమయం అవుతోంది. ప్రజలు ఈ విషయమై ఆగ్రహంగా ఉన్నారు. ఫలితంగా ముఖ్యమంత్రి చర్యలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలపైనే హైడ్రా దృష్టి కేంద్రీకరించింది. బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల జోలికి ఇంకా పూర్తి స్థాయిలో వెళ్లలేదు. నిజానికి ఇప్పటి వరకు జరిగిన కూల్చివేతలు అతి స్వల్పం. అయినప్పటికీ హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించాలన్న డిమాండ్ వస్తోంది. భారత రాష్ట్ర సమితి మినహా మిగతా ప్రతిపక్షాలు ఈ కూల్చివేతలను విమర్శించలేని పరిస్థితి. బీఆర్ఎస్ కూడా సన్నాయి నొక్కులకే పరిమితమైంది. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల పాపం బిల్డర్లు, అధికారులదే. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి సంస్థల అనుమతితో నిర్మించిన ఫ్లాట్స్‌ను కొనుగోలు చేసిన వారికి ఏ పాపం తెలియదు. వారిని ఇప్పుడు శిక్షించడం కూడా అన్యాయం అవుతుంది. ఇప్పటిదాకా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అక్రమ నిర్మాణాలను పట్టించుకోకపోగా ప్రోత్సహించాయి. ఫలితంగా హైదరాబాద్‌కు జలప్రళయం పొంచి ఉంది. బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ ఎంతవరకు వెళతారో తెలియదు. ఇక 111 జీవో వ్యవహారం ఉండనే ఉంది. దశాబ్దాల క్రితం అమలులోకి వచ్చిన ఈ జీవో విషయంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిరక్షణకు ఈ జీవోను అప్పట్లో తెచ్చారు. అది కూడా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజల మంచినీటి అవసరాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో ఔటర్ రింగురోడ్డు వచ్చింది. నీటి ప్రవాహానికి అడ్డుగా ఔటర్ రింగు రోడ్డు నిర్మించిన తర్వాత దాని లోపల ఉన్న ప్రాంతాన్ని 111 జీవో పరిధిలోనిదిగా పరిగణించడం అర్థరహితం. ఔటర్ లోపలా, వెలుపలా విచ్చలవిడిగా నిర్మాణాలు వచ్చాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టు కూడా 111 జీవో పరిధిలోని భూమిలోనే నిర్మించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ను ఇప్పుడు మంచినీటి అవసరాలకు ఉపయోగించడం లేదు. ఈ నేపథ్యంలో ఆ రెండు జలాశయాలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేసి 111 జీవో పరిధిలోని ప్రాంతంలో కొన్ని పరిమితులతో ఒక క్రమ పద్ధతి ప్రకారం నిర్మాణాలకు అనుమతించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. అదే సమయంలో అక్రమ కట్టడాలు, పద్ధతీ పాడూ లేకుండా జరుగుతున్న విస్తరణకు అడ్డుకట్ట వేయవచ్చు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 111 జీవో ఎత్తివేస్తున్నట్టు ప్రకటన మాత్రమే చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెరువులను పరిరక్షించడంతో పాటు 111 జీవో విషయంలో స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకోవాలి. లేని పక్షంలో 111 జీవో పరిధిలోని చెరువులు కూడా ఆక్రమణలకు గురవుతాయి. మళ్లీ కూల్చివేతలు అంటూ హడావిడి చేయవలసి వస్తుంది. అందుచేత 111 జీవో పరిధిలో శాస్త్రీయ పద్ధతిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వాంఛనీయం. ఇప్పటికే 60 అంతస్తుల వరకు భవన నిర్మాణాలకు వేలం వెర్రిగా అనుమతులు ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం, సైబరాబాద్‌కు కూడా తీరని అపచారం చేసింది. వందలు, వేల ఎకరాలు ఖాళీగా ఉన్నప్పుడు 50 నుంచి 60 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం ఏమిటి? ఇకపై అక్రమ కట్టడాలకు అనుమతించిన అధికారులను అందుకు బాధ్యులను చేయడంతో పాటు 111 జీవో విషయంలో హేతుబద్ధమైన నిర్ణయం తీసుకుంటే గ్రేటర్ హైదరాబాద్‌కు మేలు చేసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగిలిపోతారు!

> ఎమ్మెల్యే భర్త ఆదేశాల ప్రకారం తక్కువ ధరకు భూమి విక్రయించడానికి నిరాకరించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన ఇన్‌స్పెక్టర్‌ను చంద్రబాబు ప్రభుత్వం వెంటనే బదిలీ చేసింది. ఆ అధికారిని వేకెన్సీ రిజర్వుకు బదిలీ చేశారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటించడమే తమ విధి అన్నట్టుగా వ్యవహరించే అధికారులకు ఇదొక హెచ్చరిక! ఎమ్మెల్యే భార్య పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు అందరికీ మెమోలు జారీ చేయాలని కూడా చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రూల్ ఆఫ్ లా పాటించడం అంటే ఇదీ. ప్రజాస్వామ్యంలో పాలకులైనా, అధికారులైనా ప్రజలకే జవాబుదారీగా ఉండాలి. తప్పు జరిగినప్పుడు తర తమ భేదం చూపకుండా చర్యలు తీసుకుంటే రూల్ ఆఫ్ లా పాటించినట్టు అవుతుంది. అది నాగరిక పాలన అవుతుంది. గత ఐదేళ్లలో ఆటవికంగా సాగిన పాలనను చూశాం. ఇప్పుడు కూడా అవే పరిస్థితులు పునరావృతం అయితే ప్రజలు ఎంత మాత్రం సహించరు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అవిశ్రాంత పోరాట యోధుడు

నాల్గవ పర్యాయం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ముందున్న తక్షణ కర్తవ్యం ఒక్కటే.. ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ దేశంలోనే అగ్రగామిగా నిలపాలి. ఈ సమున్నత లక్ష్యాల సాధన దిశగానే ఆయన '2047 విజన్'తో ముందుకు సాగడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.


సెప్టెంబర్ 1, 2024న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరొక అరుదైన మైలురాయి చేరుకొంటారు. సరిగ్గా 29 సంవత్సరాల క్రితం సెప్టెంబర్ 1, 1995న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 45 సంవత్సరాల పిన్న వయస్సులో ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు స్వీకరించారు. 3 దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఆయన నవ్యాంధ్రప్రదేశ్‌కు 4వ సారి ముఖ్యమంత్రిగా ఉండటం మరో అరుదైన ఘనత.

నిజానికి పదవుల కోసం, రికార్డుల కోసం తాపత్రయపడే నాయకుడు కారు చంద్రబాబునాయుడు. పదవి ఉన్నా లేకున్నా.. ప్రజల కోసం, సమాజం కోసం, దేశం కోసం నిరంతరం, ప్రతిక్షణం ప్రయత్న లోపం లేకుండా చిత్తశుద్ధితో కష్టపడే అత్యంత అరుదైన నాయకుడు చంద్రబాబు. అందుకే కొన్ని సందర్భాలలో ప్రజలు లేనిపోని అపోహలతో దూరం చేసుకొన్నా.. మళ్లీ ఆయనను ఆదరించారు. చంద్రబాబు పాలనలోనే గాడి తప్పిన రాష్ట్రం ముందుకు సాగగలదని విశ్వసించారు. కనుకనే నిన్నటి ఎన్నికలలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమికి ప్రజలు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారు.

రాజకీయాలలో తొలినుంచీ చంద్రబాబు ఎదుర్కొంటున్న సవాళ్లు అన్నీ ఇన్నీ కావు. మొదటిసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తొలిరోజే అనేక సవాళ్లు, సంక్షోభాలు ఆయనకు స్వాగతం పలికాయి. అడుగంటిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కుదేలయిన కీలకరంగాలు, ప్రభుత్వ యంత్రాంగంలో నిస్తేజం, నిర్లిప్తత.. ఇటువంటి సమస్యలెన్నో రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పూర్వరంగంలో చంద్రబాబు సృజనాత్మకతతో కూడిన ఆలోచనలతో, దృఢమైన కార్యదీక్షతో, అచంచలమైన నిబద్ధతతో సమస్యలను, సవాళ్లను ఛాలెంజీగా తీసుకొన్నారు. ప్రజల విశ్వాసాన్ని కూడగట్టుకొన్నారు. రాష్ట్ర ఆర్థిక రంగ పునర్వ్యవస్థీకరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మానవ వనరులను అభివృద్ధి చేయడం, ప్రజలను సాధికారుల్ని చేయడం వల్లనే ఆశించిన ఫలితాలు పొందగలమని భావించి అందుకు అనుగుణమైన చర్యలు, కార్యక్రమాలు చేపట్టడం చంద్రబాబు సాధించిన తొలి విజయం.

అదే సమయంలో చంద్రబాబు పని సంస్కృతిని పెంచారు. కష్టపడితేనే ఫలితాలు అందుతాయన్న స్పృహ అందరిలో పెరిగేందుకు దోహదం చేశారు. రాజకీయ రంగంలో హుందాతనాన్ని పెంచడానికి తన పార్టీ ద్వారానే అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు రాజకీయాలలో సాగిన పూలదండల హంగామా, ఊరేగింపులు, సన్మానాలు, తులాభారాలు, ఎయిర్‌పోర్టులలో కిరాయి జనాలతో బలప్రదర్శనలు వంటి చౌకబారు సంస్కృతిని కనుమరుగు చేశారు. సెక్రటేరియట్‌లో, ప్రభుత్వ కార్యాలయాలలో తిష్టవేసే పైరవీకారులకు స్థానం లేకుండా చేశారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో వెల్లివిరిసిన నూతన రాజకీయ సంస్కృతి రాష్ట్ర ప్రతిష్ఠను పెంచింది. చంద్రబాబు రాజకీయ నిబద్ధతను జాతీయ స్థాయిలోనే కాక అంతర్జాతీయ వేదికలపై చర్చించే పరిస్థితి ఏర్పడింది. భారత రాజకీయాలలో స్థిరపడిన సంప్రదాయ ఆలోచనా ధోరణులను, యథాతథ స్థితిని కొనసాగించడానికి అలవాటు పడిన విధానాలను చంద్రబాబు త్రోసిరాజని భిన్నమైన రాజకీయ ఆలోచనలతో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టారు.

ప్రపంచంలో అందుబాటులోకి వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని, ఆ తర్వాత వ్యవసాయరంగ విప్లవాన్ని అందిపుచ్చుకోవడంలో జాప్యం చేసి భారీ మూల్యం చెల్లించుకొన్న భారతదేశం అభివృద్ధిలో ఎంతో వెనుకబడిపోయిందన్నది చేదు వాస్తవం. అయితే.. ఐటి విప్లవం వల్ల ఒనగూరే ప్రయోజనాలేమిటో, ముఖ్యంగా యువతకు ఈ రంగం అందించే ఉపాధి అవకాశాలను ముందుగానే అంచనా వేసిన చంద్రబాబు హైదరాబాద్‌లో 'హైటెక్‌సిటీ' నిర్మాణాన్ని చేపట్టడం.. రాష్ట్ర చరిత్రలో ఓ మేలి మలుపు. హైటెక్‌సిటీలో అనతికాలంలోనే ప్రపంచంలోని అగ్రగామి సంస్థలు కొలువు దీరాయి. మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్ని హైదరాబాద్‌కు రప్పించడానికి చంద్రబాబు చేసిన కృషి, పట్టుదల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఐటి రంగంలో ఉద్యోగావకాశాలను రాష్ట్ర యువతకు లభించడానికి రాష్ట్రంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కంప్యూటర్ విద్య అందించే కళాశాలల్ని ఏర్పాటు చేసి రకరకాల కోర్సులు ప్రవేశపెట్టడం వల్లనే నేడు తెలుగువారు ప్రపంచంలో అమెరికాతోసహా అన్ని దేశాలలో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారు ఐటి ఉద్యోగాలతో తమ ఆర్థిక స్థితిగతుల్ని ఊహించని స్థాయికి మెరుగుపర్చుకోగలిగారు. అంతేకాదు. గత రెండున్నర దశాబ్దాలలో అమెరికాలో తెలుగు టెక్నోక్రాట్స్ బలీయమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందింది.. ఒకప్పుడు యూదులు ఏ విధంగానైతే అమెరికా సమాజంలో ప్రత్యేకంగా చూడబడ్డారో.. నేడు తెలుగువారు ఆ స్థానాన్ని ఆక్రమించారు. దీనికి కారణం చంద్రబాబునాయుడి దార్శనికతే.



ఐటిని ఉద్యోగ కల్పనకే కాక.. పరిపాలనలో అన్ని దశల్లో ప్రవేశపెట్టి.. ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన, పారదర్శక సేవలు అందించి హైటెక్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు అందుకొన్నారు. ఐటితోపాటు బయోటెక్నాలజీ, ఫార్మా తదితర రంగాలకు ఎనలేని ప్రోత్సాహాన్ని అందించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడి 9 సంవత్సరాల పాలనలో దేశ సగటు కంటే అధికంగా, అంతకుముందెన్నడూ లేనివిధంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రేటు 10.5శాతంగా నమోదైంది. పారిశ్రామికంగా రాష్ట్రం 20 నుంచి 4వ స్థానానికి ఎదిగింది. చంద్రబాబు పాలనలో శాంతిభద్రతలు అత్యుత్తమ స్థాయికి చేరాయి. కేంద్రంతో సత్సంబంధాలు పెట్టుకొని రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలను సాధించడంలో చంద్రబాబు చూపే చొరవ గురించి ఎంతచెప్పినా తక్కువే అవుతుంది.

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయిన తర్వాత చంద్రబాబు అమరావతిని ప్రపంచ స్థాయిలో రాజధానిగా తీర్చిదిద్దడానికి ఆరాటపడ్డారు. తగిన కార్యాచరణతో ముందుకు సాగారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను, కియా వంటి పరిశ్రమలను రప్పించి ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అగ్రగామి చేయడానికి నిరంతరం శ్రమించారు. పోలవరం ప్రాజెక్టును 72శాతం పూర్తిచేశారు. విశాఖను ఐటి హబ్‌గా మార్చడానికి కృషి చేశారు. అయితే, 2019లో అనూహ్యంగా ఓటమి ఎదురైనా ఆయన కృంగిపోలేదు. నాటి పాలకులు ప్రతిపక్షంలో ఉన్న తనను, తన పార్టీ నేతల్ని వేధించినా, కొందర్ని హత్యలు చేసినా, తనతోపాటు కొందర్ని అక్రమంగా జైల్లో పెట్టినా మొక్కవోని ధైర్యంతో ప్రజల మద్దతు కూడగట్టి స్ఫూర్తిదాయకమైన పోరాటాలు చేశారు. చివరకు ప్రజలిచ్చిన తిరుగులేని తీర్పుతో మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాగలిగారు.

4వ సారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ముందు.. గతంలో మాదిరిగా సవాళ్లు, సంక్షోభాలు అన్ని రంగాలలో ఎదురవుతున్నాయి. అయితే, ఆయన ఓ అవిశ్రాంత పోరాటయోధుడు. అంతిమ లక్ష్యం సాధించేవరకు విశ్రమించని కార్యదక్షుడు. నేడు ఆయన ముందున్న తక్షణ కర్తవ్యం ఒక్కటే.. ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ దేశంలోనే అగ్రగామిగా నిలపాలి. తెలుగు ప్రజలు అన్ని రంగాలలో ఉన్నత స్థానంలో నిలవాలి. ప్రజల ఆశలు, ఆశయాల్ని నెరవేర్చాలి. సమాజంలో పేదరికం శాశ్వతంగా తొలగాలి. ఈ సమున్నత లక్ష్యాల సాధన దిశగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు '2047 విజన్'తో ముందుకు సాగడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నవ్యాంధ్ర భవిష్యత్‌కు ఆశాజ్యోతిగా నిలుస్తున్నారు.

■ టి.డి. జనార్ధన్
పొలిటికల్ సెక్రటరీ, పొలిట్‌బ్యూరో సభ్యులు, తెలుగుదేశం పార్టీ





దుర్గగుడి వద్ద మునిగిన షాపులు



ఇబ్రహీంపట్నంలో...

నోవాటెల్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై భారీగా చేరిన వర్షపు నీరు

సముద్రంలా.. సిటీ

బెజవాడ గజగజలాడింది. సిటీ సముద్రాన్ని తలపించింది. కనీవినీ ఎరుగని కుండపోత వర్షం నగరంపై ఒలికింది. చిన్నాచితకా వీధుల నుంచి ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు మొత్తం జలమయమయ్యాయి. ఇళ్లు, ఆఫీసులు, ఆలయాలు, మసీదులు, ప్రార్థనా మందిరాల్లోకి సైతం నీరు చేరింది. ఐదు దశాబ్దాల కాలంలోనే ఇది అత్యధిక వర్షపాతం కాగా, 200 ఏళ్ల కాలంలో తూర్పు నియోజకవర్గంలో ఈస్థాయిలో వర్షం కురవలేదని ఏపీ వెదర్‌మాన్ పోస్టు చేసింది. ఇక కృష్ణానదికి వరద పోటెత్తగా, ఎగువ నుంచి వస్తున్న నీటితో వాగులు ఉధృతమై పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డుపై కొండచరియలు జారిపడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జి.కొండూరు మండలం ఈలప్రోలు దగ్గర బుడమేరు గండిపడే అవకాశాలు కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం కూడా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ రిపోర్టుతో జనం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

ఐదు దశాబ్దాల్లో నగరంలో ఇదే అతిపెద్ద వర్షం

200 ఏళ్లలో 'తూర్పు'లో రికార్డు స్థాయిలో వర్షపాతం

- ప్రధాన, జాతీయ రహదారులు జలమయం
- పీఎన్‌బీఎస్ సమీపాన లోబ్రిడ్జిలో చిక్కుకున్న బస్సులు
- ఇంద్రకీలాద్రిపై విరిగిపడిన కొండచరియలు
- జి.కొండూరు వద్ద ఉధృతంగా బుడమేరు
- గండి తెగే అవకాశం.. భయం గుప్పెట్లో ఈలప్రోలు
- ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న వాగులు
- 50కిపైగా గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

వేల ఎకరాల్లో పంట వర్షార్పణం

25 రైళ్లు, 68 ఆర్టీసీ బస్సులు రద్దు



వన్‌టౌన్‌లో..



ఇంద్రకీలాద్రిపై పడిన కొండచరియలు, పీఎన్‌బీఎస్ వద్ద వరద నీటిలో బస్సు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ నగరం జలదిగ్బంధమైంది. ఐదు దశాబ్దాల కాలంలోనే ఇది అత్యధిక వర్షపాతం అని ఏపీ వెదర్‌మాన్‌లో పోస్టు చేయడం సంచలనం కలిగిస్తోంది. అలాగే, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కురిసిన వర్షం గత 200 ఏళ్లలో ఎప్పుడూ నమోదు కాలేదని పేర్కొంది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం నగరంలో 2020, అక్టోబరు 13న 122.06 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, శుక్ర వారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు తూర్పు నియోజకవర్గంలో 174.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం విశేషం. శని వారం కూడా 125.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం రికార్డు. ఫలితంగా విజయ వాడ సముద్రాన్ని తలపించింది. చిన్నా, పెద్దా, ఓ మోస్తరు రోడ్లతో సహా అన్ని ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లలోకి నీరు చేరింది. కిలో మీటర్ల కొద్దీ ఆగిపోయాయి. రైళ్లు, బస్సులు రద్దయ్యాయి. జిల్లావ్యాప్తంగా 2,639.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటు 131.98 మిల్లీమీటర్లుగా ఉంది. జి.కొండూరు మండలంలో అత్యధికంగా 197.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత మైలవరం మండలంలో 184.2, విజయవాడ తూర్పులో 174.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జి.కొండూరు మండలం ఈలప్రోలు దగ్గర బుడమేరుకు గండిపడే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే బుడమేరు కట్ట మీద నుంచి వరద ప్రవహిస్తోంది. ఒకవేళ గండిపడితే తమ ఊరు మునిగిపోతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

బతుకు బండలు

క్రీస్తురాజపురంలో కొండరాళ్లు పడి ఐదుగురు దుర్మరణం



కొండచరియల్లో ఇరుక్కున్న మృతదేహం (ఇన్‌సెట్‌లో) విలపిస్తున్న కుటుంబ సభ్యులు

- దొరకని కొత్తవరానికి చెందిన విద్యార్థి ఆచూకీ
- రెండు భవనాలు, రెండు షెడ్లు నేలమట్టం
- అర్ధరాత్రి వరకూ కొనసాగిన సహాయక చర్యలు



భయం గుప్పెట్లో కొండప్రాంత వాసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కొండరాళ్లు ఐదుగురి జీవితాలను చిదిమేశాయి. మరో నలుగురిని క్షతగాత్రులను చేశాయి. క్రీస్తురాజపురంలోని సున్నపుబట్టీల సెంటర్‌కు సమీపాన, 18వ నెంబరు సచివాలయం ఎదురుగా ఇళ్ల పక్కనే ఉన్న కొండరాళ్లు శనివారం ఉదయం ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఈ ఘటనలో రెండు భవనాలు, రెండు షెడ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. బ్యాంక్ ఉద్యోగి నవుదు మేఘన (25), సున్నపుబట్టీల సెంటర్‌కు చెందిన బోలెం లక్ష్మి (49), పశ్చిమబెంగాల్‌లోని మగ్రాత్ ప్రాంతానికి చెందిన పి.లాల్ (38), జంపన అన్నపూర్ణ (55), కడప జిల్లాకు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి సంతోష్ (18) మృతిచెందగా, మరో విద్యార్థి యశ్వంత్ (18) ఆచూకీ ఇంకా తెలియలేదు. ఈ ఘటనలో మేఘన తండ్రి సత్యనారాయణ, తల్లి నాగమణి గాయాలతో బయటపడ్డారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు మేఘనను బయటకుతీసి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. అలాగే, అమ్మ కల్యాణ మండపం ప్రాంతానికి చెందిన అలజంగి శాంతి, మొగల్రాజపురం నవోదయ రోడ్డుకు చెందిన కొప్పరవాలి స్వామి కూడా గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సహాయక చర్యలకు బ్రేక్

శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు కొనసాగాయి. కొండరాళ్లను పక్కకు తప్పించి శిథిలాలను తొలగిస్తున్నప్పుడు ఒక్కొక్కటిగా మృతదేహాలు బయటపడ్డాయి. వర్షం నిరంతరాయంగా కురవడంతో కొండను ఆనుకుని ఉన్న ప్రాంతంలో కదలికలు కనిపించాయి. దీంతో సహాయక చర్యలు ఆగాయి. మళ్లీ రాళ్లు జారిపడే సూచనలు కనిపించడంతో చుట్టుపక్కల భవనాల్లో ఉన్నవారిని బయటకు రప్పించారు. వర్షం తగ్గాక మళ్లీ సహాయక చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో ఫ్లడ్‌లైట్ల వెలుతులో ఎక్స్‌కవేటర్‌తో శిథిలాలను తొలగించారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు పరిశీలించారు.

అద్దెకు దిగిన మర్నాడే మృత్యువాత

కడప జిల్లా మైదుకూరుకు చెందిన కమ్మరి సంతోష్ ఆచారి (18), కృష్ణాజిల్లా కొత్తవరం గ్రామానికి చెందిన యశ్వంత్ (18) నగరంలోని ప్రైవేట్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో చేరారు. ఇద్దరూ కలిసి ఒకే గదిలో ఉండాలని నిర్ణయించుకున్నారు.

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు బండలపాలయ్యాయి. చదువుల కోసమని రేకుల షెడ్డులో తలదాచుకున్న విద్యార్థులు ఇద్దరైతే, అద్దెలు తక్కువని కొండ పక్కనే ఇంటిలో దిగినవారు కొందరు. సున్నపుబట్టీల సెంటర్‌లో కొండరాళ్లు పడి మృతిచెందిన వారి కన్నీటి కథలు..

సున్నపుబట్టీల ప్రాంతంలో 18వ నెంబరు సచివాలయం ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో అద్దెకు దిగారు. కొద్దిరోజుల క్రితం వరకు హాస్టల్‌లో ఉన్నవారు శుక్రవారమే ఈ షెడ్డులోకి వచ్చారు. కొండరాళ్లు జారిపడటంతో యశ్వంత్, సంతోష్ శిథిలాల కింద ఇరుక్కుపోయారు. సంతోష్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీయగా, యశ్వంత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

ఆ కుటుంబం సురక్షితం

క్రీస్తురాజపురానికి చెందిన కాకుమాని పెద వెంకటేశ్వరరావు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండకు చెంతనే ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి రెండు పోర్షన్ల భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చాడు. ఒక పోర్షన్‌లో ఉన్న కుటుంబం నెలక్రితం గుంటూరుకు వెళ్లింది. దీంతో ఈ కుటుంబం సజీవంగా మిగిలింది. భవనం మొత్తం నేలమట్టం కావడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి ధ్వంసమైంది. కుటుంబం మాత్రం ఇంట్లో లేకపోవడంతో మృత్యువు నుంచి బయటపడింది.

ఎందుకిలా..?

నగరంలో డ్రెయిన్ల డీ సిల్టింగ్ జరగకపోవటం, ప్రకాశం బ్యారేజీకి వరద రావటంతో ప్రధానమైన బందరు, ఏలూరు, రైవస్ కాల్వలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నుంచి నీరు కదలకపోవటంతో భారీ వర్షాలకు నగరం జలదిగ్బంధమైంది. స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నుంచి ఈ మూడు కాల్వల్లోకి నీరు వెళ్తుంది. కాల్వల్లో పూర్తిస్థాయి నీటిమట్టం ఉండటంతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నుంచి వచ్చే వరద ప్రవాహానికి అడ్డుపడింది. పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద లోబ్రిడ్జిలో నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. నగరంలోని 80 శాతానికి పైగా ప్రాంతాలు నీటిలో చిక్కుకున్నాయి. జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై కూడా ఇదే పరిస్థితి. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలు మొత్తం నీటిలో చిక్కుకున్నాయి.

ఉధృతంగా వాగులు



చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగులో ప్రమాదకరంగా రాకపోకలు

జిల్లావ్యాప్తంగా ప్రధాన వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో 50కిపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మైలవరం నియోజకవర్గం పరిధిలో పులివాగు, బుడమేరు వాగుల కారణంగా మైలవరం-జి.కొండూరు మధ్య 20 గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. చందర్లపాడు మండలంలో నల్లవాగు, అడవి రాములపాడు వాగులు పొంగి పొర్లాయి. ఈ కారణంగా నందిగామ-చందర్లపాడు మధ్య అనేక గ్రామాలకు రాకపోకలు లేవు. ఏనుగగడ్డ వాగు విజృంభణతో ఖమ్మంజిల్లా జమలాపురం నుంచి ఎన్టీఆర్ జిల్లా పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు, రంగాపురం, గొట్టుముక్కల మీదుగా పరిటాల వరకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. తిరువూరులో వినగడప-కట్టలేరు వాగు భారీగా ప్రవహిస్తోంది. దీని కారణంగా తోటమూల నుంచి నూజివీడు, విజయవాడ, తోటమూల నుంచి జమలాపురం వరకు మొత్తం 24 గ్రామాల పరిధిలో రాకపోకలు నిలిచిపోయాయి. రెడ్డిగూడెంలో కోతులువాగు పొంగి గ్రామం మీదకు పోటెత్తింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలకు పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

వాగు దాటబోయి.. వరదలో కొట్టుకుపోయి

» ముప్పాళ్ల వాగులో తప్పిన ప్రమాదం » కంపచెట్లు పట్టుకుని బతికిన బైకర్

స్థానికుల సాయంతో సురక్షితంగా బయటకు..

చందర్లపాడు, ఆగస్టు 31 : ముప్పాళ్ల వాగు వద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటే ప్రయత్నంలో ఓ బైకర్ కొట్టుకుపోయాడు. చివరికి కంపచెట్లు పట్టుకుని ప్రాణాన్ని కాపాడుకోగా, బైక్ వరదలో కొట్టుకు పోయింది. సేకరించిన సమాచారం ప్రకారం.. మండ లంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దర్శి రామారావు అనే వ్యక్తి శనివారం తన మోటారు బైకుపై వాగును దాటే ప్రయత్నం చేశాడు. ప్రమాదమని అక్కడున్నవారు వారించినా వినకుండా వాగు దాటాలని చూశాడు. వాగులో సగం వరకూ వెళ్లిన తరువాత ఇంజన్ ఆగిపోవడంతో పాటు వరద పెరగ డంతో అందరి కళ్లముందే వాగులోకి కొట్టుకుపోయాడు. చివరికి వరదలోని కంపచెట్లు పట్టుకుని ప్రాణం నిలుపుకొన్నాడు. కొద్దిసేపటి తరువాత గ్రామస్థులు తాడు సాయంతో అతడిని సురక్షితంగా బయటకు లాగారు.



వరదలో కొట్టుకుపోతున్న రామారావు (వృత్తంలో)

గుడ్లవల్లేరు కాలేజీ వద్ద భద్రత కట్టుదిట్టం

- విద్యార్థి సంఘాల నిరసన
- అడ్డుకున్న పోలీసులు



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బయట మోహరించిన పోలీసులు

గుడ్లవల్లేరు, ఆగస్టు 31 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. బాలికల హాస్టల్ వాష్ రూమ్‌ల్లో హిడెన్ కెమెరాల ఏర్పాటు వివాదం నేపథ్యంలో శనివారం పోలీసులు కళాశాల వద్ద భారీగా మోహరించారు. సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా నియమించిన సైబర్ టీమ్ కూడా పాల్గొంది. కళాశాలలోకి సిబ్బందిని మినహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. మంగళవారం వరకూ సెలవులు ప్రకటించడంతో కొందరు విద్యార్థులను వారి తల్లిదండ్రులు వెంటపెట్టుకుని తీసుకెళ్లారు. భారీవర్షం కారణంగా ఇళ్లకు వెళ్లే విద్యార్థుల కోసం గుడివాడ వరకూ కళాశాల బస్సులు ఏర్పాటు చేశారు. కాగా, ఇంటికి వెళ్తున్న విద్యార్థుల బస్సును విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. బస్సుకు అడ్డంగా పడుకుని నిరసన చేపట్టారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి, విద్యార్థులను ఇళ్లకు పంపారు. విద్యార్థుల మరో బస్సును గ్రామంలోని మంచినీళ్ల చెరువు వద్ద మరో సంఘంతో పాటు మీడియా చానళ్ల వారు అడ్డుకుని మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే, స్థానికులు వారిని అడ్డగించారు. పోలీసులు వచ్చి బస్సును పంపించేశారు. కాగా, కళాశాలలోని మహిళల హాస్టల్‌కు జిల్లా సర్వీసెస్ జడ్జి వెంకటకృష్ణ, గుడివాడ ఏజేఎఫ్‌సీఎం జడ్జి గాయత్రి, గుడివాడ ఆర్డీవో శనివారం పరిశీలించారు. అక్కడున్న విద్యార్థినులతో మాట్లాడారు.

వర్షంలోనూ వెరవక..

జిల్లాలో 82.13 శాతం పెన్షన్ల పంపిణీ

భవానీపురం, ఆగస్టు 31 : ఎడతెరిపిలేని వర్షాల్లోనూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ మాత్రం ఆగలేదు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల పర్యవేక్షణలో సిబ్బంది శనివారం వేగంగా పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,33,501 మంది వివిధ పెన్షన్‌దారులుండగా, 1,91,784 మందికి 82.13 శాతం పూర్తి చేశారు. మొత్తం పెన్షన్‌దారులకు రూ.98కోట్ల 57లక్షల 55వేలు పంపిణీ చేయాల్సి ఉండగా, శనివారం రూ.80కోట్ల 98లక్షల 98వేల 500ను అందజేశారు.



తోట్లవల్లూరులో వర్షంలోనే పింఛన్ల పంపిణీ


విజయవాడలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విరిగిపడిన చెట్టు


కంచికచర్లలో మధిర వెళ్లే రోడ్డుపై భారీగా నిలిచిన వర్షపు నీరు


పామర్రు తహసీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు


చింతలపాడు- గంపలగూడెం మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న గుర్రపువాగు

అతలాకుతలం!

రోజంతా కుంభవృష్టితో వణికిపోయిన ఉమ్మడి కృష్ణాజిల్లా

- ఉప్పొంగిన కాల్వలు, వాగులు.. సెలయేళ్లు మారిన రోడ్లు
- ఇళ్లు, కాలనీల్లోకి మోకాల్లోతుకు వర్షపు నీరు
- పంట పొలాలు నీట మునిగి భారీ నష్టం
- పల్లెల్లో ఆగిపోయిన రాకపోకలు.. కదలని వాహనాలు

నింగి పొంగిందా అన్నట్టు.. ప్రకృతి ప్రకోపించిందా అన్నట్టు ఏం వానబ్బా! ఏది ఊరో.. ఏది ఏరో.. ఏది పొలమో.. ఏది పంటో.. ఏది గుంతో.. ఏది రోడ్డో.. తెలియకుండా చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఏకధాటికి కురిసి ఉమ్మడి కృష్ణాజిల్లాను చివురుటాకులా వణికించింది. జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. వాన ధాటికి రోడ్లు జలమయమయ్యాయి. కాలనీలు మోకాల్లోతుకు నిండిపోయాయి. ఊళ్లు, పొలాలు చెరువులయ్యాయి. వాగులు, వంకలు, ఏర్లు పొంగి ప్రవహించాయి. చెట్లు కూలాయి. స్తంభాలు నేలకొరిగాయి. రోడ్డుపై నిలిపిన బైకులు, కార్లు నీట మునిగాయి. వరద ప్రవాహానికి పల్లెల మధ్య రాకపోకలు స్తంభించాయి. జనం గడపదాటి అడుగు బయట పెట్టడానికి వణికిపోయారు. అధికారులు అప్రమత్తమై ఎక్కడికక్కడే సహాయక చర్యలు చేపట్టారు.

వాగులు పొంగి.. దారులన్నీ మూసుకుపోయి..

కంచికచర్ల : నందిగామ డివిజన్‌లో ఎడతెరపిలేని వర్షం కురిసింది. డ్రెయిన్లు పొంగాయి. వీరులపాడు మండలం జగన్నాథపురం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు పొంగుతోంది. కంచికచర్ల నుంచి జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం, మధిర వెళ్లే దారి వరదతో మూసుకుపోయింది. దాములూరు కూడలి మార్గం కూడా బంద్ కావటంతో వెల్లంకి, పల్లెంపల్లి రూటులో కూడా మధిరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ దగ్గర చందాపురం నల్లవాగు, ముప్పాళ్ల వాగు పొంగటంతో చందర్లపాడుకు రాకపోకలు నిలిచిపోయాయి. అడవిరావులపాడు వాగుతో పాటుగా మరో మూడు వాగులు పొంగాయి. పెనుగంచిప్రోలుకు వెళ్లే ప్రధానమైన రెండు మార్గాలు మూసుకుపోయాయి. ముండ్లపాడు వాగు పొంగుతుండటంతో జాతీయ రహదారి నుంచి పెనుగంచిప్రోలు వెళ్లటానికి వీలుపడటం లేదు. రైల్వే అండర్‌పాస్ మునగటంతో మక్కపేట రూట్ కూడా బంద్ అయింది. నక్కలవాగు పొంగటంతో కంచికచర్ల నుంచి చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, కొత్తపేట, గనిఆత్కూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెండ్యాల వాగు పొంగటంతో కీసర నుంచి పెండ్యాల, వేములపల్లి, ఎస్.అమరవరం గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు కిలోమీటరు దూరం పోటెత్తింది. తోళ్ల వాగు, శుద్ధ వాగు, యేనుగుగడ్డ వాగు, గుట్టవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

● వీరులపాడు మండలం గూడెం మాధవరం గ్రామం ద్వీపంగా మారింది. ఒకవైపు యేనుగుగడ్డ వాగు, మరోవైపు గుట్ట వాగు, ఇతర వాగులు పొంగటంతో గ్రామానికి బయటకు వచ్చే మార్గాలు బంద్ అయ్యాయి.

● కట్లేరు, వైరాయేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లెంపల్లి - కూడలి చప్టా మీద మూడు అడుగుల ఎత్తున ఈ రెండు ఏర్లు పొంగి ప్రవహిస్తున్నాయి.

పొంగిన వెదుళ్లవాగు

తిరువూరు : తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే రహదారిలో పడమటి, చౌటపల్లి నుంచి జి.కొత్తూరు రోడ్డులో వెదుళ్లవాగు పొంగి ప్రవహిస్తోంది. లక్ష్మీపురం నుంచి మల్లేలరోడ్డులో, మునుకుళ్ల నుంచి వావిలాల, తిరువూరు నుంచి కోకిలంపాడు రోడ్డులోని చప్టాలపై వరదనీరు ప్రవహిస్తోంది. చింతలపాడు నుంచి గంపల గూడెం మధ్య గుర్రపువాగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో రాకపోకలు సంభించాయి. నూజివీడు రోడ్డులో లక్ష్మీపురం వద్ద రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో రాకపోలకు ఆటంకం ఏర్పడింది.

కృష్ణానదీ రేవుల్లో పడవల పరిశీలన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలోని కృష్ణానదీపాయలను ఆర్డీవో రాజు, తహసీల్దార్ ఎం.కుసుమ కుమారి, సీఐ చిట్టిబాబు, ఎస్సై ఎం.అర్జునరాజు సందర్శించి లంకలకు నడుపుతున్న పడవలను పరిశీలించారు. 'కష్టాలు కనపడవా' శీర్షికను శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి ఆర్డీవో, పోలీసు అధికారులు స్పందిచారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున పడవలను శని, ఆదివారాలు రెండు రోజులు నడప వద్దని యజమానులకు ఆర్డీవో సూచించారు. దీంతో రేవుల్లో పడవలు నిలిచిపోయాయి. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రాజు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లైఫ్ జాకెట్ల కోసం కలెక్టర్‌కు లేఖ రాశామని తహసీల్దార్ కుసుమ కుమారి తెలిపారు.

గోడ కూలి ఇద్దరు మృతి

జీ కొండూరు/ఉంగుటూరు : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఎన్టీఆర్ జిల్లాలో గోడ కూలి శనివారం ఇద్దరు మృతిచెందారు. జీ కొండూరు మండలం గంగినేని గ్రామంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న నన్నెబోయిన వెంకటేశ్వరరావు (42) కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తుంటాడు. వరద కారణంగా తన ఇల్లు ముంపునకు గురికావటంతో భార్య, ఇద్దరు పిల్లలను గ్రామంలోని సురక్షిత ప్రాంతానికి తరలించాడు. అనంతరం ఇంట్లో ఉన్న సైకిల్‌ను తీసుకొచ్చేందుకు సాయంత్రం వెళ్లగా వరద ఉధృతి కారణంగా ఇంటి గోడ ఎక్కాడు. అప్పటికే బాగా నాని పోయిన గోడ అకస్మాత్తుగా కూలటంతో శిథిలాల కింద చిక్కుకుపోయిన వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

● ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన సొంగా నెహేమియా (37)కు నివశించే ఇంటి మట్టి గోడ వర్షానికి కూలింది. గోడ పక్కన నిద్రిస్తున్న నెహేమియాపై శిథిలాలు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. తహసీల్దార్ విమలకుమారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


విజయవాడలోని నోవోటెల్ హోటల్ రోడ్డులో ఇలా..

స్తంభించిన రవాణా

- కొండపల్లి ఎర్రవంతెన రైల్వే ట్రాక్‌పై వరద
- వరదలో మునిగిన పట్టాలు.. కోసుకుపోయిన కంకర
- 25 రైళ్లు.. 68 బస్సులు రద్దు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారీ వర్షాలు ఎన్టీఆర్‌జిల్లాలో రవాణా వ్యవస్థను అతలాకుతలం చేశాయి. రైలు, బస్సులపై తీవ్ర ప్రభావం చూపించింది. భారీ వర్షం కారణంగా కొండపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోని ఆకువాని చెరువు సప్లయి చానల్ ఉధృతంగా ప్రవహించటంతోపాటు వరద నీరు రైల్వేట్రాక్‌కు ఎగదన్నింది. దీంతో పెద్దఎత్తున వరదనీరు రైల్వే పట్టాల మీదకు చేరింది. వరదనీటిలో పట్టాలు మునిగిపోయాయి. శుక్రవారం కురిసిన వర్షానికి చానెల్ నిండిపోగా, శనివారం కురిసిన వర్షానికి మరింత వరద పోటెత్తింది. దీనికితోడు కొండపల్లి అడవి నుంచి భారీ ఎత్తున వరదనీరు రావటంతో ఈ చానల్ మరింత ఉధృతితో సాగింది. వరద ఉధృతికి పట్టాల కింద కంకర కొట్టుకుపోయి ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. అప్పటికే వరద కారణంగా గూడ్స్ రైలును నిలుపుదల చేశారు. ఆ ప్రాంతంలోనే పట్టాల కింద కంకర వరదకు కొట్టుకుపోయింది. పట్టాల కింద కంకరను చీల్చుకుంటూ వరద సాగుతోంది. దాదాపుగా 500 మీటర్ల వరకు రైల్వే ట్రాక్‌పై నీరు చేరింది. దీంతో రైల్వే అధికారులు ఈ మార్గంలో వెళ్లే రైళ్లతో పాటు వాగుల ఉధృతిని దృష్టిలో ఉంచుకుని 25 రైళ్లను రద్దు చేశారు. వరదలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు శనివారం 68 ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు.


చల్లపల్లి మండలం నిమ్మగడ్డలో నీట మునిగిన పసుపు తోట

నిండిన చెరువులు.. మునిగిన పొలాలు

కంచికచర్ల : కంచికచర్ల, పరిటాల, తుర్లపాడు, జయంతి, అల్లూరు, జుజ్జూరు, నవాబుపేట, పెనుగంచిప్రోలు తదితర చెరువులన్నీ పూర్తిగా నిండాయి. వర్షం తగ్గకపోవటంతో ఏక్షణమైనా చెరువులకు గండిపడే ప్రమాదం పొంచి ఉండటంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

● పరిటాల, కునికినపాడు, చెవిటికల్లు, కంచెల, ఐతవరం, అడవి రావులపాడు, ముప్పాళ్ల తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. పొలాల్లో ఎక్కడ చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. వేల ఎకరాల్లో సాగు చేసిన పత్తి, మాగాణి వరి, మొక్కజొన్న, ఇతరత్రా పంటలు నీట మునిగాయి.

● భారీ వర్షానికి కంచికచర్ల పట్టణం అతలాకుతలమైంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు 24.1 సెంటీమీటర్ల వర్షం పడింది. డ్రైన్లు మూసుకుపోయి వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ఇందిరాకాలనీ, జంగాలకాలనీ, అరుంధతీ కాలనీ, అంబేద్కర్ కాలనీలతో పాటుగా ఇతర కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణ మొత్తం నీట మునిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఒక అడుగు ఎత్తున నీరు చేరింది. కార్యాలయ ఆవరణలో ఉన్న ఐదు దశాబ్దాల పైబడిన భారీ వృక్షం నేలకొరిగింది.

ఎగదన్నిన ప్రధాన డ్రెయిన్లు

అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో శనివారం ఒక్కరోజు 110 విల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మురుగు కాలువలు ఎక్కడికక్కడ స్తంభించి పల్లపు పంట పొలాలు నీటమునిగాయి. అవనిగడ్డలోని సింహాద్రి కాలనీ, లంకమ్మ మాన్యం, సుగాలి కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలోని డ్రెయిన్లు ఉగ్గబట్టడంతో నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. రత్నకోడు కాచ్‌మెంట్ డ్రెయిన్లు మొత్తం స్తంభించిపోయాయి. నాగాయలంక మండల పరిధిలోని వక్కపట్లవారిపాలెం, చోడవరం, నంగేగడ్డ, భావదేవరపల్లిలోని కొన్ని ప్రాంతాలు అవనిగడ్డ మండలంలోని వేకనూరు, అశ్వారావుపాలెం, కోడూరు మండలం పోటుమీద తదితర గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ స్తంభించి పంట పొలాల్లో నీరు బయటకు కదలక పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

కొనసాగుతున్న వరద ఉధృతి

కృష్ణానదిపై ఉన్న బ్యారేజీ నిండిపోవటంతో శనివారం కూడా వరద కొనసాగింది. పులిగడ్డ వద్ద 14 అడుగుల మేర వరద చేరింది. అక్విడెక్ట్ ఎడమ వైపున వరద నీరు అక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తోంది. దాదాపు 3 లక్షల 35 వేల క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడుదలవుతోంది. మున్నేరు నుంచి కూడా వరద వస్తుండటంతో మంగళ, బుధవారం వరకు వరద కొనసాగే అవకాశం ఉందని, లంక భూముల రైతులు ఎట్టిపరిస్థితుల్లో ప్రవాహంలో నది దాటొద్దని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. పాత ఎడ్లంక వద్ద ఉధృతి తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగాయలంక మండలంలోని ఎదురుమొండి దీవులకు పంటు సర్వీసు నడుస్తున్నప్పటిక వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని రాకపోకలు తగ్గించుకోవాలని అధికారులు సూచించారు. మరో దివి గ్రామమైన ఈలచెట్లదిబ్బకు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.

లోతట్టువాసులు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్ : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. ముంపునకు గురయిన ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైన్లు, కాలువల్లో నీరు పారేందుకు అడ్డంకులు తొలగించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు ప్రారంభించాలన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ వరద ప్రాంతాల్లో పర్యటించాలన్నారు.

వరదకు పసుపు, కంద పంటలు మునక

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు లంకల్లో కృష్ణానదీ వరదకు పల్లపు ఏరియాల్లో కంద, పసుపు తోటలు ముంపునకు గురయ్యాయి. వరద గంటగంటకూ పెరుగుతుండటంతో లంక రైతులు ఆందోళన చెందుతున్నారు. తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, రొయ్యూరు గ్రామాల్లో మాగాణిలో వరిచేలు ముంపునకు గురయ్యాయి. ఏనుగులకోడు డ్రెయిన్, కనకవల్లి డ్రెయిన్ నిండుగా ప్రవహిస్తుండటంతో మురుగు నిదానంగా దిగుతోంది. దీంతో వరి చేలల్లో మోకాటిలోతు మురుగు చేరింది. కుమ్మమూరులో పంట కాలువల్లో వరద ఎగదన్ని నివాస గృహాల్లోకి చేరింది. తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీలోని ఇళ్లలోకి వాననీరు చేరింది. రొయ్యూరు వేణుగోపాలస్వామి ఆలయంలోకి మోకాటిలోతు నీరు చేరింది.


గుణదలలోని ఏలూరు రోడ్డులో భారీగా నిలిచిన వర్షపు నీరు

జీ కొండూరులో మండలంలో భయం.. భయం..!

జీ కొండూరు : హెచ్ ముత్యాలంపాడుకు చెందిన చల్లా మోహనకృష్ణ (31) పశువుల కోసమని బుడమేరుకు వెళ్లి గల్లంతు అయ్యాడు. వీనపాక దగ్గర పులివాగులో 20 మంది స్థానికులు వరదలో చిక్కుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్‌కు సమాచారం ఇవ్వటంతో తక్షణం వారు వచ్చి వరదలో చిక్కుకున్న వారిని రక్షించారు.

● కోడూరులో ఎర్ర చెరువుకు గండి పడింది. బుడమేరు కట్ట మీద నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. గండి పడితే తమ ఊరు మునిగిపోతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

● భారీ వర్షం కారణంగా కొండవాడు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పాటు పొంగి కుంటముక్కల గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలోకి వరద నీరు చేరింది. ఈ సంస్థల్లో మొత్తం 600 మంది బాలికలు ఉన్నారు. వీరిని ట్రాక్టర్ల ద్వారా చెవుటూరు జడ్పీ స్కూలుకు తరలించారు.

● పులివాగు ఉధృతం రూపం దాల్చింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోకి వరద ప్రవేశించింది. ఈ వరదలో ఎంపీడీఓ అనూరాధ 3 గంటల పాటు చిక్కుకుపోయారు. ఆమెను ట్రాక్టర్ ద్వారా బయటకు తీసుకు వచ్చారు. జీ కొండూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన శివాలయం పూజారి కుటుంబం పులివాగులో చిక్కుకుంది. రెవెన్యూ అధికారులు కాపాడారు. జీ కొండూరు తహసీల్దార్ కార్యాలయం జలదిగ్బంధం కావటంతో ఫైల్స్ మొత్తం తడిసి ముద్దయ్యాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ సృజన

కృష్ణలంక : జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులను అప్రమత్తం చేసేందుకు శనివారం కలెక్టర్ సృజన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. టెలికాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డీఆర్వో ఎస్.శ్రీనివాసరావు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

● **ప్రజలు ప్రయాణాలను రద్దు చేసుకోవాలి**

జిల్లాలో జోరున వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో శనివారం వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలం, డివిజన్‌స్థాయిలో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటుచేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనావేసి చర్యలు చేపట్టాలన్నారు. పంటలు నీటమునిగిన ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి రైతులకు తగు సూచనలు అందించాలన్నారు.

నూతన కౌలు చట్టాన్ని అమలు చేయాలి

చర్చాగోష్టిలో పలువురు వక్తలు

ధర్నాచౌక్, ఆగస్టు 31: గ్రామ సభల్లోనే నేరుగా కౌలురైతులను గుర్తించి భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండానే వారికి గుర్తింపు కార్డులు జారీ చేసేలా నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని పలు రైతు, కౌలురైతు సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో చర్చాగోష్టి కార్యక్రమం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న అన్ని రకాల పంట విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, సూక్ష్మ పోషకాలు, వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డు పొందిన భూమిలేని ప్రతీ కౌలురైతులకు "అన్నదాత సుఖీభవ" పథకాన్ని వర్తింపజేసి రూ.20 వేల పెట్టుబడి సాయం కింద అందించాలన్నారు. రైతు స్వరాజ్ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు విసా కిరణ్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారానే కౌలురైతులను గుర్తించేలా చట్ట రూపకల్పన జరగాలన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల రక్షణ, సంక్షేమం కోసం సమగ్రమైన కౌలుచట్టం తీసుకురావాలని, కౌలు రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చేందుకు ఎటువంటి ఆటంకాలు, ఆంక్షలు లేని కౌలు వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా చట్టాన్ని రూపొందించాలని ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.కోటమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కౌలురైతుల సంఘం గౌరవాధ్యక్షుడు సీహెచ్.కేశవ్‌శెట్టి ప్రసంగించారు.

నేటి నుంచి పీడీఎస్ ద్వారా సరుకుల పంపిణీ

కృష్ణలంక, ఆగస్టు 31: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సెప్టెంబరు నెల నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నుంచి ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. చౌకధరల దుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ద్వారా సరుకుల పంపిణీని ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార మొదలైన నిత్యావసర వస్తువుల పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. కార్డుదారులకు ఇంటివద్దనే పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని రైస్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

విజయవాడ

● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.05

పాత శివాలయంలో నందీశ్వరస్వామికి ప్రదోషకాల అభిషేకం



వన్‌టౌన్, ఆగస్టు 31: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఆలయం (పాత శివాలయం)లో శనివారం బహుళ త్రయోదశి తిథి సందర్భంగా ప్రదోషకాలంలో నందీశ్వర స్వామికి అర్చకులు మహన్యాస పూర్వక రుద్రాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విశేష పుష్ప అలంకరణ చేశారు. పంచహారతులు సమర్పించారు. ఉభయదాతలకు మంత్రపుష్పం, ఆశీర్వచనం కార్యక్రమాలను నిర్వహించారు. ఈవో కానూరి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు రాచకొండ సుమంతశర్మ, నాగరాజశర్మ, కొత్తపల్లి సాయికృష్ణ శర్మ, తదితరులు పూజాదికాలను నిర్వహించారు.

ముంచెత్తిన వాన

- లోబ్రిడ్జిలో నిలిచిన నీరు.. ట్రాఫిక్‌కు అంతరాయం
- నీట మునిగిన రోడ్లు..ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
- స్తంభించిన జనజీవనం

వన్‌టౌన్, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత 48 గంటలపాటు ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి వన్‌టౌన్ ప్రాంతంలోని రోడ్లు, కాలనీలు అస్తవ్యస్తంగా మారాయి. డ్రెయినేజీలు పొంగటంతో పాటు వాననీరు కూడా చేరి రోడ్లమీదకు రావటంతో ఎక్కడ చూసినా మోకాళ్ల లోతు పై వరకు నీరు నిలిచిపోవటంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. హాకర్లకు, కూలీలకు జీవనోపాధి లేకపోయింది. షాపులలో కూడా వ్యాపారాలు జరగలేదు. సైడ్ కాలువల్లో నీటి ప్రవాహం సరిగా జరగకపోవటంతో రోడ్లపైకి నీరు చేరింది. వాన కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. ఉద్యోగులు కూడా తమ విధులకు వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు.



జెండా చెట్టు వీధిలో నిలిచిన నీరు



కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద...

వన్‌టౌన్ నుంచి టూ టౌన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న లోబ్రిడ్జిలో నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించే క్రమంలో వాహనాలను దారిమళ్లించారు. మరోపక్క పండిట్‌నెహ్రూ బస్టాండ్ అవుట్ గేట్ సమీపంలో లోబ్రిడ్జిలో కూడా భారీగా నీరు నిలిచిపోవటంతో కార్లు, బస్సులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బస్సులో దాదాపు సీట్ల వరకు నీరు రావటం ఇదే ప్రథమమని చెబుతున్నారు. లోబ్రిడ్జిలో దాదాపు గంటన్నరకు పైగా రాకపోకలు సాగలేదు. గట్టువెనుక ప్రాంతమైన పలు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయి. భవానీపురం, విద్యాధరపురం రోడ్లలో నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడింది.

వించిపేటలోని పలు రోడ్లపై వాన నీరు నిలిచింది. దీనికి తోడు డ్రెయినేజీ నీరు కూడా తోడవటంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. వన్‌టౌన్ జెండా చెట్టు రోడ్డు, పూలబావి వీధులు, గణపతిరావు రోడ్డు, నైజాం సెంటర్ మశీదు రోడ్డు, మెయిన్ రోడ్డు, విద్యాధరపురం కామకోటినగర్ రోడ్డు, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, భవానీపురం, కోళ్లఫారం రోడ్డు, గాంధీ బొమ్మ రోడ్డు తదితర రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. భవానీపురం హెచ్‌బీ కాలనీ లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు, మురుగు నీరు పారుదల కావటంతో సామాగ్రి మొత్తం తడిచిపోయాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాహనదారులు ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడ్డారు.

● వన్‌టౌన్, పంజా సెంటర్ వద్ద ముసాఫిర్ ఖానా సమీపంలోని గాంధీ కొండ చరియలు విరిగిపడ్డాయి. గాంధీ హైస్కూల్ వద్ద ఉన్న సంపులో చెత్త, ఇతర వ్యర్థాలు నిలిచిపోవటం వలన వర్షపు నీరు పారుదలకు అంతరాయమేర్పడింది. స్థానిక కార్పొరేటర్లు, సిబ్బందితో సంపులో నిలిచిపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు.

లేబర్‌కాలనీ, చెరువుసెంటర్లలో ఇళ్లల్లోకి చేరిన నీరు



రోటరీనగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు, రోటరీనగర్ వీధుల్లో రాత్రి 8 గంటల ప్రాంతంలో నీరు

భవానీపురం: ఎడతెరిపి లేని వర్షాలకు లేబర్‌కాలనీ, చెరువుసెంటర్, రోటరీనగర్, సితార, భగత్‌సింగ్‌నగర్, బ్రహ్మయ్యకాలనీ, హెచ్‌బీ కాలనీ, ఊర్మిళానగర్‌లను ముంచెత్తాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు భారీ వర్షం కురవడంతో ఈ కాలనీలోని ఇళ్లల్లోకి మోకాలి లోతు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, దుర్గారావులు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. శానిటరీ సిబ్బంది పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. చెరువుసెంటర్, రోటరీనగర్, నాలుగుస్తంభాల సెంటర్లలో రాత్రి 8 గంటల వరకు వర్షపు నీరు రోడ్లపైనే ప్రవహించింది. సొరంగం వైపు బస్సులు, లారీలు, భారీ వాహనాలను నిలుపుదల చేశారు.

బిక్కుబిక్కుమంటూ కొండ ప్రాంతాలు

44,45 డివిజన్లలోని కొండ ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. మణెమ్మ బడ్డీ కొట్టు ప్రాంతంలో ఎస్ అప్పల కొండమ్మ ఇల్లు కొండ చరియలు పడటంతో పూర్తిగా ధ్వంసమైంది. టీడీపీ సీనియర్ నేత బొమ్మసాని సుబ్బారావు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రెడ్డిపల్లిరాజు, శనివారపు శివలు పాల్గొన్నారు. ఈ డివిజన్‌లోనే కొండబడి ఎదురుగా ఉన్న ఇళ్లపై మట్టిపెళ్లలు పడటంతో ఎల్లారావు, అప్పారావు, రాంబాబులు స్వల్పంగా గాయపడ్డారు. 45వ డివిజన్ సొరంగం వైపు కొండ ప్రాంతంలో ఆకుల సతీష్ ఇల్లు పాక్షికంగా ధ్వంసం కాగా, మరో వ్యక్తి ఇంటి గోడ కూలింది. శర్మ అనే వ్యక్తి ఇంటి ఫెన్సింగ్ దెబ్బతింది. బాధితులను జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ పరామర్శించారు. మద్రిశివ, ఇతర నేతలు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలు జలమయం

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, ఆగస్టు 31: భారీ వర్షానికి నగర శివారు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో ప్రతీ వీధి చెరువులను తలపించేలా తయారయ్యాయి. ఇక లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులు మరీ అధ్వానంగా మారాయి. ఇళ్లల్లోకి సైతం వర్షపు నీరు చేరిపోవడంతో చాలా మంది ఇళ్లల్లో నుంచి నీటిని బయటకు తోడుతున్న దృశ్యాలు కనిపించాయి. ప్రధానంగా కండ్రిక కాలనీ, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్‌నగర్ ప్రాంతాల్లో జనం ఇళ్లల్లో నుంచి బయటకు రావడానికి కూడా ఆస్కారం లేకుండా అయిపోయింది. నూజివీడు ప్రధాన రహదారి సైతం చెరువులను తలపించింది. పలు చోట్ల నీళ్లల్లో ఎక్కడికక్కడ వాహనాలు మొరాయించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గాలి వాన ధాటికి ఉడాకాలనీలో భారీ వృక్షం నేలకొరిగింది. విద్యుత్ తీగలు తెగిపడిపోవడంతో విద్యుత్ శాఖాధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. నగరపాలక సంస్థ సిబ్బంది భారీ వృక్షాన్ని తొలగించి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. ఉడాకాలనీలో ఎక్కడ చూసినా విషసర్పాల సంచారం కనిపించింది.



కండ్రిక కాలనీలో పర్యటించిన బొండా ఉమా



ఇంట్లోకి చేరిన నీటిని తోడుతూ..

బొండా ఉమా పర్యటన

శివారు ప్రాంతాలు జలమయం కావడంతో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శనివారం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో మాట్లాడి ముంపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముంపు ప్రాంత వాసులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేయించేలా చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిని మోటర్ల సహాయంతో తోడించాలని ఆదేశించారు. ● 64వ డివిజన్ కండ్రిక కాలనీలో టీడీపీ నేత కె. రవికుమార్ ఆధ్వర్యంలో ముంపు ప్రాంతంలో 500 మందికి టిఫిన్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ● ఎల్‌బీఎస్ నగర్, పటేల్‌నగర్ ప్రాంతాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు శనివారం పర్యటించారు. ముంపు ప్రాంతవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

కూలిన రిటైనింగ్ వాల్స్, ఇంటి గోడలు

చిట్టినగర్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కొత్తపేట, చిట్టినగర్, కేఎల్ రావునగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, వీధులన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు, మురుగునీరు ఇళ్లలోకి పోవడంతో ఆయా ప్రాంతవాసులు నరకయాతన పడ్డారు. టైలర్‌పేట, జోడుబొమ్మల సెంటర్, కొత్తపేట వీధులు చెరువుల్లా మారాయి. కొత్తపేట పోలీస్‌స్టేషన్ వర్షం, మురుగునీటితో నిండిపోయింది. పాలఫ్యాక్టరీ నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు రోడ్డులో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. కొత్తపేట హిమాలయ హోటల్ సందులో, చిట్టినగర్ రాయప్పరాజువీధిలో చెట్లు కూలి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాయప్పరాజువీధిలో వేపచెట్టు కూలి విద్యుత్ తీగలపై పడటంతో తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు.

● కొత్తపేట, గొల్లపాలెంగట్టు, పైజర్‌పేట తదితర కొండప్రాంతాల్లో పలు రిటైనింగ్ వాల్స్‌తోపాటు, ఇంటిగోడలు కూలిపోయాయి. 51వ డివిజన్ పితాని అప్పలస్వామి వీధిలో వై. చిట్టిబాబు పాత డాబాఇల్లు కొంతభాగం కూలి పక్కనే ఉన్న మూడు ఇళ్లపై పడింది. రాయన చిట్టిబాబు వీధి కొండప్రాంతానికి వెళ్లే మెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రాజగిరివీధిలో ఇంటి ప్రహరి కూలింది. ఘటన ప్రాంతాన్ని స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, వెస్ట్ ఎమ్మార్వో ఇంతియాజ్, ఏఈ రామకృష్ణతోపాటు టీడీపీ నాయకులు సుకాసి కిరణ్‌కుమార్ సందర్శించారు. కొండప్రాంతవాసులను సమీపంలోని పునరావస కేంద్రాలకు తరలించారు. 49వ డివిజన్ కొండప్రాంతంలోని ఎం.కోటయ్యవీధిలో ఇంటి ముందు వాల్ కూలి క్రింద ఉన్న రేకుల షెడ్డుపై పడింది. 50వ డివిజన్‌లో కొండ్రువారివీధి, ఆలేటివారివీధిలో రిటైనింగ్ వాల్ కూలటంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. బాధితులను సమీపంలో పునరావస కేంద్రాలకు తరలించారు.



రాజగిరివీధిలో కూలిన ఇంటిగోడ, వర్షం నీటిలో కొత్తపేట స్టేషన్

సత్యనారాయణపురం, ఆగస్టు 31: ఎడతెరిపి లేకుండా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా సత్యనారాయణపురం, ముత్యాలంపాడు,

చెరువులను తలపిస్తున్న రోడ్లు

భానునగర్, బుడమేరు మధ్యకట్ట అయోధ్యనగర్ తదితర ప్రాంతాల్లో పలు రోడ్లలో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో దుకాణాలను సైతం తెరవలేదు. పనుల మీద బయటకు వెళ్లిన వారు ఇళ్లకు రావడానికి నానా అవస్థలు పడ్డారు.

భానునగర్‌లో ఇళ్లలోకి, బుడమేరు మధ్యకట్ట ప్రాంతంలో ఇళ్లలో నీరు చేరింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక కార్పొరేటర్‌లు వర్షం నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



ఎన్నార్పీ రోడ్డులో నిలిచిన నీరు



గుంట ప్రాంతంలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

34వ డివిజన్ కేదారేశ్వరపేటలో..

పాతరాజేశ్వరిపేట, ఆగస్టు 31 : నగరంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నగరం జలమయమైంది. ఎక్కడ చూసినా ముంపు సంభవించింది.

రోడ్లు, ఇల్లు, డ్రెయిన్లు, యూజీడీలు వర్షపు నీటితో మునిగి అల్లకల్లోలం సృష్టించాయి. స్థానిక 34వ డివిజన్ కేదారేశ్వరపేట లైన్‌లు అన్ని వర్షపునీటితో నిండిపోయాయి. ఇక గుంట ప్రాంతంలో ఎర్రకట్ట రోడ్డుకు చేరే మెట్లమార్గంలో పెద్ద చెట్టు నేలకూలింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరుకోవడంతో స్థానికులు మోటార్ల సాయంతో ఆ నీటిని బయటకు తోడారు. పెజ్జోనిపేట, వించిపేట నైజాంగేటు వద్ద ఉన్న అవుట్ డ్రెయిన్ వద్ద చెత్తచెదారం, వ్యరాలు, చెట్టుకొమ్మలు చేరుకోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నాయకులు జేసీబీల సాయంతో వ్యర్థాలను తొలగించారు. ఇక పాతరాజరాజేశ్వరిపేట, కంసాలిపేట, పూర్ణానందంపేట వీధులు కూడా వర్షపు నీటితో నిండాయి.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

విద్యాధరపురం, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ సభ్యులు, ఎన్డీయే కూటమి నాయకుల సహకారంతో శనివారం పలు సేవలు అందించారు. భవానీపురం ప్రియదర్శిని కాలనీ, ఇందిరాగాంధీ కాలనీ, హెచ్‌బీ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షం వలన ఇబ్బందిపడిన బాధితులకు పులిహోర, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుజనా ఫౌండేషన్ సభ్యులు వీరమాచినేని కిరణ్, చింతా బాబి, ఎం. అరుణ్, నాయకులు బి. శ్రీధర్, ఎ. బుల్లబ్బాయ్, పాల్గొన్నారు. ● 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో భవానీపురం ప్రియదర్శినీ కాలనీ, హెచ్‌బీ కాలనీ, దర్గాప్లాట్లు, చర్చి ఏరియా, తదితర ప్రాంతాల్లో బిర్యానీ రైస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



42వ డివిజన్‌లో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న తిరుపతి అనూష

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

సత్యనారాయణపురం, ఆగస్టు 31: భారీ వర్షంలోను సెంట్రల్‌లో పలు ప్రాంతాల్లో పింఛన్లను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. సెప్టెంబరు 1వ తేది ఆదివారం సెలవు దినం కావడంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒకరోజు ముందుగానే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. జోరు వాన లెక్కచేయకుండా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

మధురానగర్: 29వ డివిజన్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పీవీఆర్ నాయకులు సచివాలయ అధికారులతో కలిసి కొబ్బరితోట, నేతాజీకాలనీ, సాయిబాబా కాలనీ, పప్పులమిల్లు ఏరియా, ఇందిరానగర్, తదితర ప్రాంతాల్లో పెన్షన్‌లు పంపణీ చేశారు.

పొట్టిశ్రీరాములు కాలేజీలో ముగిసిన హాకథాన్ 1.0

వన్‌టౌన్, ఆగస్టు 31: పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన రెండు రోజుల హ్యాకథాన్ 1.0 కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఐఐటీ ఖర్గపూర్ సహా పలు ఇంజనీరింగ్ కాలేజీలలోని ప్రతిభావంతులు పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లో విభిన్న డొమైనర్లలో టెక్నాలజీని వినియోగించే అంశాలను తెలుసుకోగలిగారు. అన్ని విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులు తమ సృజనాత్మకతను, నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై జరిగిన పోటీల్లో నగదు బహుమతులను అందచేశారు. ప్రభుత్వ సాంకేతిక విద్య విభాగం ఉప సంచాలకుడు డాక్టర్ బచ్చు నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ముగింపు సభలో పాల్గొని హ్యాకథాన్‌ను విజయవంతం చేసిన విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. కాలేజీ వ్యవస్థాపక సభ్యుడు చలువాది మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్ర కుమార్, కార్యదర్శి చిట్టా అమరసుధీర్, సంయుక్త కార్యదర్శి గ్రంధి పవన్ కుమార్, కోశాధికారి కాజ రాఘవయ్య, హ్యాకథాన్ 1.0 ప్రధాన నిర్వాహకుడు డాక్టర్ షేక్ అక్బర్, విభాగాధిపతి నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

RUNNING VERY SUCCESSFULLY at NAVRANG A/c
డిమోంటి కాలని II
(TELUGU) DAILY 4 SHOWS
11-30 AM, 2-30 PM, 6-30 PM, 9-45 PM
ADVANCE BOOKING OPEN ONLINE "BOOK MY SHOW"

నేడే చూడండి
అప్సర సినిమా
తంగలాన్
రోజూ 2 ఆటలు : 11-15AM, 6-15PM
విక్రమార్క
రోజూ 2 ఆటలు : 02-30PM, 9-30PM
www.justickets.in
www.bookmyshow.com

SUPER HIT నేడే చూడండి
BLOCKBUSTER RESPONSE EVERYWHERE
నేను కీర్తన
NOW IN THEATERS

విజయవాడ	-	అన్నపూర్ణ కాంప్లెక్స్
గుడివాడ	-	బాలాజీ
మచిలీపట్నం	-	వరం సెంట్రల్‌మాల్
నందిగామ	-	లక్ష్మీ ప్రసన్న
మైలవరం	-	నారాయణ

CONTACT: 9866010970

Capital CINEMAS 4K
TRENDSET MALL, BENZ CIRCLE
Book Online Tickets: Paytm TICKETNEW
NOW SHOWING
SARIPODHAA SANIVAARAM (U/A) (TEL)
9:20 AM,10:35 AM,11:35 AM,12:45 PM,1:30 PM
2:00 PM,3:00 PM,4:10 PM,4:20 PM,4:30 PM
5:30 PM,6:30 PM,7:35 PM,7:45 PM,7:50 PM
9:00 PM,10:00 PM,10:40 PM,11:00 PM
COMMITTEE KURROLLU (U/A) (T) 10:20 AM
1:10 PM,11:10 PM
AHO VIKRAMAARKA (U/A) (TEL)
11:20 AM, 4:50 PM
IT ENDS WITH US (A) (ENG) 2:10 PM
STREE 2 : SARKATE KA AATANK (U/A) (HIN)
7:40 PM, 11:05 PM
AAY (U/A) (TEL) 10:50 AM,1:40 PM,7:50 PM
DEMONTE COLONY 2 (U/A) (TEL)
10:20 AM, 5:00 PM
*NOTE: Timings are subject to change without any prior notice.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

FLAT FOR SALE

» న్యూ 2 BHK-1290 Sft, 3BHK-1550 Sft ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. PVR Meadows (70 Flats) శ్రీ కనకదుర్గానగర్ కాలనీ, ఆయుష్ హాస్పిటల్ దగ్గర VJA. సెల్:97034 19192
AJB-194204

» నందిగామ రైతుపేట NH-65 మీద, LP థియేటర్ ప్రక్కన నిర్మించిన విఘ్నేష్ ప్లాజా నందు 2BHK ఫ్లాట్స్ మరియు కమర్షియల్ షాప్స్ అమ్మకమునకు సిద్ధముగా కలవు. సెల్ : 76800 70510
AJB - 194222

» 2 & 3 BHK DELUXE FLATS, గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. అయ్యప్పనగర్, కానూరు, పోరంకి, తాడిగడపలో 34 Lakhs onwards. M.P. Developers సంప్ర.89856 50007.
AJB -74

బిల్డింగ్ & కన్‌స్ట్రక్షన్

» తక్కువ ఖర్చు, పూర్తి క్వాలిటీతో మీ ఇల్లు మరియు ఇతర ఏవిట్టడాలైన కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టబడును. లోన్ సౌకర్యం కలదు. సంప్ర: PVR Constructions. సెల్: 77805 69091
AJB-194205

PLOT FOR SALE

» VJA బందరు రోడ్డు, ఇళ్ళ మధ్యలో CRDA RERA LP NO: 21/2024, 70/2024 ప్లాట్స్, హౌసెస్, విల్లాలు, బ్యాంకులోన్, స్పాట్ రిజి. & 94404 83810, 95531 29369
AJB -194977

» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర.78934 21245.
AJB -59

DISTANCE EDUCATION

» PRABHAS COLLEGE, VJA : ADMS FOR BA, B.COM, B.Sc., (All) BBA, BCA, MA, M.COM, M.Sc., (MICRO / CHE / COMP) MHRM, MBA, MCA & B.Ed., HURRYUP : 7670941483, 9441802525
AJB-67

EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, & 99493 08940
AJB-194055

TO - LET

» రామవరప్పాడు రింగ్‌రోడ్డుకు దగ్గర సర్వీస్ రోడ్డులో SBI బ్యాంకు పైన 1150 అడుగుల కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. సంప్ర. సెల్ : 99490 13355
AJB - 1

» Deepthi Rentals VJAలో ఇళ్ళు, అపార్ట్‌మెంట్స్‌లు, ఆఫీసులు గెస్ట్‌హౌసులు, గోడౌన్లు అద్దెకు కావాలన్నా - ఇవ్వాలన్నా. & 99088 27518
AJB -176

REAL ESTATE

» గన్నవరంలో ఇళ్లు, అపార్టుమెంట్లు, స్థలములు, పొలములు, అమ్మాలన్నా, కొనాలన్నా, అప్పు కావాలన్నా, ఇవ్వాలన్నా, 5 సెంట్లు డాబా, 3 సెంట్లు డాబా అమ్మకం.సెల్:94405 77206
AJB-194974

» హౌసెస్, వేకెంట్‌సైట్స్ కొనాలన్నా, అమ్మాలన్నా, డిస్ప్యూట్‌లో ఉన్న, కోర్టులో వున్న ఆర్బిట్రేషన్ చేయబడును. శని, ఆదివారాలు మాత్రమే సంప్రదించండి. సెల్ : 95505 05208
AJB - 194548

2 గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ఫ్లాట్స్ &UDA అప్రూవ్ ప్లాట్స్ & పొలములు. అ / కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 9848986831.
AJG-172

2 అమరావతి రాజధాని ప్రాంతంలో పెంపర్లకు అనువైన పొలాలు అమ్మబడును. ఎకరం 1.5 Cr నుండి ప్రారంభం, లింగాపురం, రాపెం, పొన్నెకల్లు, అమరావతి, కుంటేరు CRDA అప్రూవ్ వెంచర్లలో ప్లాట్లు అమ్మబడును. గజం 13,000 నుండి ప్రారంభం. సంప్ర॥ 88863 55955, 88868 55355.
AJG-184788

WANTED

» Sales Girls in Vijayawada having Skills in Telemarketing, Digital, Quality calls required urgently on temporary basis. Contact 85009 60577
AJB -194211

» ఏ బాధ బందిలేని వితంతవు వయస్సు 40-50 సం.ల మధ్య ఇంటిలో వుండి, ఇంటి పని వంట పని చేయుటకు కావలెను. & 80089 75044.
AJB -194060

» విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద మెస్ నందు పనిచేయుటకు గుమస్తా, సప్లయి పార్శిల్ కొరకు సిబ్బంది కావలెను భోజనం వసతి కలదు. & 62813 02599
AJB -182449

2 బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయీస్, గృహిణులు, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ : 35-70, Q :10th, జీ : 12-15 వేలు, సంప్ర॥ 6304181391
AJG-9549

HEALTH CARE

» మీరు / మీ ఆప్తులు మితిమీరిన త్రాగుడు నుండి బయటపడాలనుకుంటే, పూర్తిగా ఉచిత సాయానికై ఆల్కహాలిక్స్ ఎనానిమస్‌కు రండి. & 86880 34636, 96189 45496
AJB -194534

FINANCE

గవర్నమెంట్ ఉద్యోగస్థులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా పద్ధతిలో ఫైనాన్స్ చేయబడును. సిబిల్ చూడబడదు. Govt. Reg.No. 136/2009.
Cell: 9666547338
AJD:186735

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE, SITUATION VACANT, TO LET, AUTOMOTIVE, COMPUTERS, HEALTH CARE, EDUCATION, ENTERTAINMENT
రూ॥ 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777,
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
& 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
& సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

కొత్తగా...

ఓ యువకుడి న్యాయపోరాటం



ప్రియదర్శి కొత్త చిత్రం మొదలైంది. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తయారయ్యే ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. రామ్ జగదీశ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియదర్శిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నాని తొలి క్లాప్ ఇచ్చారు. అన్యాయంగా ఒక కేసులో ఇరికించిన ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయపోరాటం ఈ చిత్రకథ అని దర్శకుడు చెప్పారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి ఇతర ముఖ్యతారాగణం.

సుబ్రహ్మణ్య సాహసాలు



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ మరోసారి మెగాఫోన్ పట్టారు. తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ 'సుబ్రహ్మణ్య' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటికే అరవై శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాను అడ్వెంచర్ థ్రిల్ అందించడానికి బిగ్ ఫార్మెట్‌లో చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన కథతో గ్రాండ్ విజువల్స్, ఎమోషనల్ ట్రీట్‌తో సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీత దర్శకుడు. విఘ్నేష్ రాజ్ చాయాగ్రాహకుడు.

ఏడాది కిందట



రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా టించిన ప్రేమకథా చిత్రం 'వెంకటలక్ష్మితో' పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. 'ఏడాది కిందట' అనేది ట్యాగ్‌లైన్. రామమూర్తి కొట్బాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఇది స్వచ్ఛమైన ప్రేమకథాచిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. అంతా కొత్తవారితో తీశాం' అన్నారు దర్శకుడు.

'ప్రణయ గోదారి' పాట



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి 'గు గు గ్గు' అంటూ సాగే హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ విడుదల చేశారు. మార్కండేయ రాసి స్వరపరిచిన ఈ పాటను భార్గవి పిళ్లై పాడారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకుడు.

అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు



ఇప్పుడు సొసైటీలో 22 ఏళ్లకే పెళ్లి ఎప్పుడు అని అడుగుతున్నారు. అందుకే నేను హౌస్ వైఫ్‌గా, అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు. నటిగా అన్ని పాత్రలూ చేయాలి. అయితే తల్లిగా బాగా చేశావు అనేకంటే సరస్వతి పాత్రను చక్కగా పోషించావని అంటే సంతోషిస్తా' అన్నారు నివేదా థామస్. రానా సమర్పణలో రూపుదిద్దుకున్న '35.. చిన్న కథ కాదు' చిత్రం ఈ నెల ఆరున విడుదలవుతున్న సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇందులో సరస్వతి పాత్రకు, నాకు వయసులో పెద్ద తేడా లేదు. సరస్వతి నాకంటే ఏడాది చిన్నది. తనకు పెళ్లయి పిల్లలు ఉన్నప్పటికీ చైల్డ్ నేచర్ ఉంటుంది. '35 చిన్న కథ కాదు.. కథని దర్శకుడు నందకిశోర్ అద్భుతంగా రాశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించారు. ఆ డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అన్నారామె. 'ఇందులో తిరుపతి స్లాంగ్ కోసం దాదాపు నెల రోజులు వర్క్ షాప్ చేశాం. పతి పదాన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నా' అని చెప్పారు నివేద. గౌతమి కీలక పాత్ర పోషించారనీ, ఆమెతో నటించడం ఇది రెండో సారని నివేద చెప్పారు. కొత్త ప్రాజెక్టులు ఏవీ ఒప్పుకోలేదని, త్వరలోనే చెబుతానని అన్నారు.

ఈ సక్సెస్‌తో ఆ వెలితి తీరింది

'పదిహేను రోజులుగా మా టీమ్‌లో ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రశంసలు వస్తున్నాయి. సినిమా బాగుంటే ప్రేక్షకుల తల మీద పెట్టుకుంటారని మరో సారి నిరూపించినందుకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'అంటే సుందరానికి' రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి ఉండేది. 'సరిపోదా శనివారం'తో అది బ్యాలెన్స్ అయింది. 'నిన్ను కోరి' తర్వాత దానయ్యగారితో రెండో సినిమా. మా మూడో సినిమాపై



అంచనాలు భారీగా ఉంటాయి. దానికి తగ్గ సెటప్ చేద్దాం. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ సెలబ్రేషన్స్ ఈవెంట్ ఉంటుంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'నా మీద నాకున్న నమ్మకం కంటే నా మీద నానికి నమ్మకం ఎక్కువ. ఆయన ఫ్రీడమ్ ఇచ్చారు కనుకే ఇలాంటి మంచి సినిమా వచ్చింది. ఇంత భారీ చిత్రాన్ని నేను హ్యాండిల్ చేయగలనని నమ్మి భారీ బడ్జెట్ పెట్టిన దానయ్యగారికి థాంక్స్. తొలి సినిమాతోనే పెద్ద హిట్ కొట్టిన కల్యాణ్‌కు అభినందనలు' అన్నారు. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లోనే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ అలాగే ఉంది' అన్నారు దానయ్య.

అమ్మ కల నెరవేరింది



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శనివారం కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించారు. తన తల్లి శాలిని, భార్య లక్ష్మీ ప్రణతితో కలసి ఆయన ఉడుపికి వెళ్లారు. 'మా అమ్మ ఎప్పుడూ తన సొంతూరు కుందాపురాతో పాటు ఉడుపి శ్రీకృష్ణుని దర్శనానికి తీసుకెళ్లమని అడుగుతుంది. ఇన్నాళ్లకు అమ్మ కల నెరవేరింది. సెప్టెంబర్ 2న అమ్మ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు నేను ఇచ్చే బహుమతి ఇదే' అని ఎన్టీఆర్ తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి, దర్శకుడు ప్రశాంత్ నీల్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ మఠంలో అందరూ పూజలు నిర్వహించారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

మా జీవితాల్ని మార్చిన సినిమా



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'గబ్బర్‌సింగ్' చిత్రం ఆయన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌కల్యాణ్ బతుకునిచ్చారు. నన్ను నేను నమ్మలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయన పిలిచి 'గబ్బర్‌సింగ్ 'సినిమా ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఈ చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ రాబోయే పాతికేళ్ల తెలుగు చిత్రపరిశ్రమలో నంబర్ వన్‌గా ఉంటారు' అని చెప్పారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అనే వెలితి నా మనసులో ఉండేది. ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్‌తో అది తీరుతోంది. మా జీవితాలను మార్చేసిన సినిమా 'గబ్బర్‌సింగ్" అని హరీశ్‌శంకర్ చెప్పారు.

అన్ని రంగాల్లో ఉన్నదే సినీ పరిశ్రమలోనూ జరుగుతోంది

- లైంగిక వేధింపులపై మోహన్‌లాల్ స్పందన
- నేనెవరికీ వత్తాసు పలకలేదు

'సమాజంలో సినీరంగం కూడా ఒక భాగం. అన్ని రంగాల్లో ఉన్నట్లే సినీ రంగంలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయి. పరిశ్రమలో తలెత్తే ప్రతి సమస్యకు బాధ్యత వహించాల్సిన అవసరం అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్)కు లేదు' అని మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ అన్నారు. 'అమ్మ'కు రాజీనామా చేశాక శనివారం ఆయన తొలిసారి మీడియా ముందుకొచ్చారు. 'హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం, కేరళ ప్రభుత్వం, పోలీసులు నివేదికపై దర్యాప్తు చేస్తున్నందువల్ల నిజం తేలేవరకూ ఓపికపట్టాలి, పరిశ్రమ పేరును చెడగొట్టొద్దు' అని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. 'ఫిల్మ్ ఇండస్ట్రీలోని పవర్ గ్రూప్ గురించి నాకు తెలియదు. ఇలాంటిది ఒకటుందని హేమ కమిటీ చెబితేనే విన్నాను. ఏ పవర్ గ్రూప్‌తోనూ నాకు సంబంధం లేదు. సినీ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు నాపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిందే, ఆ విషయంలో పోలీసులకు సహకరిస్తాం' అని స్పష్టం చేశారు. పరిశ్రమలో ఎన్నో అసోషియేషన్లు ఉండగా, ఏం జరిగినా 'అమ్మ'పైన రుద్దేప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. మహిళలపై వేధింపుల విషయంలో మొత్తం చిత్ర పరిశ్రమ బాధ్యత తీసుకోవాలి కానీ కావాలనే అమ్మను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న మలయాళ చిత్ర పరిశ్రమ కుటుంబం లాంటిది. దయచేసి దాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు. పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరూ సంయమనం పాటించాలి' అని మోహన్‌లాల్ కోరారు. 'అమ్మ' కార్యవర్గం రాజీనామా వైఫల్యం



కాదు, బాధ్యతల నుంచి మేం పారిపోలేదు. మా స్థానంలో కొత్త కార్యవర్గం వచ్చి అమ్మను సమర్థవంతంగా నడుపుతుంది' అని తెలిపారు. బాధ్యతల నుంచి నేనెప్పుడూ పారిపోలేదు, అత్యవసర పనుల వల్ల ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేకపోయాను అని మోహన్‌లాల్ చెప్పారు.

సీక్రెట్ కెమెరాలు పెట్టారు - నటి రాధిక ఆరోపణ

మాలీవుడ్‌లో కేరవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి హీరోయిన్లు దుస్తులు మార్చటాన్ని వీడియో తీసిన ఘటనలు జరిగాయని, అలాంటి వీడియోలను సినీ యూనిట్ సభ్యులు వీక్షించడాన్ని తాను స్వయంగా గమనించానని సీనియర్ సినీనటి రాధిక శరత్‌కుమార్ ఆరోపించారు. కేరవాన్‌లలో కెమెరాలు అమర్చుతున్నారని తెలిసిన తర్వాత తాను హోటల్ గదుల్లో దుస్తులు మార్చుకున్నానని చెప్పారు. ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ విధానమే సక్రమంగా లేదని, మగవారెవరూ హీరోయిన్లకు, నటీమణులకు మద్దతుగా మాట్లాడటం లేదని వాపోయారు. హీరోయిన్ల గది తలుపులు తట్టే పరిస్థితులు అన్ని సినీ విభాగాల్లో ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనే ధైర్యాన్ని మహిళలు మరింత పెంచుకోవాలని ఆమె సూచించారు.

నాకు ఎవరూ ఫొటోలు పంపలేదు

సజీర్ అనే వ్యక్తి నగ్న చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి వాటిని నటి రేవతికి పంపినట్లు మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనపై దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ లైంగిక దాడికి పాల్పడినట్లు సజీర్ అనే వ్యక్తి ఇటీవలే ఆరోపించాడు. ఆ సంఘటన జరిగిన రోజు నటి రేవతి కూడా హోటల్ రూమ్‌లో ఉన్నట్లు రంజిత్ చెప్పినట్లు సజీర్ తెలిపాడు. ఈ ఆరోపణలపై రేవతి స్పందించారు. మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. తనకు ఎవరూ ఎలాంటి ఫొటోలను పంపలేదని స్పష్టం చేశారు. మరోసారి దీని గురించి మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని రేవతి పేర్కొన్నారు.










తప్పు రుజువైతే ఎవరినీ వదిలేది లేదు!

- గుడ్లవల్లేరు ఘటనపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష
- ఆడబిడ్డల భద్రత, వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యం
- సైబర్ నిపుణులతో లోతుగా దర్యాప్తు చేయించాలని ఆదేశం



మచిలీపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతిగృహంలో నేరం జరిగిందా, లేదా అనేది విచారణలో తేలుతుందని, తప్పు జరిగిందని నిర్ధారణ అయితే నిందితులను వదిలిపెట్టే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వసతి గృహంలో రహస్య కెమేరాలు పెట్టారనే అంశంపై జరుగుతున్న విచారణపై అధికారులతో ఆయన శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జేఎన్‌టీయూ వీసీ, సైబర్ క్రైం నిపుణులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వందలాదిమంది విద్యార్థినులకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసు విచారణను త్వరితగతిన, నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన తరువాత జరుగుతున్న విచారణ వివరాలను,సాధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు చెప్పే అంశాలను ఆధారంగా చేసుకుని అన్ని కోణాల్లోనూ విచారణ చేయాలని సూచించారు. ఇప్పటివరకు జరిగిన విచారణలో రహస్య కెమెరాలు దొరకలేదని అధికారులు చెప్పగా, మరింత లోతుగా విచారణ చేయాలని, అనుమానితుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను సైబర్ నిపుణుల ద్వారా పరిశీలన చేయించాలన్నారు. ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో డేటా తొలగించే అవకాశం ఉందని, సాంకేతికంగా అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఆధారంగా చేసుకుని దర్యాప్తును వేగవంతంగా చేయాలని సూచించారు. ఆడబిడ్డల భద్రత, వ్యక్తిగత గోప్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం చంద్రబాబు అధికారులతో అన్నారు. ఇలాంటి సంఘటనలు మరెక్కడా చోటు చేసుకోకుండా డీబగ్గింగ్ డివైస్‌ల ద్వారా సైబర్ నిపుణులతో కళాశాలల్లో తనిఖీలు చేపట్టే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ విషయంలో ఆడపిల్లల మనోభావాలను గౌరవించాలని అధికారులకు సీఎం స్పష్టంచేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎవరి వద్దనైనా ఆధారాలు ఉంటే నేరుగా తనకు పంపాలని సీఎం కోరారు. ఈ ఘటనను ఆధారంగా చేసుకుని కొందరు విద్యార్థినులను మరింతగా భయపెట్టేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ తరహా చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సున్నితమైన అంశంలో తప్పుడు ప్రచారం మరింతగా నష్టం చేస్తుందన్నారు. ఈ ఘటనలో విచారణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని కోరారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు ప్రశాంత వాతావరణంలో చదువును కొనసాగించే పరిస్థితులు కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

రెండ్రోజుల్లో విచారణ పూర్తి: ఎస్పీ గంగాధర్

గుడ్లవల్లేరు, ఆగస్టు 31: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో రహస్య కెమెరాల విషయంలో మంగళవారం నాటికి విచారణ పూర్తి చేస్తామని ఎస్పీ గంగాధర్ తెలిపారు. రహస్య కెమేరాల విషయమై ఎస్పీ స్వయంగా శనివారం కూడా గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లోనే ఉండి అదుపులో ఉన్న విద్యార్థుల నుంచి సమాచారం రాబట్టారు. లాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లను ఐటీ నిపుణులతో తనిఖీ చేయించారు. ఈ క్రమంలో మీడియా ఆయన్ను కలిసి కేసు పురోగతిపై ప్రశ్నించగా దర్యాప్తు కొనసాగుతోందని మంగళవారం నాటికి పూర్తికావచ్చుని చెప్పారు.

మంగళవారం వరకు సెలవు

గత రెండు రోజులుగా జరుగుతున్న ఆందోళనల కారణంగా శనివారం కళాశాలలోకి సిబ్బందిని మినహా ఎవరినీ పోలీసులు అనుమతించలేదు. మంగళవారం వరకూ కళాశాలకు సెలవులు ప్రకటించడంతో హాస్టల్స్‌లోని విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. భారీ వర్షం కారణంగా ఇళ్లకు వెళ్లే విద్యార్థులకు గుడివాడ వరకూ కళాశాల బస్సులను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు విద్యార్థి సంఘ నాయకులు బస్సుకు అడ్డంగా పడుకొని నిరసన తెలపగా పోలీసులు వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో బస్సును గ్రామంలోని మంచినీళ్ల చెరువు వద్ద అడ్డగించి ఇంటర్వ్యూ చేసిన మూడు మీడియా ఛానళ్ల ప్రతినిధులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

వైసీపీ కుట్ర: మంత్రి డోలా

చీమకుర్తి, ఆగస్టు 31: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సంఘటన వెనుక వైసీపీ కుట్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంత్రి శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పేద విద్యార్థుల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. జగన్ అధికారం కోల్పోయాక ప్రజలపై లేనిపోని ప్రేమను ఒలకబోస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు చేయటం, ప్రభుత్వంపై బురద జల్లడం వైసీపీకి దినచర్యగా మారిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం వైఫల్యం, నిర్లక్ష్యవైఖరి వల్లనే రాష్ట్రంలో హాస్టల్స్‌కు ఈ దుస్థితి పట్టిందన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌పై వేటు

తొలగిస్తున్నట్టు ప్రకటించిన మంత్రి లోకేశ్

- ముగ్గురు సభ్యులతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు
- ఉప కులపతి నిర్లక్ష్యంపైనా తీవ్ర విమర్శలు
- హేమచంద్రారెడ్డి శిష్యుడిగా ట్రిపుల్‌ఐటీలోకి



ట్రిపుల్ ఐటీలో తాగునీరు రుచిచూస్తున్న మంత్రి పార్థసారథి

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యంపాలవడంపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నూజివీడు క్యాంపస్ డైరెక్టర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలనే లక్ష్యంతో నూజివీడు క్యాంపస్ పర్యవేక్షణకు త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీలో కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జ్ ఛైర్మన్ కె.రామ్మోహన్‌రావు, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సభ్యులుగా ఉన్నారు. ఏడు అంశాలపై ఈ కమిటీ దృష్టిసారిస్తుంది. ఆహారం నాణ్యత, మరమ్మతులు, వైద్య అవసరాలపై వీలైనంత త్వరగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి కమిటీని ఆదేశించారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితేవెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు.

కమిటీ పర్యవేక్షించే అంశాలు...

- విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొటోకాల్ పాటించడం
- మెస్ పరిశుభ్రత నిర్వహణకు ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొటోకాల్ అమలు
- విద్యార్థుల హాస్టల్‌లో మెరుగైన పారిశుద్ధ్యం, నాణ్యతా ప్రమాణాల అమలుకు చర్యలు
- క్యాంపస్‌లో అవసరమైన మరమ్మతులు చేపట్టడం
- లైగింక వేధింపులపై అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు. ఫిర్యాదులపై సత్వర విచారణ
- డ్రగ్స్, పొగాకు రహిత చర్యలకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన, అమలు
- విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు. ఇందుకోసం కాలేజీ వెల్‌నెస్ కమిటీ ఏర్పాటుచేయడం

వైసీపీ వీసీతో తలనొప్పి

రాష్ట్రంలో ట్రిపుల్ ఐటీలకు నాలుగు క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రతి క్యాంపస్‌కు ఒక్కో డైరెక్టర్ ఉన్నారు. మొత్తం ట్రిపుల్ ఐటీల పర్యవేక్షణను చాన్స్‌లర్, వైస్ చాన్స్‌లర్ చూడాలి. చాన్స్‌లర్ కేసీ రెడ్డి పదవీకాలం ముగియడం, ప్రభుత్వం మారడంతో ఇటీవల బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆ తర్వాత ట్రిపుల్ ఐటీలను పర్యవేక్షించాల్సిన వీసీ ఎం.విజయ్‌కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఉన్న కె.హేమచంద్రారెడ్డి శిష్యుడిగా ఆయనకు పేరుంది. ఆయన చొరవతోనే అనంతపురం జేఎన్‌టీయూలో ప్రొఫెసర్‌గా ఉన్న ఆయన ట్రిపుల్ ఐటీల వీసీగా పదవిలోకి వచ్చారు. ప్రభుత్వం మారిన వెంటనే ఆయన రాజీనామా చేయగా, ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు. అప్పటివరకూ క్యాంపస్‌లను పర్యవేక్షించాల్సిన ఆయన మొత్తం గాలికొదిలేశారు. ట్రిపుల్ ఐటీల ప్రధాన కార్యాలయం నూజివీడులో ఉంటే ఆయన పులివెందుల క్యాంపస్‌లో ఉంటున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చినా నష్టం లేదన్నట్టుగా ఆయన వ్యవహారశైలి ఉంది. ముందు ఆయన్ను తొలగించి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించే వీసీని నియమించాలని ప్రొఫెసర్లు, అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికీ మారని పరిస్థితి!

- విద్యార్థులకు నాసిరకం ఆహారమే
- నాలుగు రోజుల వ్యవధిలో రెండుసార్లు సందర్శించిన మంత్రి కొలుసు
- అధికారులు క్యూ కట్టినా అదే తీరు

నూజివీడు, ఆగస్టు 31: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మెస్ నిర్వహణలో అస్తవ్యస్త విధానాలు, విద్యార్థులకు అందించిన నాసిరకం భోజనం విషయమై మంత్రి కొలుసు పార్థసారథి ట్రిపుల్ ఐటీని ఇప్పటికి నాలుగురోజుల వ్యవధిలో రెండుసార్లు సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితోపాటు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, వైస్ చాన్స్‌లర్, 15వ అదనపు జిల్లా జడ్జి సహా అనేక మంది అధికారులు ట్రిపుల్ ఐటీకి క్యూ కట్టారు. అయినా మెస్‌లలో పరిస్థితులు ఏ మాత్రం మారలేదు. భోజన సదుపాయాల కల్పనలో దిద్దుబాటు చర్యలు కానరాలేదు. అదే నాసిరకపు ఆహార పదార్థాలను శనివారం కూడా విద్యార్థులకు అందించారు. మెస్‌ల నిర్వహణలో కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ వైఫల్యమా? లేక ప్రభుత్వ అధికారులను తోసిరాజని మెస్ నిర్వాహకుల లాబీయింగ్ పని చేస్తోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి పార్థసారథి శనివారం రెండోసారి ట్రిపుల్ ఐటీని సందర్శించారు. మంత్రి వస్తారని తెలిసినా మెస్‌ల తీరు మారలేదు. శనివారం కూడా నాణ్యత కొరవడిన ఆహారాన్నే విద్యార్థులకు అందించారు. మంత్రి ఉదయం 9 గంటల ప్రాంతంలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అంతకుముందు ఆయన వంటశాల, మెస్‌ను సందర్శించి విద్యార్థులకు అందించే తాగునీటిని రుచి చూశారు. అల్పాహారంగా అందించిన బోండాలను విద్యార్థులతో కలిసి తిని నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని ఎలా తింటున్నారన్న మంత్రి ప్రశ్నకు.. "ఏం చేస్తాం సార్ తప్పదు కదా! ఏ గడ్డి పెట్టినా మేం తింటామనే మెస్‌లు, కళాశాల యాజమాన్యం భావిస్తున్నాయి" అని విద్యార్థులు సమాధానమిచ్చారు. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లను తొలగించి కొత్త వారిని నియమించాలని క్యాంపస్ అధికారులను మంత్రి ఆదేశించారు.

అమృతతుల్యం అన్నవరం ప్రసాదం | సత్యదేవుడి ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు



కాకినాడ/అన్నవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి కొలువై ఉన్న దివ్యక్షేత్రం అన్నవరం. కాకినాడ జిల్లాలో కొలువైన ఈ క్షేత్రంలో నిత్యం వ్రతాలు జరుగుతూ ఉంటాయి. ఇక్కడి స్వామి వారికి ఎంత ప్రాసస్త్యం ఉందో, ప్రసాదానికీ అంతే ప్రాచుర్యం ఉంది. అన్నవరం దేవస్థానంలో ప్రసాదం అంటే అమృతతుల్యమే. గోధుమరవ్వతో చేసే ఈ ప్రసాదాన్ని అడవుల్లో దొరికే అడ్డాకుల్లో ఉంచి విక్రయిస్తారు. ఈ ప్రసాదాన్ని తిన్నవారు ఆకు కూడా నాకేయాల్సిందే అంటారు. అంతటి అద్భుత రుచి ఈ ప్రసాదానికి ఉంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చే మల్వరాజ్ గోధుమలతో తయారు చేసే ఈ ప్రసాదానికి మరేదీ సాటి రాదంటే అతిశయోక్తికాదు. పైగా దీని తయారీలో రుచి, శుచికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. ఈ కారణంగానే 2019లో ప్రసాదానికి ఐఎస్ఓ 22000-2005 గుర్తింపు వచ్చింది. తాజాగా భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు లభించింది. ఏటా రూ.రెండు కోట్లకు పైగా ఆదాయం ఈ ప్రసాదం విక్రయాల ద్వారానే దేవస్థానానికి వస్తోంది.



బీఎస్ఎఫ్ స్వాధీనం చేసుకున్న డంప్

మావోయిస్టుల డంప్ స్వాధీనం

సీలేరు, ఆగస్టు 31: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) శనివారం స్వాధీనం చేసుకుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా బెజ్జంగివాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో బీఎస్ఎఫ్ 142 బెటాలియన్ బలగాలు శనివారం గాలింపు చర్యలు చేపట్టాయి. గ్రామం సమీపంలోని ఒక గుహలో మావోయిస్టుల డంప్ ఉన్నట్టు గుర్తించి వెలికితీశాయి. ఈ డంప్‌లో రెండు మందుపాతరలు, 62 జిలెటిన్ స్టిక్స్, బ్యాటరీలు, విద్యుత్ వైర్లు, సోలార్ ప్లేట్లు, మావోయిస్టుల దుస్తులు, విప్లవ సాహిత్యం, కరపత్రాలు లభ్యమయ్యాయని, పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు వీటిని దాచారని ఒడిశా పోలీసులు తెలిపారు. ఈ డంప్‌ను అక్కడే నిర్వీర్యం చేసినట్టు వారు చెప్పారు.

'తూర్పు'లో డ్రగ్స్ కలకలం

- ఘంటావారిగూడెంలో ఎన్‌సీబీ సోదాలు

నల్లజర్ల, ఆగస్టు 31: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటవారిగూడెంలో మాదకద్రవ్యాల తయారీ కలకలం సృష్టించింది. గ్రామంలోని తాతిన బాలకృష్ణ(బాలు)కు చెందిన చక్రధర్ దాల్ అండ్ ఫ్లోర్ మిల్లులో డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు పక్కా సమాచారం రావడంతో శనివారం రాత్రి విశాఖపట్నం, హైదరాబాద్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులు సోదాలు చేపట్టారు. మిల్లులో నిషేధిత అల్ప్రజోలం డ్రగ్ తయారుచేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా మిల్లు యాజమాన్యం సుమారు రూ.70 లక్షలు విలువ చేసే యంత్ర పరికరాలు కొనుగోలు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రఘునందన్ రావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న పండితులు

వన్‌టౌన్, ఆగస్టు 31: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

108 వాహనంలో ప్రసవం



మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ

విజయవాడ రూరల్, ఆగస్టు 31: ఆస్పత్రికి తీసుకెళుతుండగా ఓ గర్భిణి 108లోనే ప్రసవించింది. ఈ ఘటన శని వారం జరిగింది. నున్న గ్రామానికి చెం దిన 108 వాహన సిబ్బందికి గన్నవరం మండలం కట్టుబడిపాలేనికి చెందిన కుమారి ప్రసవ నొప్పులు పడుతున్నట్లు ఫోన్ వచ్చింది. 108 సిబ్బంది ఆమెను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మధ్య లో నొప్పులు అధికమయ్యాయి. పైలెట్ బుచ్చిరాజు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషి యన్ వెంకయ్య ఆమెకు ప్రాథమిక చికిత్స అందిస్తుండగా మగబిడ్డకు జన్మనిచ్చింది. పాయకాపురం ప్రాంతంలో రోడ్లపైకి భారీగా వర్షపు నీరు చేరడంతో అతి కష్టంపై బిడ్డను, తల్లిని పాత ప్రభుత్వా స్పత్రి ప్రసూతి కేంద్రానికి తరలించారు. అత్యవసర సమయంలో తల్లీ, బిడ్డను సురక్షితంగా ఆస్పత్రికి తరలించిన 108 సిబ్బందికి మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ శాంతి కోసం కృషి చేద్దాం

● నిర్మల్ ధ్యాన్ అంతర్జాతీయ నిపుణుడు యోగేష్ అగర్వాల్

వన్‌టౌన్, ఆగస్టు 31: మాతాజీ నిర్మలా దేవి సిద్ధాంతాలను ఆచరిస్తూ ప్రకృతి, పర్యావరణంపై ప్రేమను కనబరుస్తూ ప్రపంచ శాంతి కోసం కృషి చేద్దామని ప్రజలకు నిర్మల్ ధ్యాన్ ప్రోగ్రాం అంతర్జాతీయ నిపుణుడు యోగేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. దేవదాయశాఖ సహకారంతో శనివారం సీవీ రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం, మాతాజీ నిర్మలా దేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో, నిర్మలా ఇంటర్నేషనల్ అకాడమీ(నీలా) పేరుతో సహజయోగ ధ్యానంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాపును ప్రారంభించారు. దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, బ్రజేష్‌చంద్ర పాండే పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి: కాశీనాథ్

కృష్ణలంక: కృష్ణానదికి రిటైనింగ్ వాల్ నిర్మించినా వరద, వర్షపునీరు ఇళ్లల్లోకి చేరుతోందని, కృష్ణలంకలో రణదీవెనగర్, రాణిగారితోటలోని తారకరామానగర్, భూపేష్ గుప్తానగర్‌లలోని ఇళ్లు వరద నీటి కారణంగా మునిగాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు దోనేపూడి కాశీనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలిపారు. శనివారం మునిగిన ఇళ్లను పరిశీలించారు. నగర పాలక సంస్థ అన్ని సహాయక చర్యలను చేపట్టాలని కోరారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY(APCRDA)
Lenin Center, Governerpet, Vijayawada – 520002 (A.P.)

E Procurement Short Tender Notice(2nd call)

NIT No. MAU61-USI0TT(OTH)/22/2024-HB/2nd call, Dt.30.08.2024
Name of Work : APCRDA-" Providing Public Toilets at parking area near Hon'ble Chief Minister residence at Undavalli in Amaravati Capital City" ECV: 13,82,469/-.
The bid can be downloaded on AP e-procurement portal from 01.09.2024 to 09.09.2024 up to 14.00 Hrs. Due date for submission of Bid is 09.09.2024 up to 15.00 Hrs, Technical bid opening 09.09.2024 @16.00Hrs.For further details Please refer to **www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in**
Sd/- Commissioner, APCRDA,Vijayawada.

AMARAVATI DEVELOPMENT CORPORATION VIJAYAWADA
Plot No.15, Sector 4, Road No.4, Ayodhya Nagar, Kedareswarpeta, Vijayawada-520010. CIN: U93000AP2015SGC105535

E-procurement Short Tender Notice no.04/CE/ADC/Engg/2024-25 Dt.30.08.2024

Weed removal in Kondaveeti Vagu from 14.00 km near Neerukonda to 29.50 km near Undavalli pumping station within Capital City Amaravati – Total estimate cost of **Rs.36.00 lakhs.** The bids can be downloaded on "ap-eprocurement" portal from 03.09.2024 to 10.09.2024, 3.00 PM and due date for submission of Bid on 10.09.2024 up to 3.30 PM, bid opening on 10.09.2024 @ 4.00 PM. Please refer to **www.apeprocurement.gov.in** for details. For any further clarifications, contact Sri. K.Basaveswararao, Executive Engineer, ADCL, Vijayawada, Ph.No: 9849906836
Sd/- Chairperson & Managing Director, ADCL, Vijayawada.

తెలంగాణ ప్రభుత్వం
వారసత్వ శాఖ (పూర్వం పురావస్తు & మ్యూజియంల శాఖ)
డైరెక్టర్ కార్యాలయం, గన్‌ఫౌండ్రి, హైదరాబాద్

ఫైల్ నం. S2/1028/2024 **ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతూ ప్రకటన** తేది: 28.08.2024
కన్సల్టెంట్ల జాబితా కల్పన కొరకు మ్యూజియంల స్థాపన/అభివృద్ధికి అనుభవం ఉన్న ఆసక్తి గల ఆర్గనైజేషన్లు/ఏజెన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ కోరడమైనది. పని పేరు: తెలంగాణ రాష్ట్రంలో మ్యూజియంల అభివృద్ధి కొరకు కన్సల్టెన్సీ సేవలు అందించడం కోసం ఆర్గనైజేషన్లు / ఏజెన్సీల జాబితా కల్పన. తెలంగాణ వారసత్వ శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) పేరున డి.డి. రూపంలో వాపసు రాని ఫీజు: రూ. 5,000/- (జిఎస్‌టి కలుపుకుని). EOI ఫారం జారీ తేది: 02.09.2024న సా.05.00 గం.లకు. డాక్యుమెంట్ లభ్యత తేది: 09.09.2024న సా. 05.00 గం.ల. వరకు. EOI దాఖలుకు చివరి తేది: 17.09.2024న సా. 05.00 గం.లకు EOI తెరచు తేది: 18.09.2024న మ.03.00 గం.లకు.
DIPR Ro No.3498-PP/CL/ADVT/1/2024-25, తేది: 31.08.2024 సం/- డైరెక్టర్ తరఫున

भा.क.नि. भारतीय कपास निगम लिमिटेड
భారతీయ ప్రత్తి సంస్థ
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
బ్రాంచి ఆఫీస్: కపాస్ భవన్, 4/2, అశోక్ నగర్, పి.బి.227, గుంటూరు-522 002. (ఎ.పి.)
ఫోన్: 0863-2233472, ఫ్యాక్స్ నెం: 0863-2357472, E-mail: guntur@cotcorp.com
CCI Website: www.cotcorp.org.in, Ministry Website: ministryoftextiles.gov.in

No.:CCI/GNT/Mktg(Transport)/2024-25/ తేది:30.08.2024

టెండరు ప్రకటన

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, గుంటూరు వారు గుంటూరు శాఖ కార్యాలయ అధికార పరిధి క్రింద వివిధ కేంద్రాలు/ప్రాసెసింగ్ పాయింట్ల నుండి సంబంధిత గోదాములు వరకు F.P బేల్స్ రవాణాకు సంబంధించి కాటన్ సీజన్ 2024-25 కోసం ప్రఖ్యాత రవాణాదారుల నుండి సీల్డు టెండర్లను కోరడమైనది. 23.09.2024న ఉ॥10.30 ని॥ల వరకు పని దినాలలో పని వేళల్లో గుంటూరు శాఖ కార్యాలయం నుండి నియమ నిబంధనలతో పాటు నిర్ణీత టెండరు ఫారమ్‌లను పొందగలరు మరియు అదే CCI వెబ్‌సైట్ https://www.cotcorp.org.in మరియు ప్రభుత్వ వెబ్ పోర్టల్ https://www.eprocure.gov.in లో కూడా ఉన్నది. అన్ని విధాలుగా పూర్తి చేసిన సీల్డు టెండరును "జనరల్ మేనేజర్, CCI గుంటూరు" అడ్రసు మీద 23.09.2024న ఉ॥11.00 గం॥ల లోపు గుంటూరు శాఖ కార్యాలయానికి ఇవ్వగలరు. నిర్ణీత సమయంలో స్వీకరించిన సీల్డు టెండర్లు అదే రోజు ఉ॥ 11.30 ని॥లకు హాజరు కావాలనుకునే టెండరుదారుల సమక్షంలో తెరవబడతాయి.

The Cotton Corporation of India Ltd., Guntur invites Sealed Tenders from reputed Transporters for the **Cotton Season 2024-25** in respect of transportation of F.P Bales from various centers / processing points located under Branch Office, Guntur jurisdiction. The prescribed tender forms along with the terms & conditions can be obtained from the Branch Office, Guntur during working hours on any working day up to **10.30 AM on 23.09.2024** and the same is also availabe at CCI's website https://www.cotcorp.org.in and in Government portal https://eprocure.gov.in. The Sealed Tender duly completed in all respects addressed to the General Manager, CCI, Guntur should reach the Branch Office, Guntur on or before **11:00 AM on 23.09.2024.** The sealed tenders received within the stipulated time shall be opened on the same day at **11:30 AM** in the presence of tenders who may wish to remain present.

Sd/- GENERAL MANAGER

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ 56y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT.VRS / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / సొంత ప్రాపర్టీ / ఎలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను.(కుల, అస్తి ప్రసక్తి లేదు) ఫోన్ : 7995376608 AJH-4301

★ కుల పట్టింపు లేదు / చౌదరి / విడో / 43 / 5'6" / ఫెయిర్ / DM కార్డియాలజీ / మంచి ఆస్తి గల వధువుకు 1వ 2వ, వరుడు కావలెను. వాట్సాప్ : 7659957257 AJH-002515

★ రెడ్డి విడో, కుల అస్తి పట్టింపు లేదు / డిగ్రీ, ఎత్తు 5.4 / సొంత బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను 1st/2nd. అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. ఫోన్ : 9032596676 AJH-16383

★ రెండవ పెళ్ళి, విడో / 45y / District Agricultural Officer / మంచి జీతం / సొంత విల్లా / మంచి పొలాలు, ఆస్తులు గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్ : 9573960642 AJH-16383

★ రెడ్డి 2nd విడో (కుల/ఆస్తి) ప్రసక్తి లేదు. 32y / డిగ్రీ / సొంత ఇల్లు / ప్రాపర్టీస్, బిజినెస్ గల వధువుకి 1st/2nd వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్ : 9666327616 AJH-16383

★ బ్రాహ్మణ / 27y/5'3"/ డిగ్రీ ప్రైవేట్ జాబ్ / అందమైన వధువుకి తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-16383

★ కుల పట్టింపు లేదు / రెడ్డి / 26y/5'4" / B.Tech/ మంచి ఆస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. ఫోన్ : 9885463158 AJH-16383

★ కమ్మ 32 yrs, కుల ఆస్తి పట్టింపు లేదు. Divorced 5'5" fair, MBA, Own Textile Complex, రెంట్స్, ఎకరాల భూమి అపార్ట్‌మెంట్ ఉన్న వధువుకి వరుడు కావలెను. అర్జెంట్. ఫోన్ : 9703619149 AJH-16383

★ రెడ్డి విడో / కుల, ఆస్తి, ప్రసక్తి లేదు. 35y / B.Com / Pvt. Job అందమైన వధువుకి వరుడు కావలెను. All Caste Marriages Available. ఫోన్ : 8121347478 AJH-16383

★ రజక / ఏకైక కుమార్తె / B.Tech / C.Govt./Asst. మేనేజర్ / SBI / మంచి జీతం / 5'4" / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618007652 AJH-16384

★ గౌడ / B.Tech / C.Govt. P.O. / SBI / మంచి జీతం / 5'5" / 24 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9550572571 AJH-16384

★ 2వ పెళ్ళి / కుల ప్రసక్తి లేదు / MBA / ఫైనాన్స్ మార్కెటింగ్ / మంచి జీతం / 5'4" ఎత్తు / 35 సం.ల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16384

★ రెడ్డి / ఏకైక కుమార్తె/ B.Tech / Govt. Asst. ఇంజనీర్ / R&B Dept. / మంచి జీతం / 5'5" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8790689274 AJH-16384

★ వడ్డెర / ఏకైక కుమార్తె/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / SBI / మంచి జీతం / 5'4" ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-16384

★ బ్రాహ్మణ / 26/5'4" / 1st మ్యారేజ్ / Qua:10th Class /No Job / 2nd మ్యారేజ్ also OK. పౌరోహితం also OK. వరుడు కావలెను. ఫోన్ : 8978808244 AJH-002593

★ రెడ్డి విడో Govt. 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు : 45, కలర్ : తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 9676896226 AJH-002593

★ చౌదరి : మొదటి సంబంధం, 27 సం॥రాలు, డిగ్రీ, సొంత ఇల్లు, ఫాదర్ వ్యవసాయం. అలాగే రెండవ సంబంధం, 35 సం॥రాలు, (పిల్లలు లేరు) ఉన్న వధువుకు ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ రెడ్డి : 1st మ్యారేజ్, 27 సం॥రాలు, డిగ్రీ, 5.4., సొంత ఇల్లు, పొలం, ఫాదర్ ఎంప్లాయి, బ్రదర్ ఎంప్లాయి, ఒక సిస్టర్ మ్యారీడ్ గా అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ నాయి బ్రాహ్మిన్స్, విశ్వబ్రాహ్మిన్స్ : 1st మ్యారేజ్, 25 To 35 సం॥రాలు, ఆంధ్రా, తెలంగాణాలలోని అమ్మాయిలకు ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ క్రైస్తవ్ : మొదటి సంబంధం, 26 To 35 సం॥రాలు, సొంత ఇల్లు, ఫాదర్ బిజినెస్, బ్రదర్ జాబ్ ఉన్న అమ్మాయిలకు ఆంధ్ర, తెలంగాణాలలో ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ గౌడ్స్ : మొదటి సంబంధం, 25 To 27 సం॥రాలు, డిగ్రీ, సొంత ఇల్లు, అలాగే రెండవ సంబంధం, 34 సం॥రాలు ఉన్న వారికి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ మున్నూరు కాపు (తెలగ కాపు), నాయుడు :1st మ్యారేజ్, 26 సం॥రాలు, సొంత ఇల్లు, బిజినెస్, బ్రదర్ జాబ్ ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ కుల, అస్తి పట్టింపు లేదు / విడో / 58 Y / ప్రభుత్వ డాక్టర్ / అపార్ట్‌మెంట్ / భూములు / మంచి ప్రాపర్టీ, ఎలాంటి బాదరబందీ లేని వధువుకి వరుడు కావలెను. సంప్ర. 98490 47245 AJB-410

★ పద్మశాలి : 1st మ్యారేజ్, డిగ్రీ, 5.3., సొంత ఇల్లు, వ్యవసాయం, బిజినెస్ (చీరలు) ఉన్న అమ్మాయికి, వయస్సు 26 సం॥రాలు ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

★ ML, MD, [illegible] సెల్:98480 45875. AD15547

★ బలిజ : 26 సం॥రాలు, డిగ్రీ, 5.4., ఫాదర్ వ్యవసాయం, బ్రదర్ మ్యారీడ్, సిస్టర్ మ్యారీడ్, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 81211 60480 AJL_195795

వధువు కావలెను



★ శెట్టి బలిజ / రెండవ పెళ్ళి కొరకు వయస్సు 55-50 గల కాంట్రాక్టర్ (ప్రైవేట్) బిజినెస్ గల వరునకు కుల ప్రసక్తి లేని వధువులు కావలెను. అర్జంట్ ఫోన్ : 7661960929 AJH-002515

★ బ్రాహ్మణ /33y/5'7" డిగ్రీ / ప్రైవేట్ జాబ్ / మంచి జీతం మరియు పౌరోహిత్యం, సొంత గుడి గల వరునికి సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువు కావలెను. ఫోన్ : 9502552909, 7989806555 AJH-16383

★ SC మాల / కుల ప్రసక్తి లేదు /B.Tech/Govt. Asst. Exe. ఇంజనీర్ / ఆర్&బి / గెజిటెడ్ ఆఫీసర్ / మంచి జీతం /5'8" ఎత్తు / 30 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16384

★ కమ్మరి / కుల ప్రసక్తి లేదు /C.A./ Govt. Jr. అకౌంటెంట్ / ఆఫీసర్ / ఎలక్ట్రికల్ Dept. / మంచి జీతం /5'10" ఎత్తు / 28 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9550572571 AJH-16384

★ ముదిరాజ్ / కుల ప్రసక్తి లేదు /M.Tech/ Govt. గ్రూప్-II ఆఫీసర్ / MPDO / మంచి జీతం /5'11" ఎత్తు / 28 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9618008271 AJH-16384

★ పద్మశాలి / ప్రభుత్వ ఉద్యోగి / M.Sc, B.Ed. / 47y, 5'5" మొదటి వివాహం / కుల పట్టింపు లేదు / వధువు ప్రభుత్వ ఉద్యోగిని ఐతే ఉండాలి. రెండవ వివాహమైనా ఓకే. పిల్లలు లేని వారై ఉండాలి. డైరెక్ట్‌గా సంప్రదించండి. ఫోన్ : 9949447956 AJH-002593

★ 37 సం.ల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు / కుల ప్రసక్తి లేదు / నో డౌరి. ఫోన్ : 9866724586, 6301943220 AJH-516

కళ్యాణ వేదిక

★ AP&TSలో అన్ని కులాలకు సంబంధించి 1వ / 2వ / లేటు / డైవర్సుడ్ వివాహముల కొరకు వధూవరులు మమ్మలను సంప్రదించగలరు. 9959004400. వెంకటేశ్వర మ్యారేజ్ లైన్స్, కొత్తగూడెం. AJH-4301

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103 / 9494809254 (Whatsapp) AJH-4301

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే / అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 / 8555980066 AJH-4301

★ కాపు / రెడ్డీస్ : డాక్టర్స్ / సాఫ్ట్‌వేర్ / బిజినెస్ / గౌట్ ఎంప్లాయిస్ & హై రిచెస్. 1వ, 2వ లేట్ దేశ / విదేశి పెళ్ళి సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. సంప్ర: 8185043702 AJH-002515

★ గంగపుత్రుల (అగ్నికుల క్షత్రియ, బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, వడ్డీలు, నెయ్యాల, పల్లెకార్లు, వన్నె రెడ్డి) పెళ్లి సంబంధాలకై సంప్రదించండి. వాట్సాప్ నెంబర్ : 9000541008 AJH-002515

★ ఫ్రీ రిజిస్ట్రేషన్ : అన్ని కులాల Govt/SWE/ డాక్టర్స్ / NRI / బిజినెస్ / PVT / 2nd పెళ్ళి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం. ఫోన్ : 9866775306 AJH-002593

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్థులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-002620

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386


ఆదివారం



పౌరాణికం, జానపదం, చరిత్రాత్మకం, సాంఘికం...
ఇలా జానర్ ఏదైనా బాలకృష్ణకు టైలర్‌మేడ్. మంచి పాత్ర పడిందంటే...
అభిమానులకు పండగే. రొమాన్స్ నుంచి రౌద్రం వరకూ ఏ రసాన్నైనా
అలవోకగా అభినయించి, మెప్పించడం... ఆయనకే సాధ్యం.
అందుకే... థియేటర్లే కాదు, పబ్‌లు, పార్టీల్లోనూ... ఇతర నటుల సినిమాల్లో సైతం
'జై బాలయ్య' అనే అరుపే జనంలో జోష్ నింపే తారకమంత్రం.
అయిదు దశాబ్దాల ఆయన నట జీవితాన్ని ప్రేక్షకలోకం వేడుక చేసుకుంటోంది.
తెలుగు చలన చిత్ర పరిశ్రమ నేడు ఘనసత్కారం చేస్తోంది.
ఈ సందర్భంగా యాభయ్యేళ్ల వెండితెర బాలుడు 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

(సీవీఎల్ఎన్ ప్రసాద్)





ఫొటో: అశోకుడు

ఇప్పటికీ బాల కృష్ణుడినే!

హీరోగా మీ తొలి సినిమా 'తాతమ్మ కల' విడుదలయి 50 ఏళ్లు పూర్తయింది. ఆ సినిమాలో తొలి షాట్ మీకు గుర్తుందా?

ఎందుకు గుర్తులేదు... ఇప్పటికీ కళ్ల ముందు కదులుతోంది. అప్పట్లో నాన్నగారి సినిమాల ప్రభావం నాపై చాలా ఉండేది. ఆయన నడిచే తీరు, హావభావాలు నా మనసులో గాఢంగా పడిపోయాయి. 'తాతమ్మ కల' సినిమాలో నా మొదటి షాట్ భానుమతిగారితో! నేను ఆవిడ మనవడిని. నాకు ఆవిడ తన భర్త పేరు పెట్టు కుంటుంది. అందువల్ల నన్ను పేరుతో పిల వదు. నా మొదటి షాట్‌లో- నేను స్కూలు నుంచి ఇంటికి వస్తాను. ఈ లోపులో భానుమతిగారు- "ఆయన ఏరీ?" అని మిగిలిన వారిని అడుగుతారు. నాన్నగారు కెమెరా వెనక ఉన్నారు. "యాక్షన్" అన్నారు. భానుమతిగారు - "ఆయన ఏరీ?" అన్నారు. నేను ఆవిడ దగ్గరకు నాన్నగారిలా- భుజాలు అటూ ఇటూ కదుపుతూ వెళ్లా. నాన్నగారు వెంటనే "కట్" అని అరిచారు. "గాడిదా... రౌడీలా ఆ నడకేంటి? డీసెంట్ ఫెలోలా రా!" అన్నారు. ఒక్క నిమిషం నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. మిమ్మల్నే అనుకరించానంటే అక్కడే కొడతారు. ఆ తర్వాత మామూలుగా నడిచాను. షాట్ ఓకే అయింది. ఇదీ నా తొలిషాట్ అనుభవం.

50 ఏళ్ల నట జీవితం తర్వాత మీలో వచ్చిన మార్పులేమిటి?

మార్పు సహజం. అందరూ అంగీకరించాల్సిందే. నాన్నగారు మాకు చాలా క్రమశిక్షణ నేర్పారు. దానిని ఇప్పటికీ పాటిస్తా. ప్రతి రోజు ఉదయాన్నే మూడున్నరకు లేస్తా. కొన్నిసార్లు రెండున్నరకు కూడా లేస్తూ ఉంటా. లేచి నా ఎక్సర్‌సైజ్‌లు చేసుకుంటా. పూజ చేసుకుంటా. ప్రపంచమంతా లేవకముందే - ఇవన్నీ కానిచ్చి- షూటింగ్ ఉంటే వెళ్లిపోతా. లేకపోతే వేరే పనులలో బిజీ అయిపోతా. ఒక్కోసారి నా దినచర్యను చూసుకుంటే నా చిన్నప్పటి రోజులు గుర్తుకొస్తాయి. మేము పెరిగింది హైదరాబాద్‌లో. నాన్నగారు ఎప్పుడూ షూటింగ్‌లలో ఉండేవారు. ఆయన హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కూడా చుట్టూ జనం ఉండేవారు. లేకపోతే ఆడిటర్స్, ఆర్కిటెక్ట్- ఇలా అందరూ చుట్టుముట్టేవారు. రాత్రి వచ్చారనుకొనేవాళ్లం. మర్నాడు ఉదయం లేచి చూస్తే- మద్రాసు వెళ్లిపోయేవారు. ఒక విధంగా ఆయన మాకు అపరిచితుడే! సినిమాల్లోనే ఆయనను చూసేవాళ్లం.

నిజమైన బాలకృష్ణ ఎవరు అని అడిగితే మీరేం సమాధానం చెబుతారు..?

ప్రపంచానికంతా తెలిసిన బాలకృష్ణే నాకు కూడా తెలుసు. నా పని, నా కుటుంబం, ప్రజాసేవ... ఈ మూడే నాకు తెలుసు. ఆర్టిస్టుగా పనిచేస్తున్నా. ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేస్తున్నా. బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్‌గా ఆసుపత్రిని ముందుకు తీసుకువెళ్తున్నా. ఈ మూడే తప్ప నాకు వేరే వ్యాపకాలు లేవు. నేను పార్టీలకు వెళ్లను. ఎవరినీ కలవను. కలవాలన్నా ఖాళీ దొరకదు. ఇక వేరే విధంగా చెప్పాలంటే నాలో రెండు కోణాలున్నాయి. సరదాగా చూస్తే- ఇప్పటికీ నేను బాలకృష్ణుడినే! మరో కోణంలో నేను ఒక అగ్నిపర్వతాన్ని. ఎప్పుడూ నాలో నేను మథనపడుతూ ఉంటాను. వరమో, శాపమో నాకు తెలియదు కానీ మొదటినుంచి నాకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ.

మీకు ప్రథమ కోపం చాలా ఎక్కువ అనే పేరు ఉంది కదా...

నేను కచ్చితంగా ఉంటా. ఇతరుల నుంచి కచ్చితత్వాన్ని కోరుకుంటా. అది లేకపోతే కోపం వస్తుంది. మీకో ఉదాహరణ చెబుతా. నేను వేస్తున్న ఒక పాత్రలో- గుర్రం మీద స్వారీ చెయ్యాలి. ఆ సమయంలో నా భుజం మీద ఒక తుపాకీ ఉంటుంది. నేను స్వారీ చేసే సమయంలో- ఆ తుపాకీ నిటారుగా ఉండకుండా పడిపోతోంది. ఇలా చాలాసార్లు జరిగింది. పనిచేసేవాళ్లు జాగ్రత్తగా, నైపుణ్యంతో పని చేయాలి కదా. ఇలాంటి సందర్భాలలో నాకు విపరీతమైన కోపం వస్తుంది. ఇంకో విషయం కూడా చెబుతాను. నన్ను కలవటానికి అనేకమంది వస్తూ ఉంటారు. వారిలో ఎవరు నటిస్తున్నారు? ఎవరు నిజమైన వారు? అనే విషయం నాకు తెలిసిపోతూ ఉంటుంది. నేను పొగడ్తలకు దూరంగా ఉంటాను. ఎవరైనా నాతో సంభాషణ మొదలుపెట్టడం కోసం ముందు - "మేము నాన్నగారి ఫ్యాన్స్ అండి" అంటారు. నాకు చిర్రెత్తుకొస్తుంది. "ఎన్టీఆర్ ఫ్యాన్స్ కానివారు ఎవరో చెప్పండి. చెప్పకపోతే దెబ్బలు పడతాయి..." అంటాను. వాళ్లదీ తప్పు కాకపోవచ్చు. కానీ వాళ్లకు సమాధానం ఎలా చెప్పాలి?

ఈ 50 ఏళ్ల నట జీవితంలో మీకు ఆదర్శం ఎవరు?

నాన్నగారు. ఆ తర్వాత నన్ను నేనే ఆదర్శంగా తీసుకుంటా. ఈ విషయంలో ఎవరు ఏమనుకున్నా నాకు పర్వాలేదు. ఇక స్ఫూర్తి అంటారా... నాన్నగారి నుంచి క్రమశిక్షణ, పట్టుదలలను స్ఫూర్తిగా తీసుకుంటా! నాగేశ్వరరావు గారి నుంచి పొగడ్తలకు దూరంగా ఉండటం, భజనపరులను దూరంగా పెట్టడం స్ఫూర్తిగా తీసుకున్నా.

సినీ నిర్మాణంలో కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని మనం సమర్థంగా వాడుకుంటున్నామా?

ఈ మధ్యకాలంలో టెక్నాలజీ, టెక్నిక్- ఇవన్నీ ఊతపదాలయిపోయాయి. అందరూ మాట్లాడేస్తున్నారు. ఇప్పుడు ఉన్నన్ని ఆధునిక టెక్నాలజీలు లేకపోయినా, సౌకర్యాలు లేకపోయినా మన వాళ్లు గొప్ప సినిమాలు తీశారు. నాన్నగారు తీసిన 'సీతారామకళ్యాణం'లోని లైటింగ్, కెమెరా యాంగిల్స్ చూస్తే టెక్నిక్ అంటే ఏమిటో మనకు అర్థమవుతుంది. నా ఉద్దేశంలో సినిమాకు భాష, అభినయం- ఈ రెండూ ప్రధానం. ఆ తర్వాతే టెక్నిక్ వస్తుంది. ఇక టెక్నాలజీ విషయానికి వస్తే మనం దాన్ని సరిగ్గా వాడుకోవటం లేదనుకుంటా! 'భైరవ ద్వీపం' సమయంలో మన దేశంలోకి రెండు గ్రాఫిక్ కంపెనీలు వచ్చాయి. ఒక గ్రాఫిక్ కంపెనీ ఓపెనింగ్‌కు సింగీతం శ్రీనివాసరావుగారిని, నన్ను పిలిచారు. మహాబలిపురం రోడ్డులో ఆ ఓపెనింగ్ జరిగింది. అక్కడికి గ్రాఫిక్స్‌కు సంబంధం లేనివారు చాలామంది వచ్చారు. ఆ సమావేశంలో నన్ను కూడా మాట్లాడమన్నారు. "దీన్ని అంగడిలో వస్తువు చేయకండి. కస్టమైజ్ చేయండి. మా అవసరాలు గుర్తించండి. కార్పొరేట్ స్థాయి అంటే దెబ్బతింటారు" అని చెప్పాను. ఆ తర్వాత అదే జరిగింది. ఇప్పుడు కాలం మారింది. వీధి వీధికి ఒక గ్రాఫిక్ స్టూడియో వచ్చేసింది.



మీ అబ్బాయి మోక్షజ్ఞ సినిమాల్లోకి రాబోతున్నాడు. తనకు మీరు ఇచ్చే సలహాలేమిటి?

వాడు డిగ్రీ చదువుకున్నాడు. న్యూయార్క్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లాడు. సత్యానంద్‌గారి దగ్గర తర్ఫీదు కూడా తీసుకున్నాడు. ఒక్క సినిమా కూడా రాకుండానే స్టార్ అయిపోయాడు. వాడికి నేను మూడు సలహాలిచ్చాను. మొదటిది- "వారసత్వ భారాన్ని మోయొద్దు. 'మనదో గొప్ప ఫ్యామిలీ. దాని పేరు నిలబెట్టాలి' అనుకోవద్దు" అని చెప్పాను. రెండోది- "మమ్మల్ని ఎవరినీ అనుకరించకు" అని చెప్పాను. మూడోది- క్రమశిక్షణతో ఉండమని, ఎక్కువ సినిమాలు చేయమని చెప్పాను. నా ఉద్దేశంలో ఆర్టిస్టు ఒక నిత్యావసర వస్తువులాంటివాడు. ఎప్పుడూ కనబడుతూ ఉండాలి. పరిశ్రమను, ప్రొడ్యూసర్‌ను, పంపిణీదారుణ్ణి, ఎగ్జిబిటర్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి. అప్పుడే ఇండస్ట్రీ బావుంటుంది. ఇండస్ట్రీ బావుంటే ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతుంది. అప్పుడు అందరూ ఆనందంగా ఉంటారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. వాడిపై చాలా అంచనాలు ఉన్నాయి. అందువల్ల వాడి సబ్జెక్ట్ నేనే ఎంపిక చేస్తున్నా. నా కెరీర్ విషయంలో నాన్నగారు ఎప్పుడూ పట్టించుకోలేదు. 'జననీ జన్మభూమి' సినిమా తప్ప వేరే సినిమాలేవీ చూడలేదు కూడా. కానీ నేను అలా కాదు. అమరశిల్పి జక్కన్న చెక్కినట్లు వాడిని చెక్కుతా!




పెద్దపాప అంటే భయం...

నాకు పెద్ద పాప బ్రాహ్మిణి అంటే భయం! తనది పూర్వాషాఢ నక్షత్రం. పోరాడే తత్వం. తనకు ఏదీ తక్కువ లేదు. 'హెరిటేజ్' సంస్థను చూస్తుంది.. సీఎం కోడలు, మినిస్టర్ భార్య, బాలకృష్ణ కూతురు. అయినా ఏదో చేయాలనే తపనతో ఉంటుంది. నా నుంచి వచ్చిన హైపర్‌నెస్ కూడా తనలో ఉంది. ఇక చిన్న పాప తేజస్విని బ్యాలెన్సింగ్ చేస్తుంది. అన్నీ వింటుంది. అన్నీ పడుతుంది. 'అన్‌స్టాపబుల్'కు పనిచేసింది. ఇప్పుడు నా సినిమాకు కూడా పనిచేస్తోంది. మొన్న తనో సబ్జెక్ట్ చెప్పింది. 'నో' చెప్పా. ఒకసారి నేను 'నో' చెబితే మళ్లీ ప్రస్తావించరు.

తను భూదేవి...

నా భార్య వసుంధర నాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ చూసుకుంటుంది. తన పేరులోనే 'భూదేవి' అని ఉంది. ఓర్పు, సహనం చాలా ఎక్కువ. తనపైనే నేను ఎక్కువ ఆధారపడతా. ఇక నాన్నగారి దగ్గర నుంచి ఎలా ఉండాలో నేర్చుకున్నా. ఎలా ఉండకూడదో కూడా నేర్చుకున్నా. ఇక ఒత్తిడి బాగా ఉన్నప్పుడు- పుస్తకాలు చదువుతా. మంచి పాటలు వింటా. నాన్నగారి పాటలు వింటే ఎంత చిరాకైనా పోతుంది.





'అన్‌స్టాప్‌బుల్' వెనక కథ!

నేను అప్పటి తరానికే కాదు, ఇప్పటి తరానికి కూడా కనెక్ట్ అవుతున్నా. అనుబంధాలు అప్పుడూ, ఇప్పుడూ ఒక్కటే! 'అన్‌స్టాపబుల్ షో' పెద్ద సక్సెస్. యూత్ అందరూ చూశారు. ఈ షో పేరు వెనక చిన్న కథ ఉంది. నా పుట్టిన రోజునాడు ముగ్గురు పిల్లలూ మూడు కప్‌లు బహుమతులుగా ఇచ్చారు. పెద్ద పాప బ్రాహ్మిణి ఇచ్చిన కప్పు మీద- 'ఐయామ్ ది ఎల్డెస్ట్- సో ఐ మేక్ ది రూల్స్' అని ఉంది. చిన్నపాప తేజస్విని ఇచ్చిన కప్పు మీద- 'ఐయామ్ ది మిడిల్- ఐ యామ్ రీజన్ టూ హేవ్ ది రూల్స్' అని ఉంది. మోక్షజ్ఞ ఇచ్చిన కప్పు మీద - 'ఐ యామ్ యంగెస్ట్- రూల్స్ డోంట్ ఎఫెక్ట్ మీ' అని ఉంది. ఒక రోజు నాకు పుస్తకాలు ఇవ్వటానికి ఒక రచయిత, ఆయన కుమార్తె వచ్చారు. ఆ పాపను... "ఈ మూడింటితో ఒక పాట రాస్తావా?" అని అడిగా. తను వెంటనే ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మన్ పదాలతో ఒక పాట రాసింది. వినోద్ అనే కీబోర్డు ప్లేయర్‌ను ఆ పాటకు ట్యూన్ చేయమన్నా. ఇంకో స్నేహితుడి పాప మాటల్లో- "బోర్ కొడుతోంది అంకుల్" అంది. తనను వచ్చి పాట పాడమన్నా. పాడేసింది. మూడు రోజుల తర్వాత నేను రికార్డింగ్ స్టూడియోకి వెళ్లి పాట పాడాను. ఆ పాటే 'అన్‌స్టాపబుల్'. ఈ సంగతి అల్లు అరవింద్ గారి దగ్గర ప్రస్తావించినప్పుడు- ఆయన - "మన షోకు ఆ పేరు పెడదాం" అన్నారు. వెంటనే ఇచ్చేశాను. నేను పాడిన ఇంగ్లీషు పాట ఇంకా రిలీజ్ కావాల్సి ఉంది.






చిన్నప్పటి నుంచే ఆసక్తి...

50 ఏళ్ల సినీ ప్రస్థానంలో 109 సినిమాలు మాత్రమే చేశా. దీనికి కారణం- నాన్నగారు 10 ఏళ్ల పాటు మా బ్యానర్‌లో మాత్రమే చేయమన్నారు. ఇక్కడో విషయం చెప్పాలి. నాన్నగారికి పిల్లలు బాగా చదువుకోవాలని ఉండేది. డిగ్రీ అయితే తప్ప హీరోగా చేయటానికి ఒప్పుకోలేదు. నాకు చదువు మీద ఇంట్రెస్ట్ ఉండేది కాదు. 'కెమెరా ముందుకు ఎప్పుడెప్పుడు వస్తానా?' అని ఎదురుచూస్తూ ఉండేవాడిని.

ఎన్టీఆరే తెలీదు...

'దానవీరశూరకర్ణ' సినిమాలో చలపతిరావుగారు నాలుగు వేషాలు వేశారు. నాన్నగారితో ఆయన చాలా సన్నిహితంగా మెలిగేవారు. సత్యన్నారాయణ, చలపతిరావు, రమాప్రభగార్లను నాన్నగారు మాత్రమే ఏకవచనంతో పిలిచేవారు. మూడు వేషాలు అయిపోయిన తర్వాత ఒక రోజు ఆయనను నాన్నగారు ఉదయాన్నే లేపి, వేరే వేషం వేయమన్నారు. చలపతిరావుగారు అలిగారు. "ప్రజలేమైనా పిచ్చోళ్లు అనుకుంటున్నారా? ఇప్పటికే మూడు వేషాలు వేశాను. ఇంకోటి కూడా నేనే వేస్తే - కొందరు 'ఎన్టీఆర్ లోభి' అనుకుంటారు. డబ్బు ఖర్చు పెట్టరనుకుంటారు" అన్నారు. అప్పుడు నాన్నగారు నవ్వి- "కొన్ని కొన్ని పల్లెటూళ్లలో ఎన్టీఆర్ ఎలా ఉంటాడో తెలీదు. నిన్నెవరు గుర్తుపడతారురా గాడిద! పో... మేకప్ వేసుకొని రా!" అన్నారు.



సిద్ధుడి కథ...

'...బ్రహ్మంగారి చరిత్ర' సినిమా క్లైమాక్స్ షూట్ చేస్తున్నాం. అప్పుడు నాన్నగారు పిలిచి- "ఒరేయ్! ఈ సినిమా అంతా ఒక ఎత్తు. ఈ క్లైమాక్స్ ఒక ఎత్తు. నువ్వు దీన్ని పండించగలిగితే సినిమా హిట్ అయినట్లే!" అన్నారు. 'నేను ఈ సీన్ పండిస్తే హిట్ అంటారేమిటి?' అనుకున్నా. నాకు అర్థం కాలేదు. భయపడుతూ చేశా. షూటింగ్ చూడటానికి వచ్చిన వాళ్లందరూ అక్కడ ఉన్నారు. నాన్నగారు సీన్ అయిపోయిన వెంటనే- "నా సినిమా హిట్ రా! సీన్ బాగా పండించావు." అన్నారు. నేను చేసిన వాటిలో అదో గొప్ప పాత్ర.

విందు భోజనంలా...

బాలకృష్ణ సినిమా అంటే విందు భోజనంలా ఉండాలి. అయితే నా కథల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటా. కొందరు వచ్చి - "డేట్స్ ఇవ్వండి.. చాలు" అంటారు. వెంటనే 'గెటౌట్' అంటాను. "నాకు మంచి కథ ఉంటే చెప్పు. నచ్చితే దాన్ని డెవలప్ చేద్దాం. ఎవరెవరు ఉండాలో డిసైడ్ చేద్దాం. అదే నా విధానం" అని చెబుతా. నాకు అందరూ పుస్తకాలు పంపుతూ ఉంటారు. వాటిని చదువుతాను. ప్రస్తుతం 'అసురా' అనే పుస్తకం చదువుతున్నా. చాలా బావుంది. 'దీన్ని ఒక సినిమాగా కుదించాలా లేక వెబ్‌సిరీస్‌గా తీస్తే బావుంటుందా?' అని ఆలోచిస్తున్నా.

రెండు తత్వాలు

నా లగ్నం మిథునం. రాశి ధనస్సు. కాబట్టి నాలో వాయుతత్వం, అగ్నితత్వం కలిసి ఉంటాయి. అందుకే ఎప్పుడూ నేను ఎండలోనే ఉంటాను. షూటింగ్ సమయంలో మేకప్ వేసుకొని బయటకు వస్తే- కారవాన్‌లోకి కూడా వెళ్లను. 'అఖండ' సినిమా షూటింగ్ విపరీతమైన ఎండలో జరిగేది. అందరూ షాట్ అయిన వెంటనే వెళ్లిపోయేవారు. నేను మాత్రం చెప్పులు లేకుండా ఎండలో నిలబడే ఉండేవాడిని. నేను ఎవరినీ సినిమాలు కావాలని అడగను. ఈ మధ్యకాలంలో ఉత్తరాది వారు కూడా కంటెంట్ కోసం మనవైపే చూస్తున్నారు. 'నేలకొండ భగవంత్ కేసరి'కి హిందీ డబ్బింగ్ నేనే చెప్పాను. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది.

నా కోసమే వస్తారు...

ప్రేక్షకులు థియేటర్‌కు నా కోసం వచ్చి సినిమాలు చూస్తారు. కాబట్టి సినిమాలో వారికి కావాల్సినవన్నీ ఉండాలి. అందుకే నా సినిమాల్లో ఎక్కువ పాటలు పెట్టమని చెబుతా. నా సినిమాల్లో ఐదు కాదు... ఏడు పాటలు పెట్టినా ప్రేక్షకులు చూస్తారు. ఇది అహంకారం కాదు. ఆత్మవిశ్వాసం.

అస్సలు ఫాలో కాను...

నేను సోషల్ మీడియాను అస్సలు ఫాలో కాను. వివాదాస్పదమైన కామెంట్స్ చేయను. వివాదాలకు దూరంగా ఉంటా. ఇక నన్ను విమర్శించే వారి విషయం అంటారా.. అది వాళ్ల ఖర్మ.. అంతే!

30 ఏళ్ల ముందే.. గుండెజబ్బుల గుర్తింపు!

లండన్, ఆగస్టు 31: సాధారణంగా రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ స్థాయిని బట్టి గుండెజబ్బు ప్రమాదాన్ని అంచనా వేస్తుంటారు. మరీ ముఖ్యంగా, చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)పై దృష్టి పెడతారు. అయితే, రక్తపరీక్షను కొలెస్ట్రాల్ మోతాదు చూడటానికే పరిమితం చేయటం వల్ల.. గుండె జబ్బు ప్రమాదాన్ని సూచించే ఇతర కారకాల పట్ల నిర్లక్ష్యం వహించినట్లయ్యిందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఎల్‌డీఎల్‌తోపాటు, రక్తంలో ఉండే లిపో ప్రోటీన్ అనే కొవ్వు గురించి, మంట పుట్టించే సీ రియాక్టివ్ ప్రోటీన్ల గురించి తెలుసుకోవటం ద్వారా.. 30 ఏళ్ల వ్యవధిలో వచ్చే గుండెజబ్బులను కూడా ముందుగానే తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టవచ్చని ఈ అధ్యయనం తెలియజేసింది. 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో దీని వివరాలు ప్రచురితమయ్యాయి. అమెరికాలోని సెంటర్ ఫర్ కార్డియో వాస్క్యులార్ డిసీజ్ ప్రివెన్షన్ డైరెక్టర్ డాక్టర్ పాల్ రిడ్కర్ సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన జరిపింది. దీంట్లో భాగంగా 'విమెన్స్ హెల్త్ స్టడీ'లో భాగమైన దాదాపు 30వేల మంది అమెరికా మహిళల ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. 1992-95 మధ్య జరిగిన ఈ స్టడీలో చేరినప్పుడు ఈ మహిళల సగటు వయస్సు 55 ఏళ్లు. ఆ తర్వాత 30 ఏళ్లలో వీరిలో దాదాపు 13% మంది (3,600 మంది) గుండెపోటు/ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారు. స్టడీలో భాగం కావటానికి ముందు మహిళలందరికీ అప్పట్లో రక్త పరీక్ష జరిపారు. ప్రస్తుతం పాల్ రిడ్కర్ బృందం.. ఈ రక్తపరీక్ష ఫలితాలను అధ్యయనం చేసి, గత 30 ఏళ్లలో ఆ మహిళలు ఎదుర్కొన్న గుండెజబ్బులకు, వారి రక్తపరీక్ష ఫలితాలకు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించింది. దీని ప్రకారం.. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ తక్కువగా ఉన్న వారితో పోల్చితే ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ అత్యధికస్థాయిల్లో ఉన్న వారిలో గుండెజబ్బులు వచ్చే ప్రమాదం 36% అధికం. ఇదే విధంగా, లిపో ప్రోటీన్ (ఎల్‌పీ-ఎ) ఎక్కువగా ఉన్న వారిలో ఈ ప్రమాదం 33% ఎక్కువ. సీ రియాక్టివ్ ప్రోటీన్లు (సీఆర్‌పీ) అత్యధికంగా ఉన్న వారిలో గుండె జబ్బుల ప్రమాదం 70% ఎక్కువని వెల్లడైంది. ఇక మీదట రక్తపరీక్షలో ఎల్‌డీఎల్‌తోపాటు, లిపో ప్రోటీన్, సీ రియాక్టివ్ ప్రోటీన్ల మోతాదును కూడా తప్పకుండా పరిశీలించాలని, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందే తెలుసుకోవచ్చని డాక్టర్ పాల్ రిడ్కర్ సూచించారు. శనివారం లండన్‌లో జరిగిన 'యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్-2024'లో ఈ పరిశోధన పత్రాన్ని సమర్పించారు.

లావోస్ నుంచి 47 మందికి విముక్తి

వీయెంతియాన్, ఆగస్టు 31: లావోస్‌లోని సైబర్ స్కామ్ సెంటర్లలో చిక్కుకుపోయిన 47 మంది భారతీయులని రక్షించినట్లు అక్కడి భారత ఎంబసీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. లావోస్‌లోని బొకెవొ ప్రావిన్స్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ స్పెషల్ ఎకనమిక్ జోన్‌లోని సైబర్ స్కామ్ సెంటర్లలో వీరు చిక్కుకున్నారు. ఆ సెంటర్లపై దాడులు జరిపిన లావోస్ అధికారులు 29 మందిని రక్షించి భారత ఎంబసీకి అప్పగించారు. మరో 18 మంది స్వయంగా ఎంబసీకి వచ్చి తమను రక్షించాలని కోరారని భారత ఎంబసీ 'ఎక్స్'లో తెలిపింది. లావోస్‌లోని భారత రాయబారి ప్రశాంత్ అగ్రవాల్ బాధితులతో మాట్లాడి వారు ఎదుర్కొన్న కష్టాలను తెలుసుకొన్నారు. బాధితుల్లో 30 మంది స్వదేశానికి బయలుదేరారు. మిగిలిన 17 మందిని స్వదేశానికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెలలో కూడా భారత ఎంబసీ ఈ సైబర్ స్కామ్ సెంటర్ల నుంచి 13 మందిని స్వదేశానికి చేర్చింది. ఇప్పటి వరకు ఇలా లావోస్‌లో చిక్కుకుపోయిన 635 మంది భారతీయులను భారత ఎంబసీ రక్షించి స్వదేశానికి చేర్చింది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలయింది. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శనివారం దీన్ని దాఖలు చేశారు. తమ పిటిషన్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుందని ఆయన మీడియాకు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకమని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చట్టం చేయాల్సి ఉంటుందని, ఈ విషయంలో సుప్రీంకోర్టుకు అధికారం లేదన్నారు.

సత్వర న్యాయంతోనే మహిళలకు భరోసా

వారిపై జరిగే నేరాలపై విచారణ వేగంగా జరగాలి



సుప్రీంకోర్టును ప్రారంభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్టాంపును ఆవిష్కరిస్తున్న మోదీ, జస్టిస్ చంద్రచూడ్

- ఇందుకు జిల్లా పర్యవేక్షణ కమిటీలు చురుగ్గా పనిచేయాలి: ప్రధాని మోదీ
- జిల్లా న్యాయ వ్యవస్థను 'దిగువ కోర్టులు' అనొద్దు : జస్టిస్ చంద్రచూడ్
- జిల్లా న్యాయ వ్యవస్థపై ఢిల్లీలో సదస్సు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వరమే న్యాయం అందాల్సి ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. అలా అయితేనే భద్రతపై వారికి మరింత భరోసా ఇచ్చినట్టవుతుందని అన్నారు. కోల్‌కతాలో యువ వైద్యురాలిపై హత్యాచారం, మహారాష్ట్రలో ఇద్దరు పాఠశాల విద్యార్థినులపై లైంగికదాడి ఘటనలపై ఆందోళనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం ఢిల్లీలో జరిగిన 'జిల్లా న్యాయ వ్యవస్థపై జాతీయ సదస్సు' ప్రారంభోత్సవంలో మోదీ పాల్గొన్నారు. మహిళలపై జరిగిన నేరాల కేసుల్లో విచారణ వేగవంతానికి జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీలతో కూడిన జిల్లా పర్యవేక్షణ కమిటీలు కీలక పాత్ర పోషించాల్సి ఉందని చెప్పారు. క్రిమినల్ న్యాయ వ్యవస్థలోని పలు అంశాలను సమన్వయ పరచడంలో ఈ కమిటీలకు ప్రధాన పాత్ర ఉందని తెలిపారు. ఈ కమిటీలు మరింత చురుగ్గా పనిచేయాల్సి ఉందని సూచించారు. ఇలాంటి నేరాలను అరికట్టడానికి చట్టాల్లో కఠినమైన నిబంధనలను పొందుపరిచామని, కేసుల సత్వర విచారణకు 2019లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల విధానాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు.

న్యాయవ్యవస్థపై అపనమ్మకం లేదు

రాజ్యాంగం, శాసనాల స్ఫూర్తిని కాపాడడంలో న్యాయవ్యవస్థది ముఖ్యమైన పాత్ర అని ప్రధాని ప్రశంసించారు. అందుకే సుప్రీంకోర్టుపైన, న్యాయవ్యవస్థపైనా దేశ ప్రజలు ఎప్పుడూ అపనమ్మకం చూపలేదని అన్నారు. దేశంలో విధించిన అత్యవసర పరిస్థితిని చీకటి రోజులని అభివర్ణించారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులు కాపాడడంలో న్యాయవ్యవస్థ ప్రముఖంగా వ్యవహరించిందని గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనకు న్యాయ వ్యవస్థే బలమైన స్తంభమని మోదీ అన్నారు. దేశ న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థే పునాది అని అభివర్ణించారు. "న్యాయం కోసం పౌరులు తొలుత కింది కోర్టు తలుపు కొడుతారు. న్యాయ ప్రక్రియకు మొదటి ప్రదేశం, తొలి అడుగు ఇదే" అని అన్నారు. న్యాయ వ్యవస్థ మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్న సూచనలపై మోదీ స్పందిస్తూ న్యాయం అందుబాటులో ఉండే విధంగా గత పదేళ్లలో పలు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు సర్వసిద్ధంగా ఉండే న్యాయ వ్యవస్థ రూపల్పన దిశగా ముందడుగు వేస్తున్నట్టు చెప్పారు. సుప్రీంకోర్టును నెలకొల్పి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్టాంపును, స్మారక నాణేన్ని ఆవిష్కరించారు.

జిల్లా కోర్టులే న్యాయవ్యవస్థకు వెన్నెముక

ఈ సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రసంగిస్తూ జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థను కింది కోర్టులని పిలవడాన్ని మానేయాలని అన్నారు. అవి ఎవరి అధీనంలో పనిచేయడం లేదని, నిజానికి అవి న్యాయ వ్యవస్థకు వెన్నెముక లాంటివని చెప్పారు. చట్టబద్ధ పాలన అమలులో కీలక పాత్ర వాటిదేనని తెలిపారు. అందువల్ల బ్రిటిష్ కాలం నాటి దిగువ కోర్టులు (సబార్డినేట్ జ్యుడీషియరీ) అనే మాటను వాడకూడదని సూచించారు. జడ్జీల ఆరోగ్య పరిస్థితిపైనా చర్చ జరగాలని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. జడ్జీలు వృత్తి నిపుణులే అయినప్పటికీ కేసులు పరంగా, ఇతరత్రా ఒత్తిళ్లకు గురవుతున్నారని, దాంతో వారి మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతోందని అన్నారు. కొంతకాలంగా జిల్లా న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్య పెరుగుతుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేరళలో ఇటీవల జరిగిన న్యాయాధికారుల భర్తీలో 72% మంది మహిళలే ఉన్నారని అన్నారు. గతేడాది రాజస్థాన్‌లో జరిగిన భర్తీలో 58% మంది, ఢిల్లీలో 66% మంది మహిళలు ఉద్యోగాలు పొందారని తెలిపారు.

'వికసిత్ భారత్'కు దక్షిణాదే కీలకం

తమిళనాడు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం: మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 31: వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి చాలా కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దక్షిణాది అభివృద్ధికి.. అందులోనూ తమిళనాడు అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కేటాయింపులు పెంచామని గుర్తు చేశారు. శనివారం ఆయన మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను(మీరట్-లఖ్‌నవూ, మదురై-బెంగళూరు, చెన్నై-నాగర్‌కోయిల్ రూట్ల మధ్య) వర్చువల్‌గా ప్రారంభించారు. వందేభారత్ రైళ్లను అన్ని ప్రాంతాలకు విస్తరించడంతో దేశం 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు వేగంగా అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేలా రైల్వేలో ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చామని, ప్రతీ ఒక్కరికి సౌకర్యవంతమైన రైల్వే ప్రయాణ సేవలను అందించేవరకు ఈ సంస్కరణలు ఆగబోవని మోదీ చెప్పారు.

లోకం తీరు



కేసు నమోదయ్యే వరకు నాకు తెలియదు!

ఆర్జీకర్ ఘటనపై మాజీ ప్రిన్సిపాల్ ఘోష్

కోల్‌కతా, ఆగస్టు 31: కోల్‌కతా ఆర్జీకర్ వైద్య కాలేజీలో పీజీ వైద్యవిద్యార్థిని మృతిచెందిన విషయం ఆ ఘటనపై కేసు నమోదయ్యేంత వరకూ తనకు తెలియదని ఆ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ చెప్పారు. అలాగే తాను ఘటనాస్థలికి వెళ్లేసరికి అప్పటికే అక్కడ పోలీసులు ఉన్నారని పేర్కొన్నారు. ఆగస్టు 9వ తేదీ ఉదయం 10.20 గంటలకు కళాశాల ఆచార్యుడైన సుమిత్ ఆ ఘటన గురించి తనకు చెప్పారన్నారు. ఈ కేసులో సీబీఐ అధికారులు రెండుసార్లు నిర్వహించిన లై డిటెక్టర్ (పాలిగ్రాఫ్) పరీక్షల్లో ఘోష్ ఈ విషయాలను చెప్పారు. సుమిత్ ఘటన గురించి చెప్పగానే తాను వెంటనే బయలుదేరానని, దారిలోనే తాలా పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేశానని.. అప్పటికే ఘటన తాలూకు సమాచారం తమకు తెలుసునని వారు చెప్పారని ఘోష్ పేర్కొన్నారు.

రైతుల నిరసనకు వినేశ్ మద్దతు

- శంభూ సరిహద్దు వద్ద అన్నదాతలకు సంఘీభావం
- 200వ రోజుకు చేరిన ఆందోళన.. పాల్గొన్న రెజ్లర్




న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ హరియాణా-ఢిల్లీ సరిహద్దు శంభూ వద్ద ఆందోళన చేస్తున్న రైతులకు మేటి రెజ్లర్ వినేశ్ ఫొగట్ మద్దతు పలికారు. శనివారం వారి నిరసనలు 200కు రోజుకు చేరిన సందర్భంగా వెళ్లిన వినేశ్.. సంఘీభావం ప్రకటించారు. రైతు కుటుంబంలో పుట్టడం నా అదృష్టం. మీ కోసం ఎవరూ రారు. హక్కుల కోసం మీరే పోరాడాలి. డిమాండ్లు సాధించేదాకా వెనుదిరగొద్దు. నేను మీ బిడ్డను. మీ వెంటే ఉంటా' అని భరోసా ఇచ్చారు. రైతుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్‌లో చేరుతున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. వ్యతిరేకంగా స్పందించలేదు. "ఇక్కడ రాజకీయాల గురించి మాట్లాడితే రైతుల ఆందోళనకు ప్రాధాన్యం తగ్గిపోతుంది. మీ దృష్టి నాపై కాదు. అన్నదాతల ఆందోళనపైకి మళ్లించండి" అని మీడియాను అభ్యర్థించారు. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా వినేశ్ పతకం కోల్పోయారు. రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికారు. అప్పటినుంచి వినేశ్ రాజకీయాల్లోకి వస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఒలింపిక్స్ తర్వాత వినేశ్ ఫొగట్ ఫాలోయింగ్ మరింత పెరిగింది. క్రీడలకు బాగా ప్రాధాన్యమిచ్చే హరియాణాలో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వినేశ్ రాజకీయాల్లోకి వస్తే కీలక పాత్ర పోషిస్తారనే అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఆమె పార్టీలో చేరతారా, లేక స్టార్ క్యాంపెయినర్‌గా ఉపయోగపడతారా అన్న చర్చ జరుగుతోందని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. గతేడాది బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో రెజ్లర్లు నిర్వహించిన నిరసన ప్రదర్శనలకు కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్, ప్రియాంక సంఘీభావం ప్రకటించారు. మద్దతు ధరకు చట్టబద్ధత కోసం రాహుల్ లోక్‌సభలో డిమాండ్ చేశారు. కాగా, హరియాణాలో తమకు సానుకూల పవనాలు ఉన్నాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

హరియాణా ఎన్నికల తేదీల సవరణ

హరియాణా అసెంబ్లీ ఎన్నికల తేదీలను శనివారం ఎన్నికల సంఘం(ఈసీ) సవరించింది. పోలింగ్‌ను అక్టోబరు 1 నుంచి 5వ తేదీకి, ఓట్ల లెక్కింపును అక్టోబరు 4 నుంచి 8వ తేదీకి మార్చింది. అసోజ్ అమావాస్యను పురస్కరించుకొని హరియాణా, రాజస్థాన్‌లోని బిష్ణోయ్ సామాజిక వర్గం వారు తమ గురువైన గురు జంబేశ్వర్ పూజల్లో పాల్గొంటారు. అక్టోబరు 1న ఎన్నికలు నిర్వహిస్తే వారు ఓటు హక్కును కోల్పోతారంటూ వినతులు రావడంతో ఈసీ ఈ మార్పులు చేసింది. కాగా, హరియాణా కారణంగా కశ్మీర్ ఓట్ల లెక్కింపు కూడా అక్టోబరు 8కి మారింది. అక్టోబరు 1న జరగనున్న కశ్మీర్ మూడో దశ పోలింగ్ తేదీలో మార్పుల్లేవు.

వద్దంటే వానలు?




సెప్టెంబరులో దేశంలో వర్షాలపై ఐఎండీ అంచనా మ్యాప్

- సెప్టెంబరు చివరి వరకూ కొనసాగే అవకాశం
- చేతికందే పంటకు అతివృష్టితో చేటు
- పశ్చిమానికి కదులుతున్న రుతుపవనాలు
- అసాధారణ వర్షాలంటున్న శాస్త్రవేత్తలు
- ఆగస్టులో సాధారణం కంటే 16% ఎక్కువ వర్షాలు
- కొండచరియలు విరిగిపడే ముప్పు: ఐఎండీ

న్యూఢిల్లీ, ఆగస్టు 31: దేశంలో అసాధారణ వర్షాలకు వాతావరణ మార్పులే కారణమా? రుతుపవనాలు తిరోగమనం చెందాల్సిన సమయంలో.. పశ్చిమ భారతాన్ని భారీ వర్షాలు.. వరదలు గడగడలాడిస్తుండడానికి కారణమిదేనా? ఈ ప్రశ్నలకు వాతావరణ శాస్త్రవేత్తలు అవుననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారతీయ రుతుపవనాలు గణనీయ మార్పులకు లోనవుతున్నట్లు చెబుతున్నారు. గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రల్లో అసాధారణంగా కురుస్తున్న వర్షాలు.. సెప్టెంబరులో కూడా సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతుందనే అంచనాలకు కారణాలను విశ్లేషిస్తున్నారు. పశ్చిమ రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నా.. ఇది రుతుపవనాల దిశాత్మక మార్పునకు సంకేతమని హెచ్చరిస్తున్నారు. గుజరాత్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడం.. రాజస్థాన్‌లో కూడా భారీ వర్షాలతో ఇలాంటి పరిస్థితే నెలకొనడాన్ని బట్టి.. రుతుపవనాల తీరు మారుతోందనే ఆందోళనలు పెరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం వాయవ్య దిశగా కదులుతుండడంతో బిహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో భారీ వర్షపాతం నమోదైంది. పొడి రాష్ట్రాల్లో కూడా సాధారణం కంటే అధిక వర్షపాతమైనట్లు పేర్కొంటున్నారు. "ఈ పరిస్థితులకు వాతావరణ మార్పులే కారణం. వివిధ రాష్ట్రాల్లో అసాధారణంగా నమోదవుతున్న వర్షపాతాలు వాతావరణ మార్పులను స్పష్టంగా తెలియజేస్తున్నాయి" అనిస్కైమెట్ ఉపాధ్యక్షుడు మహేశ్ పలావత్ వ్యాఖ్యానించారు. పశ్చిమ భారతంలో భారీ వర్షాలు అనేది నాలుగైదేళ్లగా గమనించిన మార్పులో భాగమని, ఇది వాతావరణ మార్పులు రుతుపవనాల కదలికలపై ప్రభావం చూపుతున్నాయనడానికి సంకేతంగా భావించవచ్చని వివరించారు. ఐఐటీ-రూర్కీకి చెందిన జల వనరుల అభివృద్ధి, నిర్వహణ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాసియా పిళ్లై.ఎస్.విశ్వనాథన్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ఈ ఏడాది బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనాలు అసాధారణంగా పశ్చిమ భారతదేశాన్ని తాకినట్లు గుర్తుచేస్తున్నారు. కాగా.. కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, వాటర్(సీఈఈడబ్ల్యూ) అధ్యయనం కూడా.. నైరుతి రుతుపవనాల్లో వర్షపాతంలో 10% కంటే ఎక్కువ పెరుగుదల ఉన్నట్లు పేర్కొంటోంది. అయితే.. ఈ పెరుగుదల సీజన్ మొత్తం అంతటా సమానంగా పంపిణీ కావడం లేదని వివరిస్తోంది. చాలా ప్రాంతాల్లో రుతుపవనాల తిరోగమనంలో చాలా ఆలస్యం నెలకొంటోందని చెబుతోంది.

ఆగస్టులో 16% ఎక్కువ

దేశంలో ఆగస్టులో సాధారణం కంటే 16% అధిక వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. వాయవ్య భారతంలో 253.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని.. 2001 నుంచి ఇదే అత్యధికమని వివరించింది. వర్చువల్‌గా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఈ వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఆగస్టులో సాధారణ వర్షపాతం 248.1 మిల్లీమీటర్లు కాగా.. ఈసారి 287.1 మిల్లీమీటర్ల మేర నమోదైనట్లు ఆయన వివరించారు. "జూన్ 1న దేశంలో రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి 749 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దేశ సాధారణ వర్షపాతం 701 మిల్లీమీటర్లే. హిమాలయాలకు దిగువనున్న అనేక జిల్లాలతో పాటు.. ఈశాన్య రాష్ట్రాల్లో అల్పపీడన ప్రభావం పడడంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులోనే ఆరు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. వాటిలో రెండే రుతుపవనాల అల్పపీడనాలు" అని తెలిపారు.



శ్రీశైలం జలాశయం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న కృష్ణమ్మ

సెప్టెంబరులోనూ ఎక్కువే..!

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలలో కూడా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ తెలిపారు. వాయవ్య భారతంలో ఎక్కువ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. బిహార్, ఈశాన్య ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్లు వెల్లడించారు. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 167.9 మిల్లీమీటర్లుగా ఉంటుందని, ఈ సారి మాత్రం 109 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. "హిమాలయ రాష్ట్రాలు-- ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌తోపాటు.. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఇది వరదలకు దారితీయవచ్చు. హిమాలయ రాష్ట్రాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదాలున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన హెచ్చరించారు. సెప్టెంబరులో దక్షిణాదిలో తమిళనాడు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో సాధారణంకంటే తక్కువ వర్షపాతం నమోదు కానున్నట్లు తెలిపారు. కాగా.. ఆగస్టులో తీవ్ర వర్షాభావం నెలకొన్న ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సెప్టెంబరు నెలలో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ బులెటిన్ తెలిపింది. శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా వరకు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానున్నట్లు వెల్లడించింది. అయితే దక్షిణ కోస్తాలోని మిగిలిన జిల్లాలు, రాయలసీమలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనావేసింది.

జలాశయాలకు మరింత వరద

- శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీలు ఫుల్.. జల వనరుల శాఖ అప్రమత్తం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ నుంచి వస్తున్న వరద జలాలతో శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీలు పూర్తిగా నిండిపోయాయి. మరికొన్ని దాదాపు గరిష్ఠ నీటిమట్టాలకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన ఆల్మట్టి నుంచి వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) హెచ్చరించింది. కాగా, జలాశయాల్లోకి భారీగా వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో జల వనరుల శాఖను సీఎం చంద్రబాబు అప్రమత్తం చేశారు. ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం. వెంకటేశ్వరరావుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

- ఆల్మట్టిలో గరిష్ఠ నీటి మట్టం 129.72 టీఎంసీలకుగాను.. 122.27 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 1,78,674 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. 1,76,618 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.
- జూరాల గరిష్ఠ సామర్థ్యం 9.66 టీఎంసీలకుగాను 8.01 టీఎంసీల నిల్వ ఉంది. 3,21,026 క్యూసెక్కుల వరద వస్తుంటే.. 3,21,026 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి వదులుతున్నారు.
- శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటినిల్వ 215.81 టీఎంసీలకుగాను పూర్తిగా నిండిపోయింది. ఈ జలాశయంలోకి 4,10,581 క్యూసెక్కుల వరద వస్తుండగా.. నాగార్జున సాగర్‌కు 3,46,290 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.
- నాగార్జునసాగర్ గరిష్ఠ నీటి నిల్వ 312.05 టీఎంసీలకుగాను 308.76 టీఎంసీల నిల్వ ఉంది. 3,61,327 క్యూసెక్కుల మేర వస్తున్న వరదను పులిచింతలకు వదిలేస్తున్నారు.
- పులిచింతల గరిష్ఠ సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను 38.81 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 2,79,349 క్యూసెక్కుల వరద వస్తుండగా 3,10,395 క్యూసెక్కుల వరదను ప్రకాశం బ్యారేజీకి వదులుతున్నారు.
- ప్రకాశం బ్యారేజీ గరిష్ఠ సామర్థ్యం 3.07 టీఎంసీల మేరకు నిండిపోయాయి. ఈ బ్యారేజీలోకి 3,48,168 క్యూసుక్కులు వస్తుండగా.. 3,48,668 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

- అర్ధరాత్రి తర్వాత కళింగపట్నం వద్ద తీరందాటే అవకాశం
- నేడు కోస్తాలోని పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య వాయవ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడి శనివారం ఉదయానికి వాయుగుండంగా మారింది. గంటకు 6నుంచి 8కిలోమీటర్ల వేగంతో కదులుతూ ఉత్తరాంధ్ర తీరం దిశగా పయనిస్తోంది. సాయంత్రానికి విశాఖపట్నానికి తూర్పు ఈశాన్యంగా 90 కి.మీ., కళింగపట్నానికి 30 కి.మీ. దక్షిణ నైరుతిగా కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్యంగా పయనించి శనివారం అర్ధరాత్రి తర్వాత విశాఖపట్నం- గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నానికి చేరువగా తీరం దాటుతుందని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఆదివారం ఉదయం వరకు కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలో కుంభవృష్టిగా, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో భారీనుంచి అతిభారీగా, కోస్తాలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున కోస్తాలో అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. ఆదివారం ఉదయం నుంచి కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని, ఎన్టీఆర్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, మిగిలిన జిల్లాలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

ఎస్ఆర్ఎం వర్సిటీలో 279.5 మి.మీ. వర్షం

శనివారం ఉదయం 8నుంచి రాత్రి 9గంటల వరకు పలుచోట్ల భారీగా నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. మంగళగిరిలోని ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రాంతంలో అత్యధికంగా 279.5 మి.మీ.వర్షపాతం నమోదైంది. మైలవరం మండలం చందరాలలో 253.5, తుళ్లూరు మండలం ఐనవోలులో 225, తెనాలి మార్కెట్ యార్డులో 179, జగ్గయ్యపేటలో 203.5, వత్సవాయి మండలం మంగోలులో 198, నూజివీడులో 150.75, పొన్నూరులో 131, నందిగామలో 148.7 మి.మీ. వర్షపాతం నమోదైంది.

93% పెన్షన్లు పంపిణీ

నేడు సెలవు కావడంతో ఓ రోజు ముందే

- మొత్తం 60 లక్షల పింఛన్ల అందజేత

అమరావతి/కర్నూలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందే ప్రారంభమైన సెప్టెంబరు నెల సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మరోసారి విజయవంతం చేశారు. శనివారం ఉదయాన్నే సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు అందజేశారు. రాత్రి 10 గంటల లోపు మొత్తం 60.33 లక్షల మందికి పంపిణీ చేశారు. సుమారు 93.37 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 97.13 శాతం, అత్యల్పంగా గుంటూరు జిల్లాలో 82.11శాతం మందికి పంపిణీ చేశారు. భారీ వర్షాల కారణంగా కొన్ని జిల్లాల్లో పంపిణీ ప్రక్రియకు ఇబ్బందులు కలిగాయి. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు పెన్షన్ పంపిణీ చేపట్టి విజయవంతం చేశారు. మిగిలిన లబ్ధిదారులకు సోమవారం అందజేయనున్నారు.

చంద్రబాబు పర్యటన రద్దు

భారీవర్షాల కారణంగా శనివారం కర్నూలు జిల్లాలో జరగాల్సిన సీఎం చంద్రబాబు పర్యటన రద్దయింది. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేలా సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో జరిగే గ్రామసభలో ఆయన పాల్గొనాల్సి ఉంది. అయితే వర్షాలు కురుస్తుండడంతో పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలానికి షెడ్యూలు మార్చారు. శుక్రవారం రాత్రి వర్షంలోనే కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ బింధుమాదవ్, ఎమ్మెల్యే గౌరు చరిత తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వర్షం తగ్గకపోవడం, రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో చంద్రబాబు పర్యటన రద్దు అయినట్లు కలెక్టరు వెల్లడించారు. సీఎం పర్యటనలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన సెర్ప్ సీఈవో వీరపాండియన్‌తో పాటు కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత షెడ్యూలు ప్రకారం హాజరై లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.



మన్యం జిల్లా వట్టిగెడ్డ వాగు దాటి పుల్లేరుగుడ్డివలసకు వెళ్తున్న జీగిరాం వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్బారావు

కొండలెక్కి.. ఏరుదాటి..!

- 'మన్యం'లో పింఛన్లు పంపిణీ చేసిన సిబ్బంది

సాలూరు రూరల్, విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 31: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో కిలోమీటర్ల మేర నడిచి.. కొండలెక్కి.. ఏరుదాటి వెళ్లి మరీ పింఛన్ల సొమ్ము అందజేశారు సచివాలయ సిబ్బంది. మండలంలోని ఏవోబీ పరిధి గిరి శిఖర కొదమ పంచాయతీలో చింతామల, లొద్ద, బందపాయి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి ఎర్రానాయుడు 7కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి.. చేరుకున్నారు. అక్కడున్న 97మంది పింఛన్‌దారులకు పింఛను నగదు అందించారు. నెలిపర్తి పంచాయతీ పుల్లేరుగుడ్డివలసకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బిడ్డిక సుబ్బారావు వట్టిగెడ్డ దాటి 2కి.మీ. నడిచివెళ్లి 20మందికి పింఛన్లు అందించారు. కాగా, విజయనగరం జిల్లా వేపాడ మండలం జాకేరు సచివాలయానికి చెందిన వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ 20కిలోమీటర్లు నడిచివెళ్లి 70మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.. కొండపై ఉన్న మారిక గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రేమ్‌కుమార్ నడుచుకుంటూ ఆ గ్రామానికి చేరుకుని పింఛన్లు పంపిణీ చేశారు. ప్రేమ్‌కుమార్‌ను కలెక్టర్ అంబేడ్కర్ అభినందించారు.

జగన్ నివాసానికి నోటీసులు అవాస్తవం

▸ హైడ్రాకు ఆ అధికారం లేదు: రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివాసానికి హైడ్రా నోటీసులు జారీ చేసినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తాము ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని స్పష్టం చేశారు. జగన్ నివాసం బఫర్ జోన్‌లో ఉండటంతో హైడ్రా నోటీసులు జారీ చేసిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై రంగనాథ్ స్పందించారు. జీవో 99 ప్రకారం నోటీసులు జారీ చేసే అధికారం హైడ్రాకు లేదన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో ఉన్న న్యాయపరమైన వివాదాల్లేని నిర్మాణాలను నేరుగా కూల్చివేస్తామన్నారు.

వైఎస్ పేరు తొలగింపు ప్రతీకార చర్యే

▸ నాడు జగన్ చేసిన తప్పే.. చంద్రబాబు చేస్తున్నారు: షర్మిల

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 'వైద్య విద్యా సంస్థలకు ఎన్టీఆర్ పేరు తొలగించి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆనాడు పెద్ద తప్పు చేస్తే.. ఇప్పుడు అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నడుస్తూ మరింత పెద్ద తప్పు చేస్తున్నారు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'వైఎస్ పేరు తొలగింపును ప్రతీకార చర్యగా కాంగ్రెస్ భావిస్తోంది. వైఎస్ ఏదో ఒక పార్టీకి సొంతం కాదు. వైఎస్ తెలుగువారి గుండెల్లో ఉన్న ఆస్తి. వైసీపీలో వైఎస్ లేదు. అది ఎప్పటికైనా వైవీ, సజ్జల, సాయిరెడ్డి పార్టీయే' అని షర్మిల విమర్శించారు.

అధైర్యపడొద్దు.. అందరికీ అండగా ఉంటా

▸ పరామర్శలతో మాజీ సీఎం జగన్

కడప/పులివెందుల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'ఎవరూ అధైర్యపడవద్దు, అందరికీ అండగా ఉంటా'నని పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం వైఎస్ జగన్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సోమవారం వైఎస్ వర్ధంతిలో పాల్గొనేందుకు ఆయన శనివారం కడ బెంగళూరు నుంచి విమానంలో కడప జిల్లాకు వచ్చారు. అక్కడి నుంచి వల్లూరు మండలం మీదుగా పెండ్లిమర్రి మండలం మాచునూరుకు వెళ్లారు. వల్లూరు మండలంలో ఎక్కడా కారు దిగలేదు. రహదారిపై ఉన్న జనాన్ని అండగా ఉంటా, ధైర్యంగా ఉండండని భరోసా ఇచ్చారు. రాత్రికి పులివెందుల బాకరాపురంలోని సొంత ఇంటికి చేరుకున్నారు. జగన్‌వెంట ఎంపీ అవినాశ్‌రెడ్డి ఉన్నారు. జగన్ 2వ తేదీన ఇడుపులపాయలో తండ్రికి నివాళి అర్పించనున్నారని సమాచారం. కాగా, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం ఇడుపులపాయకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎస్ఎన్ రాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.. 2వ తేదీన వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని తండ్రి వైఎస్ సమాధి వద్ద నివాళులర్పించనున్నారని తెలిపారు.

తెరపైకి మాజీ డీజీపీ పేరు!

(మొదటి పేజీ తరువాయి)

ఆమె తండ్రి నరేంద్రకుమార్ జెత్వానీ, తల్లి ఆశా జెత్వానీలను స్రవంతిరాయ్ విచారించారు. వారికి కొంతదూరంగా న్యాయవాదులు ఉన్నారు. కాదంబరిపై నమోదు చేసిన కేసు డైరీని దగ్గర పెట్టుకుని విచారించారు. కాదంబరి శుక్రవారం వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ వాంగ్మూలాన్ని స్రవంతిరాయ్ శనివారం మరోసారి నిర్ధారించుకున్నారు. ఆమె ఇచ్చిన వాంగ్మూలాన్ని చదివి వినిపించారు. వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. తాను చెప్పిన వాంగ్మూలమంతా సరైనదేనని కాదంబరితో సంతకం చేయించుకున్నారు. ఆ తర్వాత నరేంద్రకుమార్ జెత్వానీ, ఆశా జెత్వానీల వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఇద్దరి వాంగ్మూలాన్ని రికార్డు చేయలేదు. కాదంబరిపై నమోదు చేసిన కేసులో పోలీసులు 200 వరకు డాక్యుమెంట్లను జత చేశారు. వాటిలో ఒక్కోదాన్ని విచారణాధికారి ఆమెకు చూపించారు. ఆ డాక్యుమెంట్‌కు సంబంధించి ముందు, వెనుక జరిగిన వివరాలను కాదంబరి నుంచి సేకరించారు. ప్రతి విషయాన్ని ఆమె కూలంకుషంగా విచారణాధికారికి వివరించారు. అనంతరం విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును కలిశారు. ఈ కేసులో పోలీసు అధికారులు చేసిన వ్యవహారాలకు సంబంధించి మరికొన్ని పేర్లు వినిపిస్తున్నాయి. ఓ మాజీ డీజీపీ పేరు ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. పోలీసు కమిషనరేట్‌లో కొద్దిరోజుల క్రితం వరకు పని చేసి ఏలూరు రేంజ్‌కు సరెండర్ అయిన మరో ఇన్‌స్పెక్టర్ పేరు ఈ కేసులో వినిపిస్తోంది. కాదంబరి జెత్వానీ ఇచ్చిన వాంగ్మూలాన్ని పోలీసులు ఫిర్యాదుగా స్వీకరించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

సీపీకి అన్నీ వివరించా: కాదంబరి

అన్ని విషయాలను విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు వివరించానని ముంబై నటి కాదంబరి జెత్వానీ చెప్పారు. సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత కొండంత ధైర్యాన్ని ఇచ్చారన్నారు. రెండోసారి శనివారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇంత జరుగుతున్నా ఇంకా కొన్ని కుక్కలు మొరుగుతున్నాయి. నేను హనీట్రాప్ చేసి మోసం చేశానని ఆరోపణలు చేస్తున్నారు. వారికి అసలు హనీట్రాప్ అంటే ఏమిటో తెలుసా? నేను, మాలవ్‌దాని అనే వ్యక్తి వివాహం చేసుకోవాలనుకున్నాం. తర్వాత రద్దు చేసుకున్నాను. నేను మాలవ్‌దానిపై ఎలాంటి కేసు పెట్టలేదు. ఆయన నాపై ఏ కేసూ పెట్టలేదు. ప్రస్తుతం జరుగుతున్న ఎపిసోడ్‌లోకి మాలవ్‌దాని విషయాన్ని లాగుతున్నాయి. దానికి, ఈ కేసుకు ఏ సంబంధం ఉంది? ఇప్పుడు జరుగుతున్న కేసు డబ్బులకు సంబంధించినది. ఇద్దరికి నేను భూమి అమ్మాలనుకున్నానని ఆరోపించి కేసులో చేర్చారు. ఇప్పుడు ఆ ఇద్దరూ విద్యాసాగర్‌పై కేసు పెట్టారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, పోలీసు కమిషనర్ కాంతిరాణా కనుసన్నల్లో నాపై కేసు నమోదు చేసి వేధించారు. విశాల్‌గున్నీ ముంబైలో నేను ఉంటున్న అపార్ట్‌మెంట్ వివరాలను స్వయంగా సేకరించారు. 10-15 మంది పోలీసులు లగ్జరీ కారుల్లో వచ్చి ముంబై నుంచి నన్ను, నా కుటుంబ సభ్యులను అరెస్టు చేసి తీసుకొచ్చారు' అని కాదంబరి చెప్పారు.

ఆమె ఎవరో నాకు తెలియదు

తమకు కాదంబరి జెత్వానీతో ఎలాంటి సంబంధం లేదని, ఆమెతో ఎలాంటి భూ క్రయవిక్రయాలు జరగలేదని మొవ్వ మండలం కోసూరుకు చెందిన చిందా వీరవెంకట నాగేశ్వరరావు తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లతో తన భూమిని వీరవెంకట నాగేశ్వరరాజుకు విక్రయించడానికి కాదంబరి ప్రయత్నాలు చేసిందని విద్యాసాగర్ ఫిర్యాదు చేసినట్టు పోలీసులు రికార్డుల్లో రాసిన విషయం తెలిసిందే. దీనిపై వీర వెంకట నాగేశ్వరరాజు కూచిపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను తిరుపతి దర్శనం సిఫార్సు లేఖ కోసం ఆధార్ కార్డుల ఫొటో స్టాట్ కాపీలను గొరిపర్తి శ్రీనివాసరావుకు ఇచ్చామని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యాసాగర్ వాటితో తనతో పాటు బోరు కాటి భరత్‌కుమార్ పేరుపై తప్పుడు డాక్యుమెంట్లు రూపొందించారని ఫిర్యాదు చేశారు. కాదంబరి జెత్వానీ నుంచి పొలం కొనుగోలుకు రూ.5 లక్షలు అడ్వాన్స్ ఇచ్చామని ఇబ్రహీంపట్నం పోలీసులు ఫోన్ చేస్తేనే విషయం తెలిసిందని వివరించారు. వాస్తవానికి ఆమె ఎవరో తనకు తెలియదని స్పష్టం చేశారు.

కోర్టు ధిక్కరణ కేసులో అధికారులకు షాక్

▸ గిరిజన సంక్షేమశాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్‌కు 2 నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా

▸ ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండేకు రూ.2వేల జరిమానా

▸ సర్వీసు ఉన్నా ఈఈకి పదోన్నతి కల్పించలేదని అభియోగం

▸ తీర్పు అమలు రెండు వారాలు నిలుపుదల



అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కోర్టుధిక్కరణ కేసులో ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) ఎస్.శ్రీనివాస్‌కు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఓ ఉద్యోగి పదోన్నతి వ్యవహారంలో అప్పటి గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేకు రూ.2వేల జరిమానా విధించింది. ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్‌కు రెండునెలల సాధారణ జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఇరువురు అధికారులూ రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని ఆదేశించారు. అయితే, ఈ తీర్పు వెల్లడించిన వెంటనే కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ శ్రీనివాస్ ధర్మాసనం ముందు వేర్వేరుగా కోర్టుధిక్కరణ అప్పీళ్లు వేశారు. వీటి పై విచారణ జరిపిన జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం సింగిల్ జడ్జి తీర్పు అమలును రెండువారాలపాటు నిలుపుదల చేసింది. వివరాలివీ.. తనకు తగినంత సర్వీసు ఉన్నప్పటికీ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ గిరిజన సంక్షేమశాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి.వసంత 2021లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు.. ఉద్యోగుల పదోన్నతి కల్పించే విషయంలో సీనియార్టీ జాబితాను 4వారాల్లో ఖరారు చేయాలని అధికారులను ఆదేశిస్తూ 2022లో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయకపోవడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వసంత 2023లో కోర్టుధిక్కరణ పిటిషన్ వేశారు. గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) ఎస్.శ్రీనివాస్‌లను ప్రతివాదులుగా చేర్చారు. పిటిషనర్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. ఉత్తర్వుల అమలు కోసం అధికారులకు న్యాయస్థానం పలుసార్లు గడువిచ్చినా నిర్లక్ష్యం చేశారన్నారు. అధికారుల చర్య కోర్టుధిక్కరణ కిందికి వస్తుందన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి అధికారుల వైఖరి కోర్టు ఉత్తర్వుల పట్ల అవిధేయత ప్రకటించడమేనన్నారు. ఉత్తర్వుల అమలును ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని అభిప్రాయపడుతూ అప్పటి గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేకు రూ.2వేలు జరిమానా, ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్‌కు రెండునెలల సాధారణ జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ ఆగస్టు 9న తీర్పు ఇచ్చారు. ఉత్తర్వులు వెలువరించిన అనంతరం.. పిటిషనర్‌కు పదోన్నతి కల్పించే విషయంలో ఇచ్చిన తీర్పు అమలుకు మరికొంత సమయం ఇవ్వాలని ఇరువురు అధికారులు న్యాయమూర్తిని అభ్యర్థించారు. దీంతో తీర్పు అమలును మూడువారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి విచారణను ఆగస్టు 30కి వాయిదా వేశారు. ధిక్కరణ పిటిషన్ శుక్రవారం మరోసారి విచారణకు వచ్చింది. ఉత్తర్వుల అమలుకు అధికారులు మరోసారి సమయం కోరడంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టుధిక్కరణ పిటిషన్‌లో ఇచ్చిన తీర్పు అమలు కోసం తక్షణం రిజిస్ట్రార్ ముందు లొంగిపోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో సింగిల్ జడ్జి ఆగస్టు 9న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అధికారులిరువురూ వెనువెంటనే ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును రెండువారాలు నిలుపుదల చేసింది.



దువ్వాడ శ్రీను



దివ్వెల మాధురి

దువ్వాడ డ్రామా

మాధురి ఆత్మహత్యాయత్నం ఉత్తిదే

ఆ రోజు జరిగింది కారు ప్రమాదమే

ఎమ్మెల్సీ డైరెక్షన్‌లో ఆమె నాటకం

శ్రీకాకుళం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆడిన మరో డ్రామా బయటపడింది. దివ్వెల మాధురితో కలిసి ఆడిన ఆత్మహత్యాయత్నం నాటకం గుట్టురట్టయింది. దువ్వాడ శ్రీనుతో కలిసి ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురి మూడు వారాల కిందట ఆత్మహత్యాయత్నం చేసినట్టు చెప్పిన సంగతి తెలిసిందే. దువ్వాడ వాణి(శ్రీను భార్య) తనపై ఆరోపణలు చేయడం వల్లనే తాను ఆత్మహత్యాయత్నం చేశానని అప్పట్లో మాధురి చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి తాజాగా శనివారం ఉదయం ఓ ఆడియో కాల్ లీకయింది. ఇందులో దువ్వాడ శ్రీను, దివ్వెల మాధురి జరిపిన ఫోన్‌కాల్ సంభాషణ ఉంది. ఆ రోజు ప్రమాదం జరిగితే.. ఆ ఘటనను ఆత్మహత్యాయత్నంగా ఎలా రక్తికట్టించారన్నది ఈ ఆడియోలో స్పష్టంగా ఉంది. దీంతో మాధురి ఆత్మహత్యాయత్నం ఘటన అంతా డ్రామా అని తేలిపోయింది. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో జనం నవ్వుకుంటున్నారు.

ఆ రోజు ఏం జరిగిందంటే...

దువ్వాడ శ్రీను కుటుంబ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్న దివ్వెల మాధురి మూడు వారాల కిందట కారు డ్రైవ్ చేసుకుంటూ హైవేలో మరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు బోల్తాపడింది. ఆ సమయంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. 108 అంబులెన్స్‌లో మాధురిని పలాస ఆసుపత్రికి తరలిస్తుండగా.. ఆమె దువ్వాడ శ్రీనుకు ఫోన్ చేశారు. కారు ప్రమాదం జరిగినట్టు కాకుండా, దువ్వాడ వాణి చేస్తున్న అరాచకం వల్ల ఆత్మహత్యకు యత్నించానని మీడియాకు చెప్పాలని మాధురికి శ్రీను సూచించారు. ఇందుకు మాధురి ఒప్పుకొన్నారు. ప్రెస్‌ను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని, తాను ఇదే విషయం చెబుతునానని శ్రీనుకు చెప్పారు. ఆ వెంటనే ఆత్మహత్యాయత్నం నాటకం రక్తిగట్టించారు.

శ్రీను, మాధురి ఫోన్ సంభాషణ ఇదీ...

మాధురి: ఏవండీ...
దువ్వాడ: ఎలా ఉందే
మాధురి: పర్లేదు
దువ్వాడ: ఏం పనిచేశావు.. ఎంత పనిచేశావు? అందుకే నేను వాడ్ని తీసుకెళ్లు అంటే నామాట వినవు
మాధురి: తీసుకెళ్లంటే వాడికి కూడా ఏదో అయిపోయేది.
దువ్వాడ: ఇప్పుడు నీ ఒంట్లో ఎలా ఉంది?
మాధురి: తలకు దెబ్బ తగిలింది. తలంతా నొప్పిగా ఉంది
దువ్వాడ: ఇప్పుడు నిన్ను హాస్పిటల్‌లో పెట్టారా?
మాధురి: 108లో ఉన్నానండీ. పలాసలో..
దువ్వాడ: హేమాచలం నీ వెనక వస్తున్నాడు. దగ్గరకు వచ్చేశాడు. పద్మను, అవినాశ్‌ను పంపిస్తున్నాను. ఏమీ వర్రీ అవకు. నువ్వు ఒకటే చెప్పు. 'నేను కావాలనే సూసైడ్ చేసుకోవాలనే ఇలా చేశా. నాపై దువ్వాడ వాణి చేసినటువంటి అరాచకం, నాలుగు రోజుల నుంచి జరిగిన అరాచకాల వల్లనే చనిపోవాలనే ఇలా గుద్దేశా' అని చెప్పు. అన్నీ నేను చూస్తా.
మాధురి: హా.. నేను మనస్తాపం చెంది గుద్ది చచ్చిపోదామని చేశా అని చెబుతా
దువ్వాడ: హా.. అదే వర్డ్. కారణం దువ్వాడ వాణి
మాధురి: ప్రెస్‌ను పంపండి. ఇదే చెబుతా
దువ్వాడ: నువ్వు ఎమోషనల్ అవ్వొద్దు. చనిపోవాలని నాకు నేనుగా గుద్దేశానని చెప్పాలి
మాధురి: నేను బాగానే ఉన్నా. అభికి చెప్పి జీహెచ్‌కు పంపించండి. ప్రెస్‌కు చెప్పి జీహెచ్‌కు పంపించండి
దువ్వాడ: వాళ్లు నీవద్దకు వస్తున్నారు. నేను మెసేజ్ పాస్ చేసేస్తున్నా
మాధురి: నేను బాగానే ఉన్నా. కొంచెం లిప్స్‌కు దెబ్బతగిలింది. ఆ రోడ్డు నుంచి ఈ రోడ్డుకు కారు బోల్తా పడి పల్టీ కొట్టేసింది. లక్కీగా ఎవరో వచ్చారు. లేకుంటే పెట్రోల్ లీకై ప్రమాదం జరిగేది
దువ్వాడ: నువ్వు ఇవన్నీ మాట్లాడకు

శ్రీనును తొలగించాలి: వాణి

దువ్వాడ శ్రీను, మాధురి మధ్య జరిగిన ఫోన్ కాల్ ఆడియో వ్యవహారం బయటపడిన నేపథ్యంలో టెక్కలి జడ్పీటీసీ, దువ్వాడ శ్రీను భార్య దువ్వాడ వాణి మీడియాతో మాట్లాడారు. దువ్వాడ శ్రీనును వైసీపీ నుంచి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భర్త దువ్వాడ శ్రీను, ఆయన తల్లి, ఆయన సోదరుడు బాబా తనపై కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇటువంటి వ్యక్తుల్ని ఇంకా వైసీపీలో ఉంచడం వల్ల పార్టీకి మరింత నష్టం తప్పదన్నారు. కుట్రల ఆలోచనలతో ఉన్న ఎమ్మెల్సీ శ్రీనుపై తమ పిల్లల భవిష్యత్ కోసమే తాను పోరాడుతునాన్నని స్పష్టం చేశారు.



కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ సమావేశంలో కొట్టుకుంటున్న కమిషనరు కనకారావు, డీఈఈ భవానీ శంకర్

కౌన్సిలర్ల సాక్షిగా అధికారుల డిష్యూం.. డిష్యూం!

▸ పిఠాపురం కౌన్సిల్ సమావేశంలో ఘటన

▸ మున్సిపల్ కమిషనర్, డీఈఈ మధ్య ఘర్షణ

▸ పరస్పరం తిట్ల దండకం, తోపులాట

పిఠాపురం, ఆగస్టు 31: కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల సాక్షిగా కమిషనర్, మున్సిపల్ డీఈఈ బాహాబాహీకి దిగారు. పరస్పరం బూతులు తిట్టుకుంటూ ఘర్షణకు దిగి అందరూ చూస్తుండగానే ఒకరినొకరు కొట్టుకున్నారు. శనివారం పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల చెల్లింపు విషయాన్ని కౌన్సిలర్లు ప్రశ్నిస్తూ.. అసలు ఎవరు బిల్లు చేశారు, ఎలా చెల్లించారు అంటూ నిలదీశారు. దీనిపై మున్సిపల్ కమిషనరు నామా కనకారావు.. వివరణ ఇస్తూ.. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా బిల్లులు చెల్లించామని చెప్పారు. మున్సిపల్ డీఈఈ భవానీశంకర్ విధుల్లో ఉన్నా తనకు సహకరించకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదించగా పబ్లిక్‌హెల్త్ ఈఈ హుస్సేన్‌ను ఇక్కడ ఇంజనీరింగ్ వ్యవహారాలు చూడడానికి నియమించారని తెలిపారు. ఆ సమయంలో కమిషనరు డీఈఈపై ఆరోపణలు చేయడం, అదే సమయంలో డీఈఈ కమిషనరుపై ప్రత్యారోపణలు చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తీవ్ర ఆగ్రహావేశాలకు లోనై ఒకరిని ఒకరు తిట్టుకుంటూ తోసుకుని కొట్టుకున్నారు. దీంతో కౌన్సిలర్లు, ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది వారిని విడదీశారు. ఇరువురూ బూతులు తిట్టుకోవడంతో కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది విస్తుపోయారు. వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించింది. దీంతో అప్పటికప్పుడు పురపరిపాలన శాఖ రీజనల్ డైరెక్టరు నాగనరసింహరావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిశోర్ పిఠాపురం వచ్చి విచారణ చేపట్టారు. కౌన్సిలర్లు, అధికారుల నుంచి వివరాలు సేకరించారు. విచారణ అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

మార్కెటింగ్‌శాఖలో పదోన్నతులు

అమరావతి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు డీఈలకు ఈఈలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు ఇవ్వగా, మరో ఈఈని బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు డీఈగా ఉన్న శ్రీనివాసరెడ్డిని కడప సీఎంఎఫ్ సర్వీస్‌లో ఈఈగా పదోన్నతి ఇవ్వగా, విజయనగరం డీఈ నారాయణకు ఈఈగా పదోన్నతి కల్పించి, మార్కెటింగ్ ప్రధాన కార్యాలయంలో నియమించారు. కడప ఈఈ వెంకటేశ్వరరావును హెడ్ ఆఫీస్‌లో ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టులో నియమించారు. అలాగే మార్కెటింగ్‌శాఖ ఏడీ రాజేష్‌కుమార్‌ను పెన్షన్స్ విభాగంలో డీడీగా నియమించారు. కడప జేడీఎం కార్యాలయంలో ఏడీ శ్రీనివాసకిరణ్‌ను విశాఖపట్నం డీడీగా నియమించారు.

జెత్వానీని ఇబ్బంది పెట్టిన వారిని

చెడ్డీలతో ఊరేగించాలి

హైడ్రా చర్యలను స్వాగతిస్తున్నాం

▸ ఏపీలో ఆక్రమణలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి: నారాయణ



తిరుపతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ నటి కాదంబరి జెత్వానీని ఇబ్బందులకు గురిచేసిన వారిని.. పోలీసులతో సహా ముంబై, విజయవాడ, హైదరాబాద్ వీధుల్లో చెడ్డీలతో ఊరేగించాలంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అధికారం చేతుల్లో ఉందికదా అని ఇష్టమొచ్చినట్టు వ్యవహరించిన వారిని సమాజం ఛీకొట్టేలా చేయాలి. అలా చేస్తే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయి. హైడ్రా కమిటీ సూచనలతో తెలంగాణలో అక్రమ కట్టడాల నిర్మాణం తొలగింపును స్వాగతిస్తున్నాం. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన గురువు ఏపీ సీఎం చంద్రబాబును మించిన శిష్యుడిగా పనిచేస్తున్నాడు. ఏపీలో కూడా చెరువులు, రోడ్లు, మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు ఎన్నో ఉన్నాయి. వాటిపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలి. మదనపల్లె ఫైళ్ల దహనంపై లోతైన విచారణ జరిపించి దోషులను శిక్షించాలి. బిగ్‌బాస్ షో హీన సంస్కృతికి ప్రతీక. ఎన్-కన్వెన్షన్ తొలగింపు నేపథ్యంలో బిగ్‌బాస్ నుంచి నాగార్జునను తొలగించాలన్న వాదన వినిపిస్తోంది. నేను నాగార్జునకు వ్యతిరేకం కాదు. బిగ్‌బాస్ షోకు మాత్రమే వ్యతిరేకం. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుల జీవితం అధోగతి పాలవుతోంది. రోజురోజుకూ మోదీ గ్రాఫ్ పడిపోతోంది. అసమర్థ ప్రధాని మోదీని ఆ పదవి నుంచి దించేయాలి. మోదీ ప్రధాని అయిన తరువాతనే స్వాతంత్ర్యం వచ్చిందని నటి కంగనా రనౌత్ చెప్పడం విడ్డూరం. సరిగ్గా బట్టలు కూడా వేసుకోని ఆమె మోదీని పొగడడం హాస్యాస్పం. బెంగాల్లో వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలి. బంగ్లాదేశ్‌లో అవినీతిని ప్రోత్సహించిన షేక్ హసీనాకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. అక్కడ ప్రజాస్వామ్యాన్ని ప్రజలే చేతుల్లోకి తీసుకున్నారు' అని నారాయణ అన్నారు.

సమన్వయంతో సహాయక చర్యలు: సీఎస్

క్షేత్రస్థాయిలో సహాయ చర్యలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. తాడేపల్లి స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వివిధ శాఖల అధికారులతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, పీఆర్, విద్యుత్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, మత్స్య, సివిల్ సప్లయిస్ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని సీఎస్ స్పష్టం చేశారు.

ఎన్‌టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

▸ వర్షాలకు తడిసిన బొగ్గు.. 8 యూనిట్లలో అంతరాయం..

▸ ఆగిన 2,560 మెగావాట్ల విద్యుదుత్పత్తి

▸ కన్వేయర్ రోలర్లు సరిచేస్తే..పరిష్కారమవుతుందన్న అధికారులు

విజయవాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా బొగ్గు తడిసిపోవటంతో నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్(ఎన్‌టీటీపీఎస్)లోని ఎనిమిది యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు తడిసిన బొగ్గు కన్వేయర్ బెల్ట్ ద్వారా బాయిలర్‌లోకి వెళ్లటం లేదు. దీంతో 8 యూనిట్లలో కలిపి మొత్తం 2,560 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. కన్వేయర్ బెల్ట్ కింద ఉన్న రోలర్లను శుభ్రం చేయకపోవటంతోపాటు, బొగ్గు తడిచి బరువెక్కటంతో రోలర్ కదల్లేదని సమాచారం. కోల్ ప్లాంట్‌లో అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని తెలుస్తోంది. రోలర్‌ను శుభ్రం చేసి, కన్వేయర్ బెల్ట్‌ను సిద్ధం చేస్తే విద్యుదుత్పత్తి జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆరోగ్యశాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్

▸ వైద్య సేవల కోసం ప్రత్యేక కాల్ నంబర్

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆరోగ్యశాఖ ద్వారా 24 గంటలూ అందుబాటులో ఉండేలా మంగళగిరి ఏపీఐఐసీ భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆరోగ్యశాఖ కమిషనర్ ఎం.హరికిరణ్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ప్రమాదాలకు జరిగినా వెంటనే ఆరోగ్యశాఖ కంట్రోల్ రూమ్‌ను స్పందించాలని కోరారు. పాము కాటులు, గర్భిణీలు ఇబ్బందులు పడినా, విద్యుత్ షాక్‌కు గురైనా వెంటనే వైద్య నిమిత్తం వెంటనే 9032384168 నంబరులో సంప్రదించాలని సూచించారు.

త్వరితగతిన రెస్క్యూ ఆపరేషన్స్: హోంమంత్రి అనిత

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వరద ప్రాంతాల్లో త్వరితగతిన రెస్క్యూ ఆపరేషన్స్ జరగాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రమాదకరమైన హోర్డింగ్‌లు, పడిన చెట్లను వెంటనే తొలగించాలని, హెల్త్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోడ్లపై నీరు పూర్తిగా తగ్గే వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.

చిన్నారికి కొండంత కష్టం

▸ పెళుసుబారిన ఎముకలు.. మెలితిరిగిన కాళ్లు

▸ మంచానికే పరిమితమైన 12 ఏళ్ల బాలిక

▸ వైద్యానికి 10 లక్షలు ఖర్చవుతుందన్న వైద్యులు

▸ దాతల సాయం కోరుతున్న నిరుపేద తల్లిదండ్రులు

విజయవాడ, ఆగస్టు 31: చెంగుచెంగున గెంతుతూ తోటి వారితో ఆడుకోవాల్సిన ఆ చిన్నారికి.. చిన్న వయసులోనే కొండంత కష్టం వచ్చింది. ఆమె ఎముకలు బాగా పెళుసుబారడంతో కాళ్లు మెలితిరిగిపోయాయి. కాలు కింద పెడితే విరిగిపోయే స్థితికి వచ్చాయి. దీంతో ఇటు చదువుకు.. అటు ఆటలకూ దూరమైన ఆ చిన్నారి మంచానికే పరిమితమైంది. డాక్టర్లకు చూపిస్తే వైద్యానికి రూ.10 లక్షలు కావాలన్నారు. నిరుపేద తల్లిదండ్రులకు అది తలకు మించిన భారమే. అందుకే ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. విజయవాడ వాంబేకాలనీకి చెందిన నామాల కాశీ, దేవి దంపతులకు ఇద్దరు సంతానం. కాశీతోపాటు కుమారుడు రాకేశ్ (6) విభిన్న ప్రతిభావంతులు. దీంతో దేవి నగరంలోని కాళేశ్వరరావు మార్కెట్‌లో రోజు కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. కుమార్తె అక్షితకు 12 ఏళ్లు. ఆమె రెండో తరగతి చదువుతుండగా ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా.. బాలికను పరీక్షించిన వైద్యులు ఆమె ఎముకలు బాగా బలహీనంగా మారాయని నిర్ధారించారు. ఈ వ్యాధి నయం కావాలంటే వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అది విని ఆ తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. రెండు పూటలా కడుపు నిండడమే కష్టంగా ఉన్న తమకు అంత స్థోమత లేదని విలపిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి సొమ్ముతో పాప కాళ్లకు కట్టు కట్టించగలిగారు. అక్షితను ఎలాగైనా బతికించుకోవాలనే ఆశతో దాతల సాయం కోసం కోరుతున్నారు. దాతలు, ప్రభుత్వం ముందుకొచ్చి తమ పాప ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నారు. సాయం చేయదలచిన వారు అజిత్‌సింగ్ నగర్ బ్రాంచ్ ఎస్‌బీఐ అకౌంట్ నంబరు 39953789310 (IF-SC Code: SB-IN0017029)కు తమ సాయాన్ని పంపించాలని కోరుతున్నారు. మరిన్ని వివరాల కోసం 9160267233 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని వేడుకుంటున్నారు.



మెలితిరిగిన కాళ్లకు కట్టుతో అక్షిత

రహస్య బ్యాలట్ ద్వారా పాఠశాల ఎన్నికలు

▸ విద్యాశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా, లద్దగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలను రహస్య బ్యాలట్ ద్వారా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి చిహ్నాలని గుర్తు చేసింది. చట్టం నిర్దేశించిన విధానానికి లోబడి వాటిని నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. చేయి ఎత్తడం ద్వారా, మూజువాణి ద్వారా ఎన్నికల నిర్వహణకు చట్టం అనుమతిస్తున్నప్పటికీ.. రాజకీయ ఒత్తిళ్లతో పాఠశాల ఎన్నికలను అధికారులు ఏకపక్షంగా నిర్వహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. ఉత్తర్వులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా, లద్దగిరి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు సంబంధించి పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలను సీక్రెట్ బ్యాలట్ ద్వారా నిర్వహించాలని కోరుతూ తాము సమర్పించిన వినతులు హెడ్ మాస్టర్ పట్టించుకోవడం లేదని పేర్కొంటూ అదే గ్రామానికి చెందిన షేక్ మెహబూబ్ బాషా హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

పీఎంశ్రీ పాఠశాలలకు రూ.8.63 కోట్లు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 855 పీఎంశ్రీ పాఠశాలలకు ఫేజ్-1, ఫేజ్-2 వార్షిక గ్రాంట్ల వినియోగం కింద 2024-25 సంవత్సరానికిగానూ రూ.8.63 కోట్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు (ఎస్పీడీ) బి.శ్రీనివాసరావు తెలిపారు. ఫేజ్-1 కింద 662 పాఠశాలలకు రూ.667.75 లక్షలు, ఫేజ్-2 కింద 193 పాఠశాలలకు రూ.195 లక్షలకు ఆమోదం లభించినట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఈ నిధులలో కనీసం 10 శాతం నిధులు పీఎంశ్రీ పాఠశాలల్లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. మిగిలిన నిధులను పాఠశాలల విద్యుత్తు చార్జీలు, చాక్‌పీసులు, డస్టర్లు, చార్టులు, ఇంటర్నెట్, పాఠశాల విద్యా సామగ్రి, స్టేషనరీ, మరమ్మతులు, పాడైన సామగ్రి, వినియోగపడని క్రీడా సామగ్రి, ప్రయోగశాలలు, ఉపకరణాలు, క్రీడా మైదానాలు, ల్యాబ్స్, విద్యా సంబంధిత దినోత్సవాలు, ఇతరత్రా పాఠశాల నిర్వహణ ఖర్చులకు వినియోగించాలని ఎస్పీడీ వివరించారు.

త్వరలో ఒకే రాడార్ కేంద్రం నుంచి సేవలు

▸ గాదంకి ఇస్రో సెంటర్ చీఫ్ డాక్టర్ దుర్గారావు

కావలిటౌన్, ఆగస్టు 31: త్వరలో ఒకే రాడార్ కేంద్రం ద్వారా వివిధ రకాల సేవలు పొందవచ్చని చిత్తూరు జిల్లా గాదంకి ఇస్రో సెంటర్ చీఫ్ డాక్టర్ దుర్గారావు పేర్కొన్నారు. శనివారం నెల్లూరు జిల్లా కావలిలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐసీఆర్ఏసీఈ- 2024 అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విపత్తుల నిర్వహణకు, విమానయాన ఉపగ్రహ పరిశోధనకు రాడార్ కేంద్రం సేవలను వినియోగిస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంలో నూతన ఆవిష్కరణలతో రాడార్ సేవలను మరింత విస్తృత పరుస్తున్నామన్నారు. నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లావణ్య మాట్లాడుతూ మెషీన్ లెర్నింగ్‌కు ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానాన్ని జతచేయడం వల్ల రాబోయే రోజుల్లో అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. అనంతరం అప్లికేషన్ ఆన్ డేటా మైనింగ్ అంశంపై పలువురు మాట్లాడారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ లక్కిరెడ్డి బాలిరెడ్డి పాల్గొని డేటా మైనింగ్‌కు చెందిన అధునాతన పరిజ్ఞానం గురించి వివరించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని ఆయన పిలుపునిచ్చారు. బెస్ట్ పేపర్ ప్రజంటేషన్ ఇచ్చిన విద్యార్థులకు ఈ సందర్భంగా అవార్డులు బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాయకులు పోతే జగన్‌కు నష్టం లేదు: రోజా

తిరుమల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నాయకులు వెళ్లిపోవడం వల్ల జగన్‌కు కానీ, వైసీపీకి కానీ ఎలాంటి నష్టం లేదని మాజీ మంత్రి రోజా అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం సినీనటి రవళితో కలిసి దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. '2014-19 మధ్య కూడా చాలా మంది పార్టీ మారారు. తరువాత వాళ్లు ఏమయ్యారో కూడా చూశాం. పార్టీ నుంచి వెళ్లేపోయేవారు తాము చేస్తున్నది కరెక్టా, కాదా అనేది పునరాలోచించుకోవాలి. పార్టీకి ద్రోహం చేసి వెళ్లిన వారిని ఎవరూ గౌరవించరు' అని రోజా అన్నారు.

విజయవాడ సున్నపుబట్టీల సెంటర్‌లో విరిగిపడిన కొండచరియలు





సున్నపుబట్టీల సెంటర్‌లో కొండచరియలు విరిగిపడి మృతిచెందిన వారిని తరలిస్తున్న సహాయక సిబ్బంది



సున్నపుబట్టీల సెంటర్‌లో విరిగిపడిన కొండచరియల కింద మృతదేహం

ఉసురు తీసిన వాన

వాగులో కొట్టుకుపోయిన కారు



గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలవాడు వాగులో కారు కొట్టుకుపోయి ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడు నడింపల్లి రాఘవేంద్ర రావు(40), విద్యార్థులు కోడూరి మాణిక్(9), పసుపులేటి శౌరీ(9) మరణించారు. నంబూరులోని ప్రైవేటు పాఠశాలకు ఉదయం స్కూల్ బస్సులోనే విద్యార్థులు మాణిక్, శౌరీ వచ్చారు. అయితే పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఉప్పలపాడులోని వారి ఇళ్ల వద్ద దింపుతానంటూ అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాఘవేంద్ర రావు తన కారులో వారిద్దరినీ ఎక్కించుకున్నారు. మధ్యలో వాగు ఉధృతికి కారు కొట్టుకుపోయి ముగ్గురూ మరణించారు.

వేర్వేరు ఘటనల్లో 9 మంది దుర్మరణం

కొండరాళ్లు పడి ఆరుగురు.. వాగులో కారు కొట్టుకుపోయి ముగ్గురు

రాళ్ల కింద ఆక్రందనలు.. జేసీబీలతో శిథిలాల తొలగింపు

విజయవాడ, గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కుండపోతగా కురిసిన వర్షాలు రాష్ట్రంలో తొమ్మిది మంది ప్రాణాలను బలిగొన్నాయి. కొండచరియలు విరిగిపడి ఆరుగురు మరణించగా, వాగులో కారు కొట్టుకుపోయి ముగ్గురు చనిపోయారు. కొండచరియల కింద నలిగి మరో నలుగురు గాయాలపాలయ్యారు. విజయవాడ, మంగళగిరి, గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలో శనివారం ఈ విషాద ఘటనలు జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి భారీగా కురిసిన వర్షాల కారణంగా విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లో శనివారం తెల్లవారుజామున కొండపై నుంచి భారీ రాళ్లు జారి రేకుల ఇళ్లపై పడ్డాయి. దీంతో రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఆ రెండు ఇళ్లలో మొత్తం పదిమంది ఉన్నారు. వారిలో నవుడు మేఘన(25), బోలెం లక్ష్మి(49), పుర్కాటిలాలో(38), జంపాన అన్నపూర్ణ(55), సంతోషాచారి(23) శిథిలాల కింద నలిగి ప్రాణాలు కోల్పోయారు. పప్పరవారి శాంతి, పప్పరవారి స్వామి తీవ్రగాయాలపాలవగా, నవుడు సత్యనారాయణ , ఆయన భార్య నవుడు నాగమణిలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించారు. అలాగే, గుంటూరు జిల్లా మంగళగిరి కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి నాగరత్నమ్మ(65) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కొండపై నుంచి బండరాళ్లు ముందుగా నవుడు సత్యనారాయణ ఇంటిపై పడ్డాయి. ఆ సమయంలో ఆ ఇంట్లో ముగ్గురు ఉండగా, సత్యనారాయణ కుమార్తె మేఘన శిథిలాల కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందారు. సత్యనారాయణ, ఆయన భార్య నాగమణి గాయాలపాలయ్యారు. అనంతరం కొండరాళ్లు ఆ ఇంటిపై నుంచి దొర్లి పక్కనున్న మరో ఇంటిపై పడ్డాయి. ఈ ఇంటో రెండు పోర్షన్లు ఉండగా.. వాటిలో మొత్తం ఏడుగురు ఉన్నారు. మొదటి పోర్షన్‌లోని బోలెం లక్ష్మి శిథిలాల కింద చిక్కుకుని శరీరమంతా నుజ్జునుజ్జయి కొద్దిసేపటికే ఆమె మరణించారు. అదే పోర్షన్‌లో ఉన్న జంపాన అన్నపూర్ణ కూడా శరీరం పలుచోట్ల ఛిద్రమై ఆర్తనాదాలు చేసి.. చివరికి ప్రాణాలు కోల్పోయారు. కడప జిల్లా మైదుకూరుకు చెందిన సంతోషాచారి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయటానికి విజయవాడ వచ్చి మొగల్రాజపురం కొండప్రాంతంలో రేకుల ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అలాగే కొతవరం గ్రామానికి చెందిన యశ్వంత్ కూడా ఆ గదిలో ఉంటున్నారు. శిథిలాల సంతోషాచారి మృతదేహాన్ని వెలికితీశారు. యశ్వంత్ కూడా శిథిలాల కింద ఉన్నాడని రాళ్ల తొలగింపు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పెద్ద పెద్ద జేసీబీలతో శిథిలాలను తొలగించారు. మధ్యాహ్నానికి మృతదేహాలన్నింటినీ బయటికి తీశారు. కాగా, విజయవాడలో ప్రైజర్‌పేట, గాంధీకొండ, గొల్లపాలెంగట్టు ప్రాంతాల్లోనూ భారీ కొండ రాళ్లు జారిపడ్డాయి. గొల్లపాలెంగట్టు వద్ద కొండచరియలు, రిటైనింగ్ వాల్ కూలి ఓ ఇల్లు ధ్వంసమైంది. అలాగే, ఇంద్రకీలాద్రిపైనా కొండ చరియలు విరిగిపడి పడ్డాయి.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: పవన్ కల్యాణ్



అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో కొండ చరియలు విరిగిపడ్డ ఘటనలో నలుగురు మృతి చెందడం బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు శనివారం ఆయన ఓ ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 'ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందిస్తుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎనిమిది మంది మృతి చెందారని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విపత్తు నిర్వహణ శాఖ వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు అందించే ఏర్పాటు చేసింది. అధికారులు లోతట్టు ప్రాంతాల వారిని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో అధికారులకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, శ్రేణులు సాయంగా ఉండాలి. ఆహారం, రక్షిత తాగునీరు, వైద్య సహాయం అందించడంలో తోడ్పాటు ఇవ్వాలి' అని కోరారు.

సహాయక చర్యల్లో పాల్గొనండి: లోకేశ్

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు సహాయక చర్యలకు పూర్తి సహకారం అందించాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. విపత్తు సమయంలో ప్రజలకు టీడీపీ అండగా ఉంటుందనే భరోసా కల్పించాలని శనివారం 'ఎక్స్' వేదికగా సూచించారు. 'వర్షాలు, వరదల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం, విపత్తుల నిర్వహణ శాఖ అలెర్ట్ మెసేజ్‌లను గమనిస్తూ, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు బయటకు రాకుండా ఉండటం మంచిది. కొండ చరియలు విరిగిపడే, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికార యంత్రాంగం సూచించిన సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి' అని కోరారు.

పంట నష్టం పెరగకుండా చర్యలు: అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేని వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి, పంట నష్టం పెరగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులతో ఆయన అత్యవసరంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, వర్షాల పరిస్థితిని సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి, పంట సంరక్షణపై సూచనలివ్వాలి. పంట నష్టం అంచనా వేసేందుకు ఆదివారం కూడా సిబ్బంది అందుబాటులో ఉండాలి. వర్షాలతో చేపలు, రొయ్యల చెరువులకు ముప్పు వాటిల్లకుండా రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

విద్యుత్తుకు అంతరాయం లేకుండా చూడండి

- డిస్కమ్‌లకు కె.విజయానంద్ ఆదేశం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తోన్న భారీ వర్షాలకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శనివారం ఆయన డిస్కమ్ సీఎండీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, 'విద్యుత్తు పంపిణీ సంస్థల ఇంజనీరింగ్, ఫీల్డ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉపరిత ఆవర్తనం కారణంగా బలమైన గాలులూ వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. ఈ తరుణంలో విద్యుత్తు శాఖకు సంబంధించి వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి' అని సూచించారు.

అత్యవసర సేవలకు టోల్ ఫ్రీ నంబర్లు

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అత్యవసర సహాయం కోసం ఎమర్జెన్సీ స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 18004250101 నంబర్లను సంప్రదించాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

కుండపోత

రోజంతా ఎడతెరిపి లేకుండా వాన

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

భారీ వర్షాలకు తొమ్మిది మంది బలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా అనేకచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 62,550 హెక్టార్లలో పంట ముంపుబారిన పడినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వరి 50వేల హెక్టార్లు, పత్తి 5వేలు, మొక్కజొన్న 3,100, కంది 2వేల, వినుము వెయ్యి, వేరుశనగ 500, ఇతర పంటలు 950 హెక్టార్లలో ముంపునకు గురైనట్లు ఆ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. అపరాల పంటలు దెబ్బతినగా, పత్తి, మిర్చి పైర్లు ఉరకెత్తే స్థితిలో ఉన్నాయి. వాగులు, వంకలు, కాలువలు పొంగి, లో-లెవల్ వంతెనలపై నీరు పారింది. భారీవర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వర్షాలు, వరద పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు.

జిల్లాలు అతలాకుతలం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి, టమోటా, ఉల్లి వంటి ప్రధాన పంటలు నీట మునిగాయి. నెల్లూరు జిల్లా కందుకూరు ప్రాంతంలో కురిసిన వర్షం ఖరీఫ్‌లో సాగు చేసిన పైర్లకు జీవం పోయడంతో పాటు నెల క్రితం విస్తారంగా వేసిన జామాయిలుకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరులో సుమారు 18గంటల పాటు కురిసిన వర్షంతో అవుట్‌ఫాల్ డ్రెయిన్లు పొంగి వీధుల్లోకి పొర్లడంతో రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారిపై కాజా టోల్‌ప్లాజా వద్ద నడుం లోతున వరదనీరు ప్రవహించడంతో హైవే బ్లాక్ అయింది. పల్నాడు జిల్లా పెదకూరపాడు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో వాగులు రోడ్లపై ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఊయందున వాగులో కొట్టుకు పోతున్న వెంకట్రావు అనే వ్యక్తిని వీఆర్వో బాషా కాపాడారు. అచ్చంపేట వద్ద రెండు వాగులు పొంగడంతో ఆర్టీసీ బస్సు నీటిలో చిక్కుకుంది. బస్సును సురక్షితంగా ఒడ్డుకు తరలించారు. ప్రకాశం జిల్లా నల్లమల అటవీప్రాంతంలో కురిసిన భారీవర్షంతో నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వద్ద గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించగా కొందరు భక్తులు గుడి వద్ద చిక్కుకుపోయారు. పోలీసులు ట్రాక్టర్‌పై వారిని తీసుకొచ్చారు.

కాకినాడ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

కాకినాడ జిల్లాకు వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కాకినాడ పోర్టు నుంచి మూడోరోజు కూడా విదేశాలకు బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి.

నూజివీడు జలమయం

ఏలూరు జిల్లా నూజివీడులోని తిరువూరు బస్టాండు సమీపాన పెద్ద చెరువుకు భారీ గండిపడటంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికులు తాళ్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఎస్సీ హాస్టల్ ప్రాంతాన్ని వరద చుట్టుముట్టింది. దీంతో హాస్టల్‌లో ఉన్న 157మంది బాలికలను పట్టణంలోని బాలికల సమీకృత వసతి గృహానికి తరలించారు. ఇంకోవైపు నూజివీడు సమీపాన రామిలేరు ఉప్పొంగడంతో పోతిరెడ్డిపల్లి గ్రామం వైపు వెళ్లే ఒక దేవాలయం సమీపాన ఫంక్షన్‌కు హాజరైన 25మందికి పైగా నీటిలో చిక్కుకుపోయారు. అధికారులు ఎక్స్‌కవేటర్లను రంగంలోకి దింపి వారందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

తిరుమలలో భక్తురాలిపై కూలిన భారీ వృక్షం

వర్షాలకు తిరుమలలో ఓ భారీ వృక్షం కూలడంతో భక్తురాలు తీవ్రగాయాలపాలయ్యారు. ఏఎంసీ ప్రాంతంలోని 305వ కాటేజీ వద్ద చెన్నైకి చెందిన ఉమామహేశ్వరి కూర్చొని ఉండగా, సమీపంలోని భారీ వృక్షం కూలిపోయింది. చెట్టు కొమ్మలు ఆమెకు తగలడంతో స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కూలిన వృక్షాన్ని తొలగించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు తిరుమలలో చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. చలి విపరీతంగా పెరిగింది.

మంగళగిరి-నంబూరు మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్

భారీ వర్షం కారణంగా మంగళగిరి-నంబూరు మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతింది. దీంతో శనివారం మంగళగిరి వైపు నుంచి గుంటూరుకు వచ్చే రైళ్లను నిలిపేసి డౌన్‌లైన్‌లో నడిపారు. ఈ కారణంగా విజయవాడ- హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఐదున్నర గంటల పాటు మంగళగిరి రైల్వేస్టేషన్‌లో నిలిపేశారు. మధ్యాహ్నం 2.24 గంటలకు మంగళగిరి వచ్చిన ఈ రైలు రాత్రి 8గంటలకు కదిలింది. అలాగే, విజయవాడ-చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ 2గంటలు ఆలస్యంగా వెళ్లింది. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోవైపు మణిపురం క్యాబిన్ వద్ద డ్రెయినేజీ నీరు ట్రాక్ పైకి చేరడంతో త్రివేండ్రం సెంట్రల్‌కు బయలుదేరిన శబరి ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు రైల్వేస్టేషన్‌లో 40నిమిషాలు నిలిపేశారు. ట్రాక్‌కు మరమ్మతులు చేసేందుకు అవసరమైన సామగ్రిని వేజండ్ల రైల్వేస్టేషన్ నుంచి మంగళగిరికి తరలించారు.



విజయవాడ బస్టాండు వద్ద రైల్వే వంతెన కింద చిక్కుకుపోయిన బస్సులు



సెంటినీ హాస్పిటల్ రోడ్డులో వరద నీటిలో వాహనాలు



కాలువను తలపిస్తున్న విజయవాడలోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు



విజయవాడ నోవాటెల్ వద్ద జాతీయ రహదారి, సర్వీసు రోడ్లపై వరద నీరు

బెజవాడలో రికార్డు వర్షం!

50 ఏళ్ల రికార్డు బద్దలు

- శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఒక్క 'తూర్పు'లోనే 174.2 మి.మీ. నమోదు
- ఇది గత 200 ఏళ్లలోనే అత్యధిక వర్షపాతం
- ఏపీ వెదర్‌మాన్‌లో పోస్టు

విజయవాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విజయవాడలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం గత ఐదు దశాబ్దాల కాలంలోనే అత్యధికమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఏపీ వెదర్‌మాన్‌లో ఈ మేరకు పోస్టు చేయడం సంచలనం సృష్టిస్తోంది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కురిసిన వర్షం గత 200 సంవత్సరాల్లో ఎప్పుడూ నమోదు కాలేదని ఆ పోస్టులో పేర్కొన్నారు. అయితే దీనిపై ఇప్పటికిప్పుడు ఏమీ చెప్పలేమని, పాత రికార్డులు పరిశీలించాల్సి ఉందని జిల్లా యంత్రాంగం చెబుతోంది. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం విజయవాడ నగరంలో 2020 అక్టోబరు 13న 122.06 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు రికార్డు స్థాయిలో వర్షం పడింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 174.2 మి.మీ. వర్షం పడింది. అలాగే శనివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 125.4 మి.మీ. నమోదైంది. ఈ రెండూ ఆల్‌టైమ్ రికార్డు వర్షపాతాలుగా చెబుతున్నారు. అలాగే విజయవాడ సెంట్రల్‌లో 172.4, 125.2., విజయవాడ నార్త్ మండలంలో 173.2, 125.8, విజయవాడ వెస్ట్‌లో 172.4, 125.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఇక ఎన్టీఆర్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి 7గంటల వరకు అత్యధికంగా 258.92 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. విజయవాడలో జాతీయ రహదారులు, ప్రధాన, అంతర్గత రహదారులపై రెండు నుంచి మూడు అడుగుల వరకు వర్షపు నీరు చేరింది. కాలనీలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముప్పాళ్ల వద్ద వాగులో ఓ యువకుడు కొట్టుకుపోతుండగా స్థానికులు రక్షించారు.



విజయవాడ వన్‌టౌన్‌లోని ఓ వీధిలో నీట మునిగిన వాహనాలు

నేడు, రేపు 25 రైళ్లు రద్దు

పలు రైళ్లు దారి మళ్లింపు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలపై భారీ వర్షాల ప్రభావం పడింది. దీంతో ఆది, సోమవారాల్లో వివిధ మార్గాల్లో నడవాల్సిన 25 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఆదివారం విజయవాడ-తెనాలి విజయవాడ-గుంటూరు, విజయవాడ- కాకినాడపోర్టు, తెనాలి-రేపల్లె, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు, ఒంగోలు-విజయవాడ, మచిలీపట్నం-విజయవాడ మార్గాల్లోని రైళ్లను రద్దు చేశారు. సోమవారం గుంటూరు-రేపల్లె, గుంటూరు-విజయవాడ, విజయవాడ-సర్సాపూర్ రైళ్లను రద్దు చేసినట్టు చెప్పారు.

హెల్ప్‌లైన్ నెంబర్లు..

కుండపోత వర్షాల కారణంగా పలు రైళ్ల రద్దు, కొన్ని రైళ్ల దారి మళ్లింపు సమాచారాన్ని ప్రయాణికులకు తెలియజేయడానికి దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన్ నంబర్లు ప్రకటించింది.

హైదరాబాద్-27781500
సికింద్రాబాద్-27786140, 27786170
విజయవాడ -7569305697
రాజమండ్రి- 0883-2420541, 0883-2420543

ప్రాణ నష్టం జరక్కూడదు

అప్రమత్తంగా వ్యవహరించాలి

- అధికారులకు చంద్రబాబు స్పష్టీకరణ
- మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): "నష్టం జరిగిన తర్వాత స్పందించడం కాదు. నష్టం తగ్గించేలా అధికారులు పనితీరు ఉండాలి. ప్రమాదం జరిగిన తర్వాత ప్రభుత్వం సాయం చేయడం కాదు. ప్రమాదం జరగకుండా చూడటంపై యంత్రాంగం దృష్టి పెట్టాలని" అని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో సహాయక చర్యల కోసం జిల్లాకు రూ.3 కోట్లు చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప.. బయటకు రావొద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం వర్షాలు, వరదలపై నిరంతరం సమీక్షించారు. "వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీరం వెంబటి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి. జిల్లా కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలి. హుద్‌హుద్ తుపాన్ సమయంలో అనుసరించిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇప్పుడూ పాటించాలి. చిన్న ఘటన జరిగినా సహించేది లేదు. ప్రాణనష్టం లేకుండా చూడాలి" అని సీఎం ఆదేశించారు. కాగా, మ్యాన్‌హోల్స్ వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. అల్లూరి జిల్లాలో జరిగిన కలుషిత ఆహార ఘటనపై అధికారులు సీరియస్‌గా దృష్టి పెట్టాలని, బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విజయవాడలో కొండ చరియలు విరిగి పడి పలువురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. వరద బాధితుల పునరావాస చర్యల్లో ఖర్చుకు ఎక్కడా వెనుకాడొద్దని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యా లూ అందాలని సీఎం ఆదేశించారు. మంచి భోజనం, వసతి ఏర్పాట్లు ఉండాలని నిర్దేశించారు. శనివారం రాత్రి 10 గంటలకు మరోసారి సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ కళింగపట్నం ప్రాంతంలో తీరం దాటిందని, ఆదివారం వర్షాల తీవ్రత తగ్గుతుందని అధికారులు చెప్పారు.

సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మంగళగిరిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ జి. జయలక్ష్మి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వివిధ శాఖలు, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఆపరేషన్లను పర్యవేక్షిస్తుంది. 4 జోన్ల లో పరిస్థితిని పర్యవేక్షించేందుకు నలుగురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమించారు. ఆర్టీజీఎస్‌లో ప్రభుత్వం మరో బృందాన్ని ఏర్పాటు చేసింది.



నంద్యాల జిల్లా ఆత్మకూరులో రహదారిపై కూలిన భారీ వృక్షం



కృష్ణా జిల్లా నాగాయలంక మండలంలో చెరువులను తలపిస్తున్న పొలాలు



ఏలూరు జిల్లా నూజివీడు-పోతురెడ్డిపల్లి రహదారిపై రామిలేరు వరదలో చిక్కుకున్న మహిళలను తరలిస్తున్న దృశ్యం



గుంటూరు కార్పొరేషన్ వద్ద వర్షపు నీటిలో బోటుతో ఎన్ఎస్‌యూఐ కార్యకర్త నిరసన

- ఎన్టీఆర్‌తో పోలిస్తే చంద్రబాబుకు బలమైన జనాకర్షణ శక్తి లేదు. అంతటి వాక్పటిమా లేదు. అయినప్పటికీ... కేవలం 'పనితీరు' అనే ఏకైక అస్త్రంతో అటు పార్టీ, ఇటు ప్రభుత్వంపై చంద్రబాబు పట్టు సాధించారు.
- 'ఫైలు'... అంటే 'పెండింగ్' అనే అర్థం ఉన్న రోజులవి. అలాంటి సమయంలో ఫైళ్ల పరిష్కారానికి వారోత్సవాలు నిర్వహించిన ఘనత దేశంలో మొట్ట మొదట చంద్రబాబుకే దక్కింది.
- ఐటీ వల్ల భవిష్యత్తులో అనేక అవకాశాలు రాబోతున్నాయని గ్రహించి హైదరాబాద్ కేంద్రంగా ఐటీ కంపెనీలను ఆకర్షించడంపై దృష్టి పెట్టారు. ఆ సమయానికి దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇలాంటి ఆలోచన చేయలేదు.
- హైదరాబాద్ భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని ఆ రోజుల్లోనే చంద్రబాబు ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్‌కు రూపకల్పన చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుకు భూ సేకరణ అంతా ఆయన హయాంలోనే పూర్తయింది.


1995 సెప్టెంబరు 1న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబు

నవ శకానికి నాడు నాంది!

- చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయి 30 ఏళ్లు
- సంక్షోభ సమయంలో పాలన, పార్టీ పగ్గాలు
- పనితీరు, ప్రతిభతో పాలనలో కొత్త పుంతలు
- సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలతో పరుగులు
- 'విజన్' పాలిటిక్స్‌కు తొలిసారిగా శ్రీకారం
- 'సీఈవో - సీఎం'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు
- నాలుగు సార్లు సీఎంగా బాబు ఘనత
- నేటికీ అదే ఉత్సాహం... కొత్తదనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఈ రోజు గడిస్తేచాలు. మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే చాలు' అంటూ ఎప్పటికప్పుడు రాజకీయ లాభం చూసుకునే రోజులవి! అలాంటి రోజుల్లోనే... 'విజన్' పాలిటిక్స్‌తో దేశంలో చరిత్ర సృష్టించిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. అత్యంత సంక్షుభిత రాజకీయ వాతావరణంలో 1995 సెప్టెంబరు ఒకటో తేదీన ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంటే... నేటితో 30వ ఏట అడుగు పెడుతున్నట్లు! సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు ఎంత కాలం ఆ పదవిలో ఉంటారోనన్న సందేహాలను పటాపంచలు చేస్తూ... తెలుగువారిలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా ఉన్న నేతగా రికార్డు సృష్టించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో 45 ఏళ్ల పిన్న వయసులో ఆ పదవిని అధిష్ఠించిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందారు. రాష్ట్రానికి సీఈవోగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు.

పని.. పని.. పని...

ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెగకుండా పని చేస్తూ శ్రమించే ముఖ్యమంత్రిగా ముద్ర పొందారు. ఆ ముద్ర ఆయనను ప్రజలకు దగ్గర చేసి వారి హృదయాల్లో చోటు కల్పించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే ఆయన నాటి అసెంబ్లీలో కాంగ్రెస్ పక్ష నేత పి.జనార్దన రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి కొత్త సంప్రదాయానికి తెరదీశారు. ముఖ్యమైన అంశాలు ఉన్నప్పుడు తన అధ్యక్షతన అఖిల పక్ష సమావేశాలు నిర్వహించి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకొని ముందుకు వెళ్లేవారు. ఆయన నిర్వహించినన్ని అఖిలపక్ష సమావేశాలు తర్వాతి కాలంలో మరెవరూ నిర్వహించలేదు. అలాగే... అనేక వర్గాల ప్రజలతో జూబిలీ హాల్‌లో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకొని దానికి అనుగుణంగా విధానాలు రూపొందించారు. ముఖ్యమంత్రి హోదాలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అధికార యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తంగా ఉంచేవారు. హైదరాబాద్‌లో కనీస వసతుల అభివృద్ధికి ఈ ఆకస్మిక తనిఖీలు చాలా ఉపయోగపడ్డాయి. ఆయన జిల్లాల పర్యటనకు వస్తున్నారంటే ఎక్కడ ఏ లోపాన్ని పట్టుకొంటారోనన్న భయంతో అధికారులు ఒకటికి రెండుసార్లు అన్నీ సరి చూసుకొనేవారు. పచ్చదనం- పరిశుభ్రం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టి నగరాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంచారు. ప్రతి నెలా రెండో శనివారం దీనికి కేటాయించారు.

'క్లియర్'గా ఫైళ్లు...

'ఫైలు'... అంటే 'పెండింగ్' అనే అర్థం ఉన్న రోజులవి. అలాంటి సమయంలో ఫైళ్ల పరిష్కారానికి వారోత్సవాలు నిర్వహించిన ఘనత దేశంలో మొట్ట మొదట చంద్రబాబుకే దక్కింది. ఏ స్థాయి అధికారి ఎన్ని రోజుల్లో ఫైళ్లు పరిష్కరించాలో గడువు విధించారు. భవన నిర్మాణ అనుమతులు వంటి దరఖాస్తులపై నిర్దిష్ట గడువులోపు నిర్ణయం తీసుకోకపోతే... దానంతట అదే అనుమతి మంజూరయ్యే విధానాన్ని కూడా ఆయనే తెచ్చారు. ఏ మంత్రి వద్ద ఫైళ్లు ఎన్ని రోజులు పెండింగ్‌లో ఉన్నాయో ప్రతి మంత్రివర్గ సమావేశంలో మంత్రులకు లెక్కరాసి ఇచ్చేవారు. తన వద్ద ఫైళ్ల క్లియరెన్స్‌కు ఎన్ని రోజులు పడుతోందో కూడా ఆయన బహిరంగంగా చెప్పేవారు. దీనివల్ల ఫైళ్లు వేగంగా కదలడం మొదలైంది.

కంప్యూటర్లకు స్వాగతం...

ప్రభుత్వ శాఖలను కంప్యూటరీకరించడం చంద్రబాబు సాధించిన అతి పెద్ద విజయం. అన్ని శాఖల పరిధిలోని మొత్తం సమాచారాన్ని కంప్యూటర్లలోకి ఎక్కించడానికి ఆయన అధికారుల వెంటపడ్డారు. చంద్రబాబు హయాంలోనే 'ఈ-సేవ' కేంద్రాలు ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి అడుగు పెట్టకుండానే బిల్లుల చెల్లింపు, సర్టిఫికెట్లు తీసుకోవడం అప్పుడే మొదలైంది. తర్వాతి కాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ విధానాన్ని అనుసరించాయి. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర రాజధానితో ఆన్‌లైన్‌లో అనుసంధానించడం, పలు శాఖలను ఒకే పోర్టల్ పరిధిలోకి తేవడం వంటి వినూత్న విధానాలు కూడా చంద్రబాబు హయాంలోనే పురుడు పోసుకొన్నాయి.

వినూత్నం... పారిశ్రామికం...

పరిశ్రమలు, పెట్టుబడుల సాధనలో చంద్రబాబు వినూత్నమైన పంథాలో సాగారు. అదీ ఇదీ అని కాకుండా... వీలైనన్ని రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మా కంపెనీల కోసం ఫార్మా పార్క్ ఏర్పాటు చేశారు. దేశంలో మొదటిసారిగా ప్రైవేటు రంగంలోని వారితో హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మింపచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెరగడానికి ఈ విమానాశ్రయం బాగా దోహదం చేసింది. హైదరాబాద్ సహా ఉమ్మడి రాష్ట్రమంతా రోడ్ల వెడల్పును భారీ స్థాయిలో చేపట్టింది చంద్రబాబే.


ఐటీకి శ్రీకారం

యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన చంద్రబాబు దాని కోసం ఏం చేయాలన్నదానిపై అనేక సమావేశాలు నిర్వహించారు. ఐటీపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రపంచంలో అగ్రగామి ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్ తన డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించడంలో సఫలమైన చంద్రబాబు ఆ తర్వాత వెనుతిరిగి చూడలేదు. హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ 'బ్రాండ్' పెంచేందుకు అమెరికాలో విస్తృతంగా రోజుల తరబడి పర్యటించి ప్రతి కంపెనీ వద్దకు తానే తిరిగారు. వచ్చిన కంపెనీలకు భవనాలు వెతికి పెట్టడం మొదలుకొని ఇంటర్‌నెట్ ప్యాకేజీలు మాట్లాడిపెట్టడం, ఉద్యోగులకు శిక్షణ ఇప్పించడం వంటి మొత్తం పనులను ప్రభుత్వ అధికారులతో చేయించారు. ఫోన్ కంపెనీలతో మాట్లాడి ఐటీ కంపెనీలకు ప్రత్యేక రాయితీతో ప్యాకేజీలు ఇప్పించారు. వాటికి అవసరమైన వసతులతో మొదట హైటెక్ సిటీ భవనం నిర్మింప చేయడంతోపాటు తర్వాతి కాలంలో ఏకంగా సైబరాబాద్ నిర్మాణానికి బాటలు వేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో పనులు వేగంగా జరుగుతాయన్న పేరు రావడంతో... అనేక కంపెనీలు క్యూ కట్టాయి. అవినీతికి ఆస్కారం లేకుండా పెట్టుబడులు సాధించారు. ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరుల కోసం రాష్ట్రంలో ఇబ్బడి ముబ్బడిగా ఇంజనీరింగ్ కళాశాలలు పెంచే ప్రక్రియ ఆయన హయాంలోనే మొదలైంది. ఇంకా... ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేశారు. విద్య మీద దృష్టి పెరగడంతో ఐఐటీల్లో రాష్ట్రానికి భారీగా సీట్లు రావడం మొదలైంది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం కోసం పట్టుబట్టి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తెచ్చారు.


బిల్‌గేట్స్‌తో చంద్రబాబు

సంస్కరణల సారథి

ముఖ్యమంత్రిగా తన తొలి హయాంలోనే చంద్రబాబు సంస్కరణలను బలంగా ముందుకు తీసుకెళ్లారు. దీనివల్ల ఆయన రాజకీయంగా నష్టపోయినా... తర్వాతి కాలంలో అనేక రంగాలు దానివల్ల పురోగమించాయి. విద్యుత్ రంగంలో ఆయన చేపట్టిన సంస్కరణలు జవాబుదారీతనాన్ని పెంచాయి. ఆ రంగంలో మౌలిక వసతులను ఆయన బాగా అభివృద్ధి చేయడం తర్వాతి కాలంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సఫలం కావడానికి దోహదం చేసింది. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటు సంస్థలు తమ పెట్టుబడులతో రోడ్లు వేసి టోల్ విధానాన్ని అమలు చేయించారు. దీనివల్ల దేశవ్యాప్తంగా రోడ్ నెట్‌వర్క్ విపరీతంగా అభివృద్ధి అయింది. ప్రభుత్వ రంగంలో ఉండి ఎదుగూ బొదుగూ లేని టెలిఫోన్ వ్యవస్థలోకి ప్రైవేటు కంపెనీలు అడుగు పెట్టడానికి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటైన కేంద్ర స్థాయి కమిటీ సిఫారసులు ఉపకరించాయి. కేవలం నివేదిక ఇవ్వడానికి పరిమితం కాకుండా... సిఫారసులు అమలయ్యేలా చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు.



ఇలా మొదలైంది...

యూనివర్సిటీ రాజకీయాల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టిన చంద్రబాబు... 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి తెలుగుదేశం పార్టీలో కీలక స్థానానికి చేరుకొన్నారు. లక్ష్మీ పార్వతి వ్యవహార శైలితో విసుగు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు జెండా ఎగరవేయడంతో... ఎన్టీ రామారావు స్థానంలో చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ఆయన అప్పటికే ఎన్టీఆర్ మంత్రివర్గంలో రెవెన్యూ, ఆర్థిక శాఖల మంత్రిగా ఉన్నారు.

అదే ఉత్సాహం...

ముప్పై ఏళ్ళ తర్వాత కూడా నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు అదే ఉత్సాహం, దూరదృష్టితో పనిచేస్తుండటం విశేషం. ఈసారి ఆయన 'వికసిత ఆంధ్ర ప్రదేశ్-2047' ప్రణాళిక రూపకల్పనపై దృష్టి పెట్టారు. రోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ పనిలో మునిగిపోతున్నారు. 'అమరావతి' అనే ఒక నగర నిర్మాణానికి పూనుకుని... నవ్యాంధ్ర సమగ్ర ప్రగతిపై దృష్టి సారించారు.


నాటి ప్రధాని వాజపేయితో సీఎం చంద్రబాబు

కేంద్రంలో పలుకుబడి... రాష్ట్రానికి ఉపయోగపడి..

తన తొలి ముఖ్యమంత్రిత్వ కాలంలో చంద్రబాబు ఢిల్లీ స్థాయిలో అపారమైన పలుకుబడి పొందగలిగారు. ఇది రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడింది. ఆయన మద్దతుతో మొదట దేవెగౌడ, తర్వాత గుజ్రాల్ ప్రధాన మంత్రులయ్యారు. ఆ ప్రయోగం విఫలమైన తర్వాత ఆయన వాజపేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. టీడీపీ ఎంపీల బలంతోనే వాజపేయి ప్రభుత్వం నిలబడి ఉన్నా... ఆ ప్రభుత్వంలో మంత్రి పదవులను చంద్రబాబు తీసుకోలేదు. లోక్‌సభ స్పీకర్ పదవిని మాత్రం తీసుకొని బాలయోగిని ఆ పదవిలో కూర్చోబెట్టారు. చంద్రబాబు సిఫారసుతోనే అబ్దుల్ కలాంను వాజపేయి రాష్ట్రపతిని చేశారు. చంద్రబాబు పలుకుబడి, పాలనా దక్షత ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంతో దేశానికి ఏ విదేశీ ప్రముఖుడు వచ్చినా ఢిల్లీ తర్వాత హైదరాబాద్‌కు వచ్చేవారు. ప్రపంచపటంలో చోటు హైదరాబాద్ సంపాదించడానికి ఈ పరిణామాలు ఉపయోగపడ్డాయి. జాతీయ క్రీడలను చంద్రబాబు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించడంతో ఆఫ్రో ఆసియా క్రీడలు నిర్వహించే అవకాశం కూడా ఆ సమయంలో రాష్ట్రానికి దక్కింది.

శాంతి భద్రతలు... భద్రం!

- అభివృద్ధికి అవే కీలకమని చంద్రబాబు చెప్పేవారు
- అధికారులకు పూర్తి స్వేచ్ఛ... ఏదైనా చెబితే వినేవారు
- ఆయన వద్ద కక్షసాధింపులు ఉండవు
- 'ఆంధ్రజ్యోతి'తో మాజీ డీజీపీ హెచ్‌జే దొర

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు వద్ద కక్ష సాధింపులు ఉండవని.. అభివృద్ధిపైనే ఆయన దృష్టి ఉంటుందని మాజీ డీజీపీ హెచ్‌జే దొర పేర్కొన్నారు. శాంతి భద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని అప్పట్లోనే నమ్మారని తెలిపారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా... అప్పుడు డీజీపీగా పనిచేసిన హెచ్‌జే దొర 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

చంద్రబాబు మిమ్మల్ని డీజీపీగా నియమించడానికి గల కారణం?

చంద్రబాబు చాలా ముందు చూపుతో పనిచేస్తారు. భవిష్యత్ పర్యవసానాలు గుర్తించి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ క్రమంలోనే సీనియర్లను కాదని నన్ను డీజీపీగా చేశారు. ఎక్కువ సర్వీస్ ఉన్నవారు చెప్పేది.. డిపార్ట్‌మెంట్ సీరియస్‌గా తీసుకుంటుందని, కేవలం ఏడాది సర్వీస్ ఉన్నవారికి డీజీపీ బాధ్యతలు ఇస్తే ఉపయోగం ఉండదనే ఆలోచనతో నన్ను డీజీపీగా నియమించారు.

శాంతి భద్రతలపరంగా అప్పుడున్న పరిస్థితులేమిటి?

శాంతిభద్రతలు చాలా ఘోరంగా ఉండేవి. పోలీస్ స్టేషన్లపై దాడి చేసి కానిస్టేబుళ్లను చంపేవారు. హైదరాబాద్‌లో రోడ్డు మధ్యన మందుపాతర పెట్టి పేల్చారు. శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని చంద్రబాబు భావించారు. దానికి అనుగుణంగా ఆదేశాలు జారీ చేశారు.

రాజకీయమంటేనే ఓటు బ్యాంకు గురించి ఆలోచించే పరిస్థితి ఉంటుంది కదా!

చంద్రబాబు వద్ద అలాంటిది ఉండదు. అభివృద్ధిపైనే దృష్టి ఉంటుంది. రాజకీయంగా ఒత్తిడి ఎన్నికల సమయంలోనే. పోలీసింగ్ ఎక్కువగా మాపై వదిలేసేవారు. మేం బాగా పనిచేస్తున్నామంటే కల్పించుకునే వారుకాదు.

'విజన్ 2020'పై మీకు ఏమనిపించింది?

చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా పనిచేశారు. సైబరాబాద్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇది చేస్తే భవిష్యత్ ఉందని భావించారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ భారతకు వచ్చిన సమయంలో డిల్లీలో అపాయింట్‌మెంట్ ఇప్పించాలని అధికారుల్ని అడిగారు. 10 నిమిషాలు అవకాశం కల్పించేలా చూడాలన్నారు. కానీ... కాఫీ టైంలో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఇక్కడి యువతకు చాలా ప్రతిభ ఉందని చెప్పి బిల్‌గేట్స్‌ను ఒప్పించారు. ఫలితంగానే మైక్రోసాఫ్ట్ మొదటిసారి అమెరికా బయట హైదరాబాద్‌లో ఏర్పాటైంది.

మీ హయాంలో టీడీపీ ఎమ్మెల్యేలు తప్పుచేస్తే పోలీసులు వదిలేసేవారా?

లేదు. టీడీపీ ఎమ్మెల్యేలు తప్పు చేసినా కేసులు పెట్టి అరెస్ట్ చేసేవాళ్లం. ఎందుకు అరెస్ట్ చేయాల్సి వచ్చిందో చంద్రబాబుకు వివరించేవాళ్లం. అప్పట్లో విపక్షాలపై పోలీసులను ప్రయోగించడం, ఫోన్‌ట్యాపింగ్ చేయడం వంటివి లేవు.

చంద్రబాబును అరెస్ట్ చేసిన సమయంలో మీకు ఏమనిపించింది?

రాజకీయం అని అర్థమైంది. కానీ, అన్ని రోజులు బెయిల్ ఎందుకు రాలేదనేది ఆశ్చర్యం అనిపించింది.

ఏపీలో గత 5 ఏళ్లలో గాడి తప్పిన శాంతిభద్రతలను సరిదిద్దడం సాధ్యమేనా?

చంద్రబాబు చేయగలరు. మంచి అధికారుల్ని నియమించుకున్నారు. ఆయనే ఒక దిశానిర్దేశం చేస్తారు.

సుపరిపాలనకు సెంటర్ పెట్టిన తొలి ముఖ్యమంత్రి

- రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీనారాయణ



అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలన సాగించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రం పెట్టిన మొదటి సీఎం చంద్రబాబు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రారంభించారు. 30 ఏళ్ల కిందటే చంద్రబాబు వినూత్నంగా ఆలోచించారనడానికి ఇదే ఉదాహరణ' అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ అన్నారు. చంద్రబాబు మొదటిసారి సీఎం అయినప్పటి నుంచి తొమ్మిదేళ్లపాటు లక్ష్మీనారాయణ ఆయనకు ఓఎస్డీగా పనిచేశారు. ఆనాటి బాబు పాల న, ఆయన ఆలోచన విధానాలను లక్ష్మీనారాయణ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకొన్నారు. 'ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి రాష్ట్రంలో 294 మంది ఎమ్మెల్యేలు, 42 మంది ఎంపీలు, 300 మంది ఐఏఎస్‌లు, 200 మంది ఐపీఎస్‌లు, 150 మంది ఐఎఫ్ఎస్‌లు ఉండేవారు. వీరి మైండ్ సెట్ మారిస్తే ప్రజలకు ఫలితాలు బాగా అందుతాయన్నది చంద్రబాబు నమ్మకం. అందుకే వీరికి సుపరిపాలనపై శిక్షణ ఇచ్చే పని మొదలు పెట్టారు. ప్రజల భాగస్వామ్యం పెంచడం కోసం జన్మభూమి, డ్వాక్రా సంఘాల ఏర్పాటును ప్రోత్సహించారు. సీఎంగా తొలినాళ్లలోనే ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయించారు. అప్పట్లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా దువ్వూరి సుబ్బారావు ఉం డేవారు. ఆయన తర్వాతి కాలంలో రిజర్వు బ్యాంక్ గవర్నర్ అయ్యారు. ఇవన్నీ చూసిన తర్వాతే ప్రపంచ బ్యాంక్ మొదటిసారిగా రాష్ట్రాలకు కూడా రుణాలు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం ముందుకు వెళ్తుందని ఎన్టీఆర్ బలంగా చాటారు. చంద్రబాబు ఆచరణ రూపం కల్పించారు. ముప్పై ఏళ్ల కిందట అభివృద్ధిపై ఇన్ని ఆలోచనలు చేయడం గొప్పవిషయం' అని అన్నారు.

అర్ధరాత్రి అయినా కలవగలిగే ముఖ్యమంత్రి

- 40 ఏళ్లుగా ఆయనతో నా ప్రయాణం గర్వకారణం: సోమిరెడ్డి



అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 'అర్ధరాత్రి అయినా వెళ్లి కలవగలిగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరే. 30 ఏళ్ల నుంచి ఇప్పటివరకు ఈ విషయంలో ఆయన ను మించిన ప్రజాస్వామిక నేత మరొకరు లేరు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. 'పాతికేళ్ల క్రితం నేను రాత్రి 11 గంటలకు ఆయన వద్దకు వెళ్లి టీపీటీ రైతుల సమస్య చెబితే అప్పటికప్పుడు జీవో జారీ చేయించారు. కడపలో ఒకసారి తీవ్రకరువుతో చీనీ తోటలు ఎండిపోతున్నాయి. రైతులు ఒక ట్యాంకర్ నీటికి రూ.500 పెట్టుకోవాల్సి వస్తోంది. రైతు పొలంలో నిలబడి నేను ఆయనకు ఫోన్ చేసి విషయం చెబితే ట్యాంకర్ ఖర్చులో రూ.400 ప్రభుత్వం భరించేలా ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లినవారు లేరు. కలిసేవారు లేరు. వాళ్లను చూసిన తర్వాత చంద్రబాబు విలువ మరింత తెలిసింది' అని సోమిరెడ్డి అన్నా రు. ఆదాయంలో హైదరాబాద్ త్వరలో ఢిల్లీని మించే అవకా శం ఉందని వార్తలు వస్తున్నాయని, దానికి చంద్రబాబు వేసిన పునాదే కారణం అని అందరికీ తెలుసునని అన్నారు. 'చంద్రబాబు నియంత కాదు. ప్రజాస్వామికవాది. నేను ఆయన మంత్రివర్గంలో మూడుసార్లు మంత్రిగా చేశాను. 40 ఏళ్లుగా ఆయనతో నా ప్రయాణం గర్వకారణం' అన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు: టీడీపీ

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి సెప్టెంబరు ఒకటో తేదీకి 30 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలకు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు లాంటి నాయకుడు దొరకడం రాష్ట్ర ప్రజల అదృష్టం. తెలుగు ప్రజల ఖ్యాతిని ఉన్నత స్థానంలో ఉంచడమే ఆయన లక్ష్యం. చంద్రబాబు దూరదృష్టికి ఎవరూ సాటి రాలేరు. ఆయన విధానాలను నేడు అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు. నవ్యాంధ్ర నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యం. నేటి తరాలకు ఆదర్శనీయుడు. ఎన్నో కష్టాలు, అవరోధాలను ఎదుర్కొని, రాష్ట్రం కోసం శ్రమించిన నేత చంద్రబాబు. ఆయన జీవితం తెరిచిన పుస్తకం. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడం, తెలుగు వారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తేవడంలో ఆయనకు ఆయనే సాటి. రాజకీయాల్లో అపర చాణుక్యుడిగా గొప్ప వ్యక్తుల ప్రశంసలు పొందారు. సమాజం పట్ల ఆయనకున్న శ్రద్ధ, చిత్తశుద్ధి, ఆయన ఆలోచనా విధానం, నేటి తరానికి ఆదర్శం. అధికారంలో ఉన్నా లేకున్నా.. ప్రజలతో మమేకమయ్యే ఏకైక నాయకుడు చంద్రబాబు. అలాంటి నేత ముఖ్యమంత్రిగా తొలి సారి బాధ్యతలు చేపట్టి మూడు దశాబ్దాలవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేసుకోవడం సముచితం' అని టీడీపీ నేతలు పేర్కొన్నారు.



విశాఖలో మరో రసాయన ప్రమాదం


ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు

- ఐదుగురు కార్మికులకు అస్వస్థత
- శ్రావణ్ షిప్పింగ్ కంపెనీలో ఘటన
- ఆస్పత్రికి బాధితుల తరలింపు

విశాఖపట్నం/మల్కాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో రసాయన ప్రమాదం జరిగింది. ఫార్మా కంపెనీకి చెందిన రసాయన పౌడర్ హ్యాండ్లింగ్ చేయడంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఐదుగురు అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి వెళ్లారు. అధికారులు సకాలంలో స్పందించి కార్పొరేట్ ఆస్పత్రికి తరలించడంతో నలుగురు కోలుకున్నారు. ఒకరికి శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. నగర పరిధిలోని ములగాడలో గల శ్రావణ్ షిప్పింగ్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. హైదరాబాద్‌కు చెందిన విర్కో లేబొరేటరీస్ కంపెనీ జ్వరానికి మందు తయారు చేయడానికి చైనాలో షాంఘై నుంచి అసిటానిలైడ్ అనే రసాయన పౌడర్‌ను దిగుమతి చేసుకుంటోంది. విశాఖపట్నం పోర్టుకు ఇటీవల 520 సంచులు రాగా శ్రావణ్ షిప్పింగ్ గోడౌన్‌కు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు పంపేందుకు వాటిని శుక్రవారం సాయంత్రం కంటెయినర్ నుంచి ట్రక్‌లోకి ఎక్కించారు. అన్ని రసాయనాల్లాగే దీని నుంచి కూడా కొంత వాసన వస్తుంది. సాయంత్రం వర్షం కురవడంతో సంచులు ఎత్తడానికి వచ్చిన ఐదుగురు కూలీలు తడవకూడదని లోపల ఉండిపోయారు. ఈ సమయంలో వాసన బాగా పీల్చారు. కొద్ది గంటల తరువాత అస్వస్థతగా ఉండడంతో పని ఇచ్చిన లేబర్ కాంట్రాక్టర్ జగదీశ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన సమీపంలోని సింహగిరి ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు వెంటనే కోలుకున్నారు. గంగరెడ్డి లత (37) అనే మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బంధువుల గొడవ చేశారు. విషయం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి తెలియడంతో ఆయన హుటాహుటిన అక్కడికి వెళ్లి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించాల్సిందిగా గోడౌన్ యాజమాన్యాన్ని ఆదేశించారు. మరోవైపు పోలీస్ కేసు నమోదు చేయించారు. అర్ధరాత్రి దాటాక విషయం తెలియడంతో ఎమ్మెల్యే గణబాబు ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడారు. ఆ తరువాత కలెక్టర్ హరేంధిర ప్రసాద్, యాజమాన్య ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. బాధితుల్లో లత తప్ప మిగిలిన నలుగురు పోతల కుమారి, గోతిరెడ్డి దేముడు నాయుడు, గుణుపూరు రాము, బొబ్బిలి లక్ష్మి కోలుకున్నారు.

ఆక్సిజన్ లెవెల్ తగ్గడం వల్లే..

అసిటానిలైడ్ పౌడరు వాసన ఎక్కువగా పీలిస్తే ఆక్సిజన్ స్థాయి తగ్గిపోతుందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేశ్ తెలిపారు. శ్రావణ్ షిప్పింగ్ గోడౌన్‌లో అదే జరిగిందన్నారు. సంచులు ఎత్తి, దించినపుడు కొన్ని సార్లు అవి చినిగి పౌడర్ కింద పడుతుందని తెలిపారు. ఆ వాసనను కలాసీలు ఎక్కువసేపు పీల్చడం వల్ల ఆక్సిజన్ తగ్గిపోయి మగతలోకి వెళ్లిపోయారని, సకాలంలో వైద్యం అందించడంతో ప్రమాదం తగ్గిందని పేర్కొన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● ఆదివారం 1 సెప్టెంబరు 2024

diksuchi@andhrajyothy.co



స్పాట్ అడ్మిషన్స్

జయశంకర్ వర్సిటీలో..

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న బీటెక్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లలో సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు.

సీట్ల వివరాలు

- సంగారెడ్డి జిల్లా-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 13 సీట్లు ఉన్నాయి.
- నిజామాబాద్ జిల్లా-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 4 సీట్లు ఉన్నాయి.

అర్హత : గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం చాలు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉన్నవారికి రూ.1300; టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ లేనివారికి రూ.2100
- **స్పాట్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 2న ఉదయం పదిన్నరకు
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** పదోతరగతి ఒరిజినల్ మెమో, ఇంటర్ మార్కుల పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం తదితరాలు
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, పీజేటీఎస్ఏయూ, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో..

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ- సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లు: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

అర్హత: యోగా థెరపీ అండ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగా విజ్ఞాన ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా చదివినవారికి/సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థులందరూ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 40 ఏళ్లు మించకూడదు. కర్మకాండలో ప్రవేశానికి సంబంధిత డిప్లొమా; నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌కు ఆచార్య లేదా సంస్కృతంలో పీజీ పూర్తిచేసి ఉండాలి. వెబ్ టెక్నాలజీకి ఆచార్య/విద్యార్థి చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయాలి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

అర్హత: టెంపుల్ కల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీతోపాటు టెంపుల్ కల్చర్‌లో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు లేదా ఏదేని పీజీ ఉత్తీర్ణులు; కర్మకాండ, జ్యోతిషం&వాస్తు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు లేదా ప్రాక్ శాస్త్రి ఉత్తీర్ణులు అర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు. ట్రాన్స్‌లేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయవచ్చు. వారానికి మూడు రోజులు సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు ఉంటాయి. ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధిస్తారు.

అర్హత: టెంపుల్ కల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; కర్మకాండ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం ఉన్నవారు; జ్యోతిషం, కమ్యూనికేటివ్ అండ్ ఫంక్షనల్ శాంస్క్రిట్, ట్రాన్స్‌లేషన్, మ్యూజిక్(ఓకల్), డ్యాన్స్(భరత నాట్యం), సితార్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in

ఎన్ఐఐలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ 2024-25 వింటర్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు. పూర్తి సమాచారం కోసం ఆగస్టు 31 నాటి ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 23
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** అక్టోబరు 7 నుంచి
- **ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** అక్టోబరు 27న
- **ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల:** నవంబరు 10న
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** 2025 జనవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nii.res.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో సివిల్స్ శిక్షణ



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(ఆర్‌సీఏ)- సివిల్స్ కోచింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఏదేని డిగ్రీ పూర్తిచేసి సివిల్ సర్వీసెస్(ప్రిలిమినరీ-మెయిన్స్) 2025 ఎగ్జామ్‌లకు సన్నద్ధమౌతున్న మహిళలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ పరీక్ష రాయవచ్చు. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ స్టడీస్ పేపర్. ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. రెండో పేపర్ ఎస్సే టైప్‌లో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 29
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** అక్టోబరు 4
- **ఇంటర్వ్యూలు:** అక్టోబరు 15 నుంచి 18 వరకు
- **ఇంటర్వ్యూ ఫలితాలు విడుదల:** అక్టోబరు 21
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** అక్టోబరు 25
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 28
- **రిజిస్ట్రేషన్ లింక్:** manuu.gleamapp-store.com/
- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

యోగా ఇన్‌స్టిట్యూట్‌లో ట్రెయినింగ్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై)- ఆన్‌లైన్ రెగ్యులర్ యోగా ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది హెల్త్ ప్రమోషన్ ప్రోగ్రామ్. దీని వ్యవధి ఒక నెల. ఉదయం ఏడు నుంచి ఎనిమిది వరకు మొదటి బ్యాచ్, ఎనిమిది నుంచి తొమ్మిది వరకు రెండో బ్యాచ్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. అలాగే సాయంత్రం ఆరు నుంచి ఏడు వరకు, మరల ఏడు నుంచి ఎనిమిది వరకు బ్యాచ్‌లు ఉంటాయి. ఆసక్తిగలవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

ఐటీబీపీలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 128

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) గ్రూప్-సి విభాగంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ)(పురుషులు/మహిళలు): **9 పోస్టులు**
2. కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్)(పురుషులు/మహిళలు): **115 పోస్టులు**
3. కానిస్టేబుల్(కెన్నెల్‌మన్)(పురుషులు మాత్రమే): **4 పోస్టులు**

అర్హత: హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 12వ తరగతి, వెటర్నరీలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సు; కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 10 నాటికి హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్(కెన్నెల్‌మన్) పోస్టులకు 18-27 ఏళ్లు; కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్) పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పే స్కేల్: హెడ్ కానిస్టేబుల్‌కు రూ.25,500. కానిస్టేబుల్‌కు రూ.21,700.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్/ఫైర్ పోస్టులు



మొత్తం ఖాళీలు: 1130

కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)...కానిస్టేబుల్/ఫైర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో 32, తెలంగాణలో 26 ఖాళీలు ఉన్నాయి.

పోస్టు: కానిస్టేబుల్/ఫైర్(పురుషులు)

మొత్తం ఖాళీల సంఖ్య: యూఆర్-466, ఈడబ్ల్యూఎస్-114, ఎస్సీ-153, ఎస్టీ-161, ఓబీసీ-236

అర్హత: అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి 12వ తరగతి సైన్స్ సబ్జెక్టులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఈఎస్ఎం/ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 30 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.

శారీరక ప్రమాణాలు: ఎత్తు కనీసం 170 సెం.మీ., ఛాతీ 80-50 సెం.మీ. ఉండాలి.

జీతభత్యాలు: నెలకు రూ.21,700 - రూ.69,100

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, రాత పరీక్ష(ఓఎమ్మార్/సీబీటీ), డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం అభ్యర్థులకు దరఖాస్తు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

రాత పరీక్ష విధానం: పరీక్షను ఓఎమ్మార్/కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. 100 ప్రశ్నలు ఉంటాయి. 100 మార్కులు కేటాయించారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు - 25 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు - 25 మార్కులు), ఎలిమెంటరీ మేథమెటిక్స్(25 ప్రశ్నలు - 25 మార్కులు), ఇంగ్లీష్/హిందీ(25 ప్రశ్నలు - 25 మార్కులు). నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్: cisfrectt.cisf.gov.in/

'ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్'లో ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 37

నోయిడాలోని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ)... డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ డైరెక్టర్: **2 పోస్టులు**
2. అసిస్టెంట్ హైడ్రోగ్రాఫిక్ సర్వేయర్: **1 పోస్టు**
3. లైసెన్స్ ఇంజన్ డ్రైవర్: **1 పోస్టు**
4. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్: **5 పోస్టులు**
5. డ్రెడ్జ్ కంట్రోల్ ఆపరేటర్: **5 పోస్టులు**
6. స్టోర్ కీపర్: **1 పోస్టు**
7. మాస్టర్ సెకండ్/థర్డ్ క్లాస్: **4 పోస్టులు**
8. స్టాఫ్ కార్ డ్రైవర్: **3 పోస్టులు**
9. మల్టీ టాస్కింగ్ స్టాఫ్: **11 పోస్టులు**
10. టెక్నికల్ అసిస్టెంట్: **4 పోస్టులు**


అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్, డిప్లొమా, డిగ్రీ(మెకానికల్/సివిల్/మెరైన్/నావల్/ఆర్కిటెక్చర్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.200.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: https://iwai.nic.in/



లిటిల్స్



మీకు తెలుసా?

● రాళ్లల్లో కలిసిపోయినట్లుండే.. చూడగానే రాయిలా కనిపించే ఈ చేపను 'స్టోన్ ఫిష్' అని పిలుస్తారు.

● ప్రపంచంలో ఉండే విషప్రాణుల్లో ఇవి ప్రమాదకరం. పాముకాటులానే ఉంటుంది. నొప్పి, రక్తస్రావంతో పాటు నాడుల మీద పనిచేసి కిందపడిపోవటం, గుండెపోటు లాంటివి సంభవిస్తాయి.

● 40 సెం.మీ ఉండే ఈ చేప ఎరుపు, పసుపు, నలుపు ఇలా వివిధ రంగుల్లో కనిపిస్తుంది. వాతావరణానికి తగినట్లు రంగుమారుతుంది. రాళ్లమధ్యలో ఉంటే రాయిలానే ఉంటుంది.

● ఈ విషంతో ఇతర చిన్న జీవులను చంపి ఆరగిస్తుంది. ఇవి



నెమ్మదిగా ఈదుతాయి. అయితే దాడి చేయాలనుకుంటే మాత్రం 0.015 సెకన్స్‌లోనే అవతలి జీవిని కొరికేస్తుంది.

● నీళ్ల బయట పడితే రోజుపాటు జీవించగలవు. వీటి శరీరంపై ఉండే ప్రత్యేక కణ నిర్మాణం వల్లే ఇలా జీవించగలుగుతాయి.

● ఇవి ఇండో పసిఫిక్ ప్రాంతాల్లో అధికంగా ఉంటాయి. బరువు సుమారు రెండు కేజీలుంటాయి.

● వీటిని సముద్రంలోని పాములు వేటాడి తింటాయి. వీటి జీవనకాలం 5 సంవత్సరాలనుంచి 10 ఏళ్ల వరకూ!

● ఏదైనా జీవి తన దగ్గరకు వస్తోందంటే తెలివిగా నటిస్తాయి. రాళ్లలో కలిసిపోయి కదలకుండా ఉంటాయి. చనిపోయిందేమోనన్న అనుమానం కలిగేలా ఉంటుంది. అయితే దాన్ని ఏ జీవి అయినా కెలికితే మాత్రం దాడి చేస్తుంది.

8 తేడాలను కనిపెట్టండి







దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 399

	4	8		9		1		3
9		1	3				6	
6			4					2
7	8				5	6		
		5	9				7	8
5					3			6
	2				9	3		5
3		7		6		8	4	

సుడోకు - 398 సమాధానం

4	1	5	7	6	8	3	2	9
6	9	2	3	1	4	5	7	8
8	7	3	9	5	2	4	6	1
1	5	7	2	4	6	9	8	3
2	6	9	8	3	5	7	1	4
3	8	4	1	9	7	6	5	2
7	3	6	4	8	1	2	9	5
5	4	1	6	2	9	8	3	7
9	2	8	5	7	3	1	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.